
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



వెల
4 అణాలు

సంపుటము 42 సంచిక 16


డిశంబరు 14 1949

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

వార్తా చిత్రాలు



చెన్నరాష్ట్ర విభజనసంఘ సమావేశము:—ప్రధాని కుమారస్వామిరాజాగారు అధ్యక్షతవహించిరి. శ్రీ ప్రకాశం, వెంకట్రావు, మంత్రి సంజీవరెడ్డి, టి. టి. కృష్ణమాచారి, మంత్రి భక్తవత్సలంగారలు హాజరైరి. విభజన సంఘకార్యదర్శి, విభజనశాఖ కార్యదర్శిఅయిన ఎన్. వెంకటేశ్వరన్ ఐ. సి. ఎస్. గారుగూడా హాజరై వుండిరి.



భోల్పూరులో ప్రపంచశాంతిసభకు డా॥ కె. ఎన్. ఖట్జు, రాజకుమారి అమృతకౌరుగార్లు వచ్చుట



డా॥ రాజేంద్రప్రసాద్ 66 వ జన్మదినోత్సవసమయంలో పం॥ నెహ్రూ ఆయన నభినందిస్తున్న దృశ్యం



ఇటీవల అమెరికాలో జరిగిన నీగ్రో మహిళల జాతీయమహాసభకు అధ్యక్షుడు ట్రూమన్ గౌరవాతిథిగా ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంలో ట్రూమన్ మహిళాసంఘం వ్యవస్థాపకురాలు మేరీ మాక్లియోడ్ బెత్యూన్‌సతిని అభినందించారు. మానవజాతికి ఇతోధిక సేవచేసినవారుగా కొంతమందికి ప్రత్యేక బహుమానాలిచ్చారు. అలాంటి బహుమానాలు శ్రీమతి విజయలక్ష్మి పండిట్, రాల్ఫ్‌బంచ్ గార్లుకూడా స్వీకరించారు. చిత్రంలోవున్నవారు: ట్రూమన్, బెత్యూన్‌సతి, విజయలక్ష్మి పండిట్, బంచ్.



ట్రిప్లికేన్ అర్బన్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన భవనాలకు శంకుస్థాపన చేస్తున్న మద్రాసు గవర్నర్

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0

ప్రతిక. అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 42

సంచిక 16

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర మార్గశిర బహుళ నవమి బుధవారము



నాగజాతి సిపాయికి గవర్నరుజనరల్ మిలిటరీ మెడలు తగిలించు దృశ్యం.



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ డిశంబరునెల 14-వ తేది బుధవారము

విభజనసంఘ ప్రథమ కర్తవ్యము

ఏమైనప్పటికిని ఆంధ్రరాష్ట్ర స్థాపన కార్యకలాపమును 1950 జనవరి 26 లోపున పూర్తిచేయుట అసాధ్యమని తీర్మానించినప్పటికిని మద్రాసు మంత్రి వర్గము కేంద్రప్రభుత్వ హోంశాఖా కార్యదర్శి లేఖమేరకు ఎనమండుగురు సభ్యులతో 'విభజన సంఘము'ను ఏర్పరచుట, అందు సభ్యులుగ ప్రభుత్వపరిపాలన అనుభవముగల వారిని నియమించుట కొంతవరకు హర్షింపతగిన విషయము. విభజన సంఘఅధ్యక్షుడు ప్రధాని కుమారస్వామిరాజాగారు విభజనసంఘ నియామకవార్తను వెల్లడించుచు ఏప్రెల్ 1 వ తేదీలోపున ఆంధ్రరాష్ట్రస్థాపన అసాధ్యమని ప్రకటింప, విభజన సంఘ సభ్యులైన శ్రీ కళా వెంకట్రావు గారు, శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారుకూడ నూతన రాజ్యాంగములోని రాష్ట్రముల జాబితాలో ఆంధ్రను పేర్కొనుట సాధ్యమగునట్లు, ఈ విభజనసంఘము సంకల్పించిన యావత్తు కార్యకలాపమును పూర్తి చేయుట అసాధ్యము గాదని అభిప్రాయ పడుచుండిరి. ప్రధానికుమారస్వామి రాజాగారికి వీరిట్లు అభిప్రాయపడు చుండిరని తెలుపగా విభజనసంఘము నందు మంత్రులు అయిదుగు రుండి రనియు, వారు సాధ్యము గాదని చెప్పి నపుడు విభజనసంఘమునందలి ఇతర సభ్యులు ఎట్టియభిప్రాయము తెలిపినను ప్రయోజనము లేదన్నట్లు చెప్పిరి.

విభజనసంఘము మొదటి పర్యాయము సమావేశమైనది. విభజనకార్యక్రమమునకు సంబంధించిన మూలసిద్ధాంతములను వీరు చర్చించినట్లు తెలియుచున్నది. భారత ప్రభుత్వ హోంశాఖాకార్యదర్శి లేఖాంశములను పరిశీలించి విభజన వివరములను పరిష్కరించుట సాధ్యమగునా కాదా యనువిషయమును ముందుగ ఈ సంఘమువారు నిర్ణయింప వలసియుండెను. ఈ సంఘమువారీ విషయములను పరిశీలించి ఒక అభిప్రాయమునకు రాగలుగుటకు పూర్వమే సంఘాధ్యక్షుడు అట్టి విభజన జనవరి 26 లోపున పూర్తి గాదని తీర్పు నిచ్చుట భావ్యము గాదు. ప్రభుత్వ కార్యదర్శులుమాత్రము జనవరి 26 లోపుగ ఈ విభజనవివరము లన్నియు పరిష్కారము కావలెనని నిర్ణయమైన ఆ ప్రకారము పనిని ముగించుట సాధ్యమని అభిప్రాయపడుచున్నట్లు తెలియు చున్నది. ఆంధ్రరాష్ట్రమునకు చెన్న పట్టణము తాత్కాలిక రాజధానిగ నున్న విభజనకలాపమును ముగించుట సులభమని మే మిదివరలో చేసిన సూచనకు ప్రభుత్వ కార్య దర్శులు ఆమోదమును ప్రకటించి నట్లు కూడ తెలియుచున్నది. ఇందు వలన 1950 జనవరి 26 లోపున గవర్నరుజనరల్ ఉత్తరువు వెలువడి నూతన రాజ్యాంగమునందలి రాష్ట్రముల జాబితాలో ఆంధ్రను పేర్కొనుట విభజనసంఘసభ్యుల కార్య విధానముపై ఆధారపడియున్నది. జనవరి 26 లోపునే ఉత్తరువు వెలువడ వలెనను పట్టుదల విభజనసంఘ సభ్యులకుండిన విభజనసంఘ కార్యక్రమమంతయు జనవరి 15 వ తేదిలోపుగ పూర్తి కాగలదు.

రాష్ట్రస్థాపన ఉత్తరువు, రాష్ట్ర నిర్మాణము ఒక్కటే యనుభావము విభజనసంఘసభ్యులలో కొందరికి వున్నట్లు కన్పించుచున్నది. కనుకనే కొందరు విభజనలో తొందరపాటు కూడదనుచుండిరి. గవర్నరుజనరల్ ఉత్తరువుతో ఆంధ్రరాష్ట్రము అవతరింపదు. ఆంధ్రరాష్ట్ర స్వరూపనిర్వచనము మాత్రమే ఇందు జరుగును. రాష్ట్రావతరణ ఎప్పుడు, ఏ రూపమున జరుగునో గవర్నర్ జనరల్ ఉత్తరువు వివరించును. కనుక తక్షణము రాష్ట్ర మేర్పడినగాని రాష్ట్రముల షెడ్యూలులో ఆంధ్రను పేర్కొనుటకు వీలు లేదనువాదము సహేతుకముగ కన్పించుటలేదు. షెడ్యూలులో చేర్చినంత మాత్రమున నూతన రాజ్యాంగము అమలుజరుగుటతోబాటు ఆంధ్ర రాష్ట్రము కూడ అమలుకు రావలెనను నిర్బంధము లేదు. రిపబ్లిక్ రాజ్యాంగమున ఆంధ్రరాష్ట్రమును పేర్కొని, ఆ రాష్ట్రము ఏ తేదీనుండి అమలుకు రానున్నదో కూడ స్పష్టముగ ప్రకటించిన తదనుగుణముగ ఇపుడు గవర్నరు జనరల్ ఉత్తరువును తయారుచేసి 1935 వ సంవత్సరము భారతప్రభుత్వచట్ట ప్రకారమే ఆంధ్రరాష్ట్రస్థాపన ఉత్తరువును జారీ చేయవచ్చును. సాకల్యముగ నిదియు అసాధ్యము గాదు. విభజనసంఘము ఈ దృష్టితోనే భారత ప్రభుత్వ హోంశాఖాకార్యదర్శి లేఖాంశములను పరిశీలించి నిర్ణయము చేయవలసియుండును. ఆస్తి, అప్పుల విభజన, ఉద్యోగుల 'పంపకము' మున్నగువివరములను సావధానముగ పరిష్కరించుకొనవచ్చును. అట్టి పరిష్కారమునకు గవర్నరుజనరల్ ఉత్తరువు ప్రతిబంధకము కానేరదు. ఆంధ్ర, తమిళ కాంగ్రెసుసంఘములు తెలిపిన ఆంధ్రప్రాంతములతో, చెన్నపట్టణము ఆంధ్ర ప్రభుత్వమునకు తాత్కాలిక కార్యస్థానముగ విభజన సంఘము నిర్ణయించిన ఆస్తి, అప్పులతో ఆంధ్ర రాష్ట్ర నిర్మాణము కావలెను అని విభజనసంఘము తీర్మానించిన, ఆ ప్రకారము గవర్నరు జనరల్ ఉత్తరువు సకాలములో జారీ కాగలదు. విభజనసంఘము ఇందుకు అనుకూలమగు నిర్ణయమును చేయునని ఆశించుచున్నాము.

హైదరాబాద్ కాంగ్రెస్ తగాయిదా పరిష్కారం

సంస్థానశాఖామాత్యుడు సర్దార్ వల్లభాయిపటేల్ జోక్యమువలన ఒక సంవత్సరముగ హైదరాబాద్ రాజకీయములను కలుషితము చేసిన 'కాంగ్రెస్‌వాదుల స్పర్థలు' అన్ని వర్గములకు తృప్తికరముగ పరిష్కారమైనవి. లోగడ సర్దార్ పటేల్ హైదరాబాద్ వచ్చినపుడు ఇదే విధముగ ఇరుపక్షముల ప్రతినిధులను సమావేశపరచి, ఒక ఒడంబడికను కుదిర్చెను. కాని ఆ ఒడంబడిక సర్దార్ పటేల్ సంస్థానమును వదలి వెళ్లిన ఉత్తరక్షణమున భగ్నమైనది. అప్పటి నుండియు తిరిగి సామరస్యమును సాధించుటకు జరిగిన అన్ని ప్రయత్నములు విఫలమయ్యెను. విభేదములు తీవ్రమయ్యెను. ఈ విభేదములు, కాంగ్రెస్‌వాదుల స్పర్థలు సంస్థాన భవిష్యత్తుకు ముప్పుతెచ్చిపెట్టునవిగ పరిణమించెను. ఈ స్థితిలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ తిరిగి ప్రమేయము కల్గించుకొని సమాధానమును కుదిర్చి, మార్చిలో జరుగనున్న రాజ్యాంగ పరిషత్తు ఎన్నికలలో కాంగ్రెసువాదులు తమ బాధ్యతలను నిర్వహించుటకు అవకాశము కల్పించెను.

సంస్థానమునందలి, ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతములందు సంస్థానకాంగ్రెసు స్పర్థలు తీవ్రమై ఆయాప్రాంతీయుల ఐక్యతకు ప్రతిబంధకమయ్యెను. అందువలన కాంగ్రెసు ప్రాథమికఎన్నికలందు కార్జన్యచర్యలుకూడ జరిగినవి. కేంద్ర కాంగ్రెసుసంస్థ అధ్యక్షుని ఎన్నికవిషయమున కుదిరిన సమాధానము, ఇతర ప్రాంతీయ కాంగ్రెసు సంఘములందు ప్రబలిన వివాదములను పరిష్కరించి ఐక్యతను సాధించుటకు ఉపయోగపడవచ్చును.

హైదరాబాదు రాజ్యాంగ పరిషత్తుకు మార్చిమాసమున ఎన్నికలు జరుగుట తథ్యము. ఆ ఎన్నికలందు కాంగ్రెస్ అభ్యర్థులు విజయమును గాంచుటకూడ తథ్యమే. కాని కాంగ్రెస్ అభ్యర్థులు భిన్నపక్షములకు ప్రాతినిధ్యమువహించి ఒకరితో నొకరు పోటీపడుటకంటె ముందుగనే ఒక సమాధానమునకు వచ్చి నిర్దుష్టప్రణాళికపై ఎన్నికలందు గెలుపొందిన సంస్థాన రాజకీయభవిష్యత్తు విషయమునవేగాక, సంస్థానమునందిక ముందు అమలుజరుపవలసిన ఆర్థిక సాంఘికసంస్కరణల విషయమున కూడ తమ అభిప్రాయములను అమలు జరుపుకొనుటకు ఎక్కువ అవకాశము ఉండగలదు. మార్చిఎన్నికల ఫలితముగా రాజ్యాంగపరిషత్తు ఏర్పడిన అనంతరము ఎంతోకాలము ఇప్పటి మంత్రివర్గము అధికారమునందుండదు. కాంగ్రెస్‌పక్షనాయకుని ఎన్నిక జరిగి, నాయకులు తమ బాధ్యతను నిర్వహింపగలరని ధ్రువపడినవెంటనే సంస్థానమున ప్రజాప్రతినిధిప్రభుత్వ మేర్పడగలదు. ఇట్టి ప్రభుత్వస్థాపనలో ఇంక ఏమాత్రము కాలహరణము ఉండరాదు; ఉండదనియే భావింపవచ్చును. కనుక ఇంకనుండి సంస్థాన కాంగ్రెస్ నాయకులు ఇప్పటి ఒడంబడికను కుదుర్చుకొనుటలో ప్రదర్శించిన సమాధానవైఖరినే ప్రదర్శించి సంస్థాన సమస్యల పరిష్కారమును సుకరము చేయుదురని విశ్వసించుచున్నాము.

ముఖచిత్రం

కుంభకోణం రామస్వామి ఆలయంలో ఒక విగ్రహము

ఛాయాచిత్రకారుడు:—
ఆర్. కృష్ణన్, మద్రాసు

మనరాష్ట్రం : మనదేశం:

★ హైదరాబాద్ కాంగ్రెస్ విభేదాల పునః పరిష్కారం ★

హైదరాబాద్ సంస్థాన కాంగ్రెస్‌లో విభేదాలను సర్దార్ పటేల్ తిరిగి పరిష్కరించారు. కాని ఈ విభేదాలు తిరిగి తలెత్తవని ఎక్కడా రూఢిలేదు. కిందటిపర్యాయం సర్దార్ పటేల్ హైదరాబాద్ సందర్శించి ఉభయకక్షులను స్నేహ సఖ్యతా పరిచారు. కాని పటేల్ హైదరాబాద్ వెళ్లినవెంటనే కక్షులు ఎప్పటిమాదిరిగా అయాయి.

ఇప్పుడు సంస్థానభవిష్యద్రాజ్యాంగ రూపాన్ని ప్రజలు నిర్ణయించవలసిఉన్నారు. నైజాం నవాబు గతమాసంలోనే హైదరాబాద్‌కు భారతరాజ్యాంగపరిషత్తు నిర్మించిన రాజ్యాంగాన్నే అమలుజరపగలరని ఫర్మానా ఇచ్చారు. అయినప్పటికీ సంస్థానభవిష్యద్రాజ్యాంగస్వరూపాన్ని నిర్ణయించవలసినది ప్రజలేనని భారతప్రభుత్వం ఆరంభంలో ప్రకటించింది. ఆ సిద్ధాంతంప్రకారం నైజాం ఫర్మానాను తుదినిర్ణయంగా ఎంచడానికి వీల్లేదు. ప్రజలు నిర్ణయాని కొచ్చేవరకూ తాత్కాలికంగా అమలుజరపడానికే నైజాం ఫర్మానా వినియోగపడుతుంది.

1950 మార్చి 8వ తేదీని హైదరాబాద్‌లో ప్రజలొక రాజ్యాంగపరిషత్తు నెన్నుకుంటారు. ఆరాజ్యాంగపరిషత్తే హైదరాబాద్ భవిష్యద్రాజ్యాంగాన్ని నిర్ణయిస్తుంది. సంస్థానం భారతరిపబ్లిక్‌లో చేరడానికే రాజ్యాంగ పరిషత్తు నిర్ణయించితీరుతుందని రూఢిగా చెప్పవచ్చును. సంస్థానప్రజల అభిమతం ఏ రీతిగా ఉందో అందరికీ విదితమే. అది ఎంత స్పష్టమైనదైనప్పటికీ ఎన్నికలు, రాజ్యాంగ పరిషన్నిర్ణయము, వారి తీర్మానము అవసరం.

అందువల్ల ఈ ఎన్నికల్లో సంస్థానకాంగ్రెస్ తమ ఆశయాల్ని ప్రజలకి స్పష్టపరచవలసి ఉన్నారు. ఎన్నికల్లో సోషలిస్టులు కూడా పోటీ చెయ్యనున్నారుకాబట్టి కాంగ్రెస్ ఇప్పటినుంచీ ప్రజల్లో తమ లక్ష్యాలను ప్రచారంచేసి ఎన్నికలకు సిద్ధపడాలి. ఎన్నికల నివేదిక నొకదాన్ని సంస్థానకాంగ్రెస్ సిద్ధంచెయ్యవలసి ఉంది.

సంస్థానకాంగ్రెస్‌పై ఇంత బాధ్యత ఉండగా, ఈ తరుణంలో ప్రజలకొక సుస్పష్టమైన మార్గాన్ని చూపవలసిన అవసరం ఉండగా సంస్థానకాంగ్రెసు తన కాలాన్నంతనీ అంతఃకలహాలతోనూ, కక్షలతోనూ వ్యర్థపుచ్చడంవల్ల ఎంత ప్రమాదం ఉందో సులువుగానే గ్రహించవచ్చును.

కాంగ్రెస్‌లోని కక్షులు అన్ని ప్రాంతాలకూ ఇంతకుముందే పాకిపోయినవి. ఏ ప్రాంతంలో చూసినా రెండుపక్షాల కాంగ్రెస్ వాదులు పరస్పరవిరుద్ధఆందోళన సాగిస్తున్నారు. ప్రజలలో తాము నిర్వర్తించవలసిన విధిని మరిచారు. వీరి కక్షులవల్లనే సంస్థానంలో కమ్యూనిస్టుప్రమాదాన్ని అణచడంలో మొదట కొంత కష్టమయిందని మిలిటరీప్రభుత్వం ఒకప్పుడు తెలిపింది.

ఇప్పటికైనా, సమయానికి, సంస్థాన కాంగ్రెస్‌లో ఉభయకక్ష్యలకీ మధ్య సర్దార్ పటేల్ సమాధానం కుదర్చగలిగారంటే సంస్థానప్రజలకు ఆనందదాయకంగా ఉంటుంది. స్వామీ రామానందతీర్థవర్గంవారూ, బూర్గుల రామకృష్ణారావు వర్గంవారూ కలిసి దిగంబరరావు బిందూగారిని సంస్థాన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు సిద్ధపడవలసిఉన్నందువల్ల ఇకనుంచి ఉభయపక్షాలవారూ కక్షులను మరిచిపోయి సఖ్యతతో ప్రవర్తించగలరని ఆశించవచ్చును.

వెంటనే సంస్థాన కాంగ్రెసు హైదరాబాద్ భవిష్యద్రాజ్యాంగస్వరూపంగురించి ఒక నిర్ణయం చేసుకోవలసిఉంది. వారు సంస్థానాన్ని భారతరిపబ్లిక్‌లో చేర్చే మాట తథ్యం. పోతే ఇంక సంస్థానాన్ని ఎప్పటిమాదిరిగా ఉంచి ప్రత్యేకమండలంగా పరిపాలించడమా, లేక మూడుభాషామండలాలుగా విభజించి సమీప రాష్ట్రాలతో చేర్చడమా అనే సమస్య ఉంది. ఈసమస్య సందర్భంలో ఇదివరకే సంస్థానకాంగ్రెస్, తెలంగాణా కాంగ్రెస్, కన్నడ కాంగ్రెస్, మరాఠ్వాడా కాంగ్రెస్‌లు అన్నీ సంస్థానాన్ని భాషామండలాలుగా విభజించి సమీపరాష్ట్రాల్లో చేర్చాలని తీర్మానాలు చేశాయి. ఇప్పుడీ విధానాన్ని ఐక్య కాంగ్రెస్ సంఘాలు పునర్విచించవలసిఉంది. ఈ విషయమై ఎన్నికలసందర్భంలో ప్రజల అభిప్రాయాన్ని సేకరించవచ్చును. ప్రజాభిప్రాయం పూర్వతీర్మానాలకు అనుకూలంగా ఉన్నదనే భావించవచ్చును. అయినా మార్చి 8వ తేదీని జరగబోయే ఎన్నికల్లో ఈ విషయం స్పష్టపడ్డం మంచిది.

హైదరాబాద్ రాజ్యాంగం ఎలాగూ మారక తప్పదు. సార్వజనీననియోజకవర్గం ఎన్నుకునే రాజ్యాంగశాసనసభ స్థాపితం కావడం, బాధ్యతాయుతప్రభుత్వం ఏర్పడ్డమే హైదరాబాద్ చరిత్రలో అపూర్వపరిణామం కాగలదు. ఇప్పుడే భాషామండలాలుగా విభజించి సమీప భాషారాష్ట్రాలతో చేర్చినట్లయితే ఈ పరిణామానికి విశిష్టత సమగ్రత చేకూరగలదు. ఇప్పటికి బాధ్యతాయుతప్రభుత్వాన్ని స్థాపించి ఉత్తరోత్తరా భాషామండలవిభజన చెయ్యడం అంటే రెండుపర్యాయాలు రాజ్యాంగసంస్కరణలు ప్రవేశపెట్టడం అవుతుంది. ఇది అనవసరం. సంస్థానాల్ని విభజించి సమీపరాష్ట్రాలలో చేర్చడంలో పటేల్ సంస్థానాల శాఖ ఇప్పటికే ఆరితేరింది. ఇప్పుడీ హైదరాబాద్ విభజన వారికి కష్టం కాదు. ఇట్టి విభజనకు పెద్ద ఆటంకాలేవీ ఉండవు. హైదరాబాద్ నగర భవిష్యత్తు విషయమైకూడా సంస్థానకాంగ్రెస్ ఇప్పుడే ఏదో నిర్ణయానికి రావచ్చును. దక్కన్‌లో కేంద్రస్థానమైన హైదరాబాద్‌లో భారతప్రభుత్వం సైనిక దళఉపకార్యాలయాన్ని స్థాపించవలసిఉండవచ్చును. అక్కడ సైనికబలాల్ని పెంచవలసిన అవసరం ఉండవచ్చును. అంటే హైదరాబాద్ భారతప్రభుత్వానికి అవసరం రావచ్చును. అయితే ఇదివరలోవలెనే సికందరాబాద్‌లో కేంద్రప్రభుత్వం తమ సైన్యాలను నిలవరించి, హైదరాబాద్ నగరాన్ని సంస్థానానికి విడిచిపెట్టవచ్చును. ఇందులో ఏపక్షానికీ ఆక్షేపణ ఉండడానికి కారణా లేవీ లేవు.

కాబట్టి సంస్థానకాంగ్రెసువిభేదాలను మరచి కార్యాచరణకి దిగవలసిన సమయం వచ్చింది. ఈబాధ్యతను సంస్థానకాంగ్రెస్ నాయకులు స్మరించి సమాధానాని కొడబడ్డారు.

ప్రభుత్వపక్షాన అధికారులు ఎన్నికల కోసం అతివేగంగా సన్నాహాలు చేస్తున్నారు. నియోజకవర్గ జాబితాల తయారీ చాలవరకు పూర్తికావచ్చింది. డిసెంబరు 1 నుంచి శ్రీ యం. కె. వెల్లోడీ ప్రధానిగా ప్రభుత్వాధికారం నిర్వహిస్తున్నారు. సంస్థానంలో కమ్యూనిస్టుల అరాచక చర్యలు దాదాపు అంతరించాయి. ఇంక ఎన్నికలు జరపడానికి తగిన శాంతి సంస్థానంలో ఏర్పడిందని చెప్పవచ్చును.

హైదరాబాద్‌లో "పోలీసుచర్య" తీసుకున్నందువల్ల భారతసైన్యాలకైన ఖర్చును హైదరాబాద్ ప్రభుత్వంనుంచి రాబట్టగలరని సర్దార్ పటేల్ పార్లమెంట్‌లో తెలియపరిచారు. ఇప్పుడు హైదరాబాద్‌లో భారత ప్రభుత్వంపంపున పరిపాలన సాగిస్తున్న సివిల్ ఉద్యోగులకు వేతనాలను హైదరాబాద్ ప్రభుత్వమే చెల్లిస్తోంది.

(సూర్యనారాయణ)

నేటిప్రపంచం:

★ చీనాలో అంతర్యుద్ధసమాప్తి: కమ్యూనిస్టుల విజయం ★

చీనాలో అంతర్యుద్ధం దాదాపు సమాప్తిచెందినట్లే. కమ్యూనిస్టులకు అఖండవిజయం లభించింది. కొమింటాంగ్ ప్రభుత్వం ఫాసిజానికి తగ్గిపోవడంతో చీనాచరిత్రలో నూతనయుగం ప్రారంభమయిందని చెప్పవచ్చును. చిరకాలంగా చీనాలో ఎక్కడో ఒకచోట అంతర్యుద్ధం లేకుండా ఎన్నడూ లేదు. చీనాలో యుద్ధనాయకుల్ని అణచివేసి 1922 లో రిపబ్లిక్‌ను స్థాపించిన సన్ యట్ సెన్ కింద ఏకొద్దిరోజుల్లో చీనాలో శాంతి ఏర్పడింది. కాని సన్ యట్ సెన్ మృతితో తిరిగి చీనా కల్లోలంలో పడిపోయింది.

చీనాకమ్యూనిస్టుపార్టీ 1921 లో షాంఘైలో స్థాపించబడింది. అప్పటినుంచి సన్ యట్ సెన్ మృతిచెందేవరకూ కమ్యూనిస్టులు కొమింటాంగ్‌తో చేరి దేశఆర్థికాభివృద్ధికి పాటుపడ్డారు. కాని ఈ స్నేహం చిరకాలం సాగలేదు. మొదటినుంచీ కమ్యూనిస్టులపట్ల బద్ధవైరంవహించిన చియాంగ్ కై షేక్ రిపబ్లిక్ ప్రధాని అయినాడు. కమ్యూనిస్టులతో మైత్రి అంటే వారికి లొంగిపోవడమేనని చియాంగ్ మొదటనే గ్రహించాడు. 1927 లో కమ్యూనిస్టులు కొమింటాంగ్‌నుంచి పూర్తిగా చీలిపోయి కత్తిగట్టారు. ప్రభుత్వాన్ని పడగొట్టి అధికారం హస్తగతం చేసుకోవడం వారి లక్ష్యం. చీనా కమ్యూనిస్టు సైన్యం 1925 లో నిర్మించబడింది. షాంఘైసమ్మె, సాయుధవిప్లవం భగ్నం కావడంతో కమ్యూనిస్టునాయకత్వం లై లె సాన్ హస్తాలనుంచి మావ్ సిటుంగ్ హస్తాలకు మారింది. సైన్యదళాల్ని నిర్మించి, అంతర్యుద్ధాల్ని నడిపినవాడు చూతే. లై లె సాన్ నిష్క్రమణతో చీనాకమ్యూనిస్టుల ప్రచారం పారిశ్రామికకార్మికులనుంచి వ్యవసాయదారులవైపుకు మళ్లింది. లై లె సాన్ రష్యా పారిపోయాడు.

షాంఘైవిప్లవం భగ్నం కావడంతో కమ్యూనిస్టులు దక్షిణచీనాలోని కియాంగ్సీ రాష్ట్రంలో చేరారు. అక్కడ మావ్ సీటుంగ్ చియాంగ్ ప్రభుత్వాన్ని ఎదిరించి కమ్యూనిస్టుల పరిపాలన స్థాపించాడు. మూడేళ్లు కమ్యూనిస్టు ప్రధానకార్యాలయం చింకాన్ షాన్ అనే చోట దుర్గమమైన పర్వతప్రాంతంనుంచి ప్రచారం సైనికశిక్షణ జరిపింది. 1933 లో చియాంగ్ కై షేక్ తన సైన్యాలు పంపాడు. యుద్ధంలో కమ్యూనిస్టులు పూర్తిగా పరాజయం పొందారు. కనిపించిన కమ్యూనిస్టుల్ని కొమింటాంగ్ సైన్యాలు వేటాడి చంపాయి. చావగా మిగిలిన నాయకులతో కమ్యూనిస్టుసానుభూతిపరులతో మొత్తం ఎనభైవేలమందిని వెంటబెట్టుకుని మావ్ సీటుంగ్ కియాంగ్సీరాష్ట్రాన్ని విడిచి ముందు పశ్చిమంగా తిరిగి ఆతరవాత ఉత్తరంగా వెళ్లి యెనాన్ చేరాడు. కమ్యూనిస్టులు ఆరువేల మైళ్లు 335 రోజులు నడిచారు. మొత్తం 12 రాష్ట్రాలగుండా నడిచి వెళ్లారు. అక్కడక్కడ కొమింటాంగ్ సైన్యాలతో పోరాడి దారి చెయ్యవలసి వచ్చేది.

యాంగ్సీనదివద్ద (చుంకింగ్‌కు పశ్చిమంగా) కమ్యూనిస్టుల్ని ఆపి నాశనం చెయ్యాలని చియాంగ్ ప్రయత్నించాడు. కాని కమ్యూనిస్టులు కొందరు కొమింటాంగ్ సైనికుల వేషం ధరించి ప్రభుత్వసైన్యాల్ని మోసగించి కమ్యూనిస్టులందర్నీ నది అవలి ఒడ్డుకి చేరవేశారు. యెనాన్ చేరేసరికి మొత్తం 20 వేలమంది మాత్రం మిగిలారు.

యెనాన్‌లో మావ్ సీటుంగ్ కమ్యూనిస్టు పరిపాలన స్థాపించాడు. యెనాన్ చీనా ప్రాకారానికి దిగువనుంది. అక్కడనుంచి కమ్యూనిస్టులు రెండేళ్లు ప్రభుత్వసైన్యాలతో యుద్ధం సాగించారు. ఉభయపక్షాలు సమానంగా పోరాడాయి. ఎవరికీ చెప్పుకోదగిన విజయం కలగలేదు.

తరవాత 1936 లో జపాన్ చీనాపై దురాక్రమణ ప్రారంభించింది. జపాన్ సైన్యాల నెదిరించడానికి ఒకవైపున రష్యా కమ్యూనిస్టుల్నీ, మరొకవైపున అమెరికా కొమింటాంగ్ నాయకుల్నీ సఖ్యతకు యత్నించాలని ఒత్తిడిచేశారు. జపాన్ సైన్యాల తాకిడిని అడ్డగించలేక పోయిన చియాంగ్ అంగీకరించాడు. మావ్ సీటుంగ్ కూడా అంగీకరించాడు. కాని తన అనుచరులకి ఈసఖ్యత అంటే ఎలా ఉండాలో బోధించాడు. తమ కృషిలో నూరింట 70 వంతులు స్వంతబలాభివృద్ధికీ, 20 వంతులు కొమింటాంగ్ సైన్యాలతో సఖ్యతకీ, మిగిలిన పదివంతులు జపాన్ సైన్యాలతో పోరాడ్డానికీ వినియోగించాలి! జపాన్‌తో యుద్ధాన్ని కమ్యూనిస్టులు, కొమింటాంగ్ సైనికులూ కూడా ఇదేరీతిగా నడిపారు.

1945 లో జపాన్ అమెరికాతో యుద్ధంలో పరాజయం అంగీకరించడంతో చీనాలో తిరిగి ప్రతిష్టంభన ఏర్పడింది. రష్యన్ సైన్యాలు మంచూరియాను వారం రోజుల్లో ఆక్రమించుకున్నాయి. చీనాలో శాశ్వతశాంతిని స్థాపించడానికి అమెరికన్ రాయబారుల సహాయంతో కమ్యూనిస్టులు కొమింటాంగ్ పక్షంతో సమాలోచనలు జరిపారు. కాని సమాధానం కుదరలేదు. 1947 లో చియాంగ్ సైన్యాలు కమ్యూనిస్టు రాజధాని అయిన యెనాన్ నగరాన్ని ఆక్రమించుకున్నాయి. కాని రష్యన్ సైన్యాలున్నందువల్ల చియాంగ్ సైన్యాలు మంచూరియాను ఆక్రమించుకోలేకపోయినాయి. యాల్టాలో స్టాలిన్, రూజ్‌వెల్ట్, చర్చిల్ చేసుకున్న ఒడంబడికప్రకారం మంచూరియాను జపాన్ సైన్యాలనుంచి రష్యన్ సైన్యాలు విడిపించాలనీ, మంచూరియాలో పూర్వం రష్యన్లు నిర్మించిన రైల్వేపైన రష్యన్లనే అధికారం ఉంచుకోవచ్చుననీ, పోర్ట్ ఆర్థర్ ఓడరేవులో రష్యన్లకు హక్కు నివ్వాలనీ నిర్ణయించ

(20 పేజీ-చూడుము)

నవల



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౭

ఆ ట్లానాడు సమ్మెచేసినది అన్నమంత్రికరణములే కాదు. ఆ సమ్మె రాజధానీ నగరమం దంతట సాగెను. రాజమందిరములో దప్ప పెరతావుల నెల్లయెడలను మంత్రిదండనాథసామంతుల వ్యవహారస్థానములందును—కరణము లెవ్వరు పనిలోనికి రాలేదు. అధికరణస్థానములలో లేఖకులు రాకుంటచే విచారణ లాగిపోయెను. పెద్ద వర్తకుల యంగళ్లలోగూడ వ్రాయసకాండ్రు రానందున క్రయవిక్రయములుకూడ ఎక్కువభాగము కట్టువడిపోయినవి.

ఈ యపూర్వసంఘటన నుం డెవరికి నర్థము కాలేదు. ఎవరికి వారు తమ కరణములు రాకుండుటకు కారణ మేదో ఉండు నని యూహించి వారి రాకకై కొంతసేపు నిరీక్షించిరి. ఎంతసేపటికిని రానందున నాశ్చర్యముతో తమ సేవకులను కరణముల యిండ్లకు బంపిరి. ఎవరు వెళ్లినను ఇంటివద్దగలవారు ఇంటిలో లే రని చెప్పుచుండిరి. ఆ మహానగరములో వా రెక్కడ నుండిరో కనుగొనుట యెట్లు ?

అధికారులకు ప్రభువులకు నాగ్రహము వచ్చుచుండెను. కాని ఏమి చేయగలరు ! వారిలో పలువురు అన్నమంత్రివంటివారైన గారు. వారు సహజముగా లెక్క లాలస్యముచేయ నలవాటుపడినవారు. పైగా, "మా హస్తములు కత్తి పలక పట్ట నేర్చినవి కాని గంటములు పత్రములు పూనుటలో నేర్పుకలవి కావు" అని సగర్వముగా చెప్పికొనుచు వ్యవధ తీసికొనుచుండువారు. వారు చైత్రశుద్ధదశమికి పంపవలసిన లెక్కలు ఏ శ్రావణాంతమునకోగాని పూర్తి కావు. విజయదశమి లెక్కలు శివరాత్రికిగాని కావు. అట్టివారి లెక్కలు పేరుకొనియుండి చాల వెనుక బడియుండుటే గాక అయోమయావస్థలో నుండెడివి. అందుచే నట్టివారు కొంతవర కైన దారికి తెచ్చుటకు నవరాత్రములలో క్రొత్తకరణములనుగూడ పెట్టుకొని పని చేయించుకొనువారు. ఏది యెట్లున్నను వారు పూర్తిగా తమ కరణములపైననే ఆధారపడియుండెడివారు.

కొంతకాలమునుండి బ్రాహ్మణులలో వేదశాస్త్రాభ్యాసము క్షీణింపసాగినది. అట్టివారికి అగ్రహారములలో వృత్తులును లోపింపసాగినవి. శిష్టులైన బ్రాహ్మణులలో వారికి గౌరవముకూడ పోవుచున్నందున తప్పనిసరిగా వారు మహాపట్టణములకును చిన్నపట్టణములకును చేరుకొనసాగిరి. వారిలో కులధర్మము క్షీణించినను వారి కులాభిమాన మేమియు దగ్గలేదు. వా రందుచే జీవనోపాధికై చేయదగిన వృత్తులు స్వల్పముగా నుండెను. వర్తకము చేయుటకూడ వారికి హీనముగా కనిపించెడిది. ఏమి చేయగలరు ?

వారిలో పలువురు వ్రాయను జదువను చిన్నచిన్న లెక్కలు వేయను నేర్చినవారు. అట్టివారు తాత్కాలికముగ వ్రాయసవృత్తిలో పెక్కురు ప్రవేశింపసాగిరి. ఆ ఉద్యోగములకై అట్టివానిలో చిరకాలముగా స్థిరపడియున్న జైనోద్యోగుల నా శ్రయింపవలసివచ్చుచుండెను. ఐనను ఆ జైనోద్యోగులు ఈ బాపనవ్రాయసగాండ్రను పనిలో చేర్చుకున్నను వృత్తిలోని సుట్టులు బయటపెట్టకుండగనే వారి నుపయోగించుకొనెడివారు. వారు తాము వ్రాసిన పత్రములకు ప్రతులుమాత్రము ముఖ్యముగా వీరిచే వ్రాయించెడివారు. అవియును ముఖ్యమైన వసుచో కొంతభాగము ఒకరిచేతను కొంతభాగము మరియొకరిచేతను వ్రాయించి దాని పూర్ణస్వరూపము వీరికి తెలియకుండ జేసెడివారు. అట్లు కార్యకలాపము లవగాహనయగుటకు వా రెన్ని ఆటంకములు కలిగించుచున్నను, సూక్ష్మబుద్ధి కల కొందరుమాత్రము ఆ వ్యవహార నిర్వహణమున సమర్థత నెమ్మదిగా రహస్యముగా సంపాదించుచుండిరి. కాని యట్టి పట్టుదల గలవారు కొలదిమందియే కలరు. వా రైనను వైపదవులలో నన్న జైనోద్యోగులవద్ద ఆశ్రయించి ఉండవలసివచ్చుటచే తమ ప్రతిభను బయటపెట్టుకొనుటకు జంకుచుండిరి.

చిరకాలముగా పని చేయుచున్న జైనకరణముల పద్ధతికి ఈ బ్రాహ్మణకరణముల వ్యవహారవిధానము కొంచెము భిన్నముగా నుండెడిది. వేదప్రామాణ్య మంగీకరింపని తమకంటె నన్యు లని వీరిని నిర్దేశించుటకు ఈ బ్రాహ్మణకరణములకు వైదికకరణము లని వారు పేరుపెట్టిరి. ఆ పేరే క్రొన్నాళ్లుగా వ్యవహారములోనికి వచ్చినది.

ఇది జైనులు సాగించిన సమ్మె యని మొదట ఎవరికిని తెలియలేదు. వైదికకరణములు దివాణములకు వచ్చిరి. కాని యక్కడ పెద్దకరణము లెవ్వరును లేకున్నందున వారు సందేహించి తొరటలాడుచు వెనుదిరిగిపోవ నుంకించుచుండిరి. అట్టివారు ప్రభువుల కన్నుల బడగా ప్రభువులు వారిని పిలిపించి వ్యవహారము చూడమని చెప్పుచుండిరి. అయినను వారు తమకు స్వతంత్రముగా పని చేయు సమర్థత లే దనియు చెప్పిన పత్రములు వ్రాయుటేకాని ఎక్కువ చేతకా దనియు చెప్పుకొని తప్పుకొనిరి. వారిలో సమర్థులైనవారికి అది మంచి యదనే. అట్టివారుకూడ తమ్ము చేరదీసిన జైనోద్యోగులకు విరుద్ధముగా ప్రవర్తించుట ధర్మము కా దను ధర్మభీతిచే కొందరును ప్రబలురకు కోపము తెప్పించుట శ్రేయస్కరము కాదను భీతిచే కొందరును పనిలోనికి స్వయముగా దిగుటకు జంకుచుండిరి.

మహాప్రధాను లగు శ్రీ మల్ల గోవిందనాయకుడును బయ్యననాయకుడును కొంతకాలముగా రాజప్రాసాదములో నున్న తమ కార్యస్థానములనే పని చూచుకొనుచుండిరి. అక్కడి కరణములు పనిలోనికి వచ్చినందున వారి కార్యకలాపముల కెట్టి యాటంకమును గలుగలేదు. కొంతవడికి వారి గృహములయొద్ద గల వ్యవహారశాలలలో కరణములు రాక పని యాగిపోయిన దని వార్త యందుకొనిరి. వారు వెంటనే మేచయనాయకుని పిలిపించి గూఢచారులను పట్టణమం దంతటను పరిసరములను సంచరించి వార్తలు తెప్పించు నేర్పాట్లు చేసిరి. అపిమ్మట తిక్కచమూపతిని సర్వసేనలతో నెల్లయెడల కట్టాయితమై యుండ నిర్దేశించి యే క్షణమున కాక్షణము వార్త లందుకొనుచు ప్రతిక్రియలు ఆజ్ఞాపించుచుండిరి. వృద్ధులై వ్యాధిచే బలహీనముగా నున్న గణపతిదేవుల కీ వార్త తెలిసినచో నావేగము నొందును. రాజవైద్యులు ఎట్టి ఆవేగము కలిగినను వ్యాధి వికటించు నని కఠినముగా శాసించియుండిరి. మహారాజ్ఞి ఆ సభనాడు చక్రవర్తికి కలిగిన కలతచే గలిగిన గురకుణము లింకను శాంతింపలేదు. మహామంత్రు లందుచే గణపతిదేవుల కిది యింతమాత్రము తెలియనీకుండ కట్టడి చేసిరి.

రుద్రదేవమహారాజులు నవరాత్రిదీక్షలో నుండిరి. వారు శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల యాజ్ఞానుసారము పాశుపతమునకు కలశస్థాపన చేసిరి; అఖండజ్యోతిని ప్రతిష్ఠించిరి. ఒకవంక సింహధ్వజమును మరియొకవంక వరాహలాంఛనమును ఎత్తి ధ్వజారోహణము నిర్వర్తించిరి. నిత్యమును ప్రాతఃకాలమున రుద్రాభిషేకపురస్సరముగా శివపూజ కావింతురు. మధ్యాహ్నప్రభృతి నియతముగా నాగనదేవతాపూజ చేయుదురు. రాత్రులందు శివాపూజ నిర్వర్తింతురు. కుమారీపూజలును సువాసినర్చనలును వైభవముగా జరుపుచుండిరి. పూజాసమయములలో వారు కనబరుచు భక్తిశ్రద్ధలకు నైకాగ్రతకు నక్కడ చేరెడి విప్రు లందరు నాశ్చర్యచకితు లగుచుండిరి. పగ లెట్టి యాహారము వారు భుజింపరు. రాత్రులందైన హవిష్యమే యాహారము ! శివశక్తియు శివాశక్తియు నేకాకారమై యీరూపమున నవతరించెనా యని రుద్రదేవమహారాజులు చూపఱకు గనుపట్టుచుండిరి. అట్టివారి కీ దీక్షాకాలము ముగియువరకు రాజకార్యభారము నివేదింపరాదు ! రయ్యమకును కామసానికిని రహస్యముగా మహాప్రధాను లీ వార్త యెరిగించి వారల జాగరూకలుగా నుండ నియమించిరి.

మరి యా ఉదయమున మహాదేవరాజు తన వ్యవహారశాలకు కరణములు రాలే దనునది గమనించునప్పటికే పదిగడియల ప్రొద్దెక్కెను. తెలిసినవెంటనే అతని కాగ్రహము వచ్చెను. వెంటనే భటులను కరణముల ఇండ్లకు పోయి వారు నెమ్మదిగా చెప్పిన రాకున్న కశాఘాతములు చేసి బలవంతముగా లాగికొనిరమ్మని యాజ్ఞాపించెను. కాని ఏమిచేసినుంటకైనను వారు కనబడినగదా !

నాగదేవుడు ఆయగాండ్లపై యధికారి. గోన గన్నారెడ్డి దళసుంకాధికారి. వారి కరణములు రాకుండుటచే వారికి లోకమే తల్లక్రిందులైనట్లుండెను. కాని ఏమి చేయగలరు ? ఆ క్రిందటిరోజునసే కాయస్థసేనాను లగు జన్నిగదేవుడును, అతని సోదరులు త్రిపురాంతకుడును, అంబదేవుడును రాజధానికి వచ్చియుండిరి. వారి మండలముల సరిహద్దులలో పల్లవులను పాండ్యుడును చోళులును చేయుచున్న యాలజడిలన కదలుటకు వీలు చిక్కకపోయిన దనియు అప్పటికు వచ్చుటైనను రాజాజ్ఞ మేరకు వచ్చి యుండిరేగాని మండలస్థితి ప్రమాదకరముగా నున్న దనియు మహారాజుకు నివేదించుకొనిరి. వారును మహారాజునాజ్ఞ తనుకు మండలాంతమున నున్నందున నాలస్యముగా వచ్చిన దని వివరించినందున వారిని చక్రవర్తి విని యుదాసీనత వహించెను. ఈ మువ్వురలో అంబదేవుడు సర్వతోముఖముగు ప్రజ్ఞ కలవాడు. యుద్ధవిద్యలో నీ సేనాని సాటిలేని మేటి. అంతియకాక అతడు గణితమున నద్వితీయుడు. అతి డెక్కడ అధికారములో నున్నను భూమి యంతయు 'పెనుంబాకమానదండము'తో చక్కగా కొలిపించి 'నీరునేల'పై న్యాయమైన 'కోరు'ను 'వలిపొలము'పై 'పుట్టెసహిండి'యు క్రమముగా నిర్ధారణ చేయించువాడు. అందుచే భూస్వాములు చెల్లించవలసిన పన్నుకంటె ఎక్కువ కరణములు వసూలు చేయుటకు గాని ఈయవలసిన 'కోరు' గాని 'పుట్టిసహిండి'గాని భూస్వాములు తప్పించుకొనుటకుగాని యతని మండలములో నవకాశ ముండెడిదికాదు. ఈ యంబదేవుడుగూడ నానా డేమియు జేయజాలకపోయెను. జన్నిగయు త్రిపురాంతకుడును అంబదేవుని కంటె పెద్దవారైనను అతని సమర్థతయందు గౌరవము కలవారు. అతడే అసహాయుడై యున్నందున ప్రస్తుతము ఈనాటికి తాము నేమియు జేయలే మని నిస్పృహత వహించి ఉదాసీనులైరి.

చాళుక్యవీరభద్రేశ్వరుని కరణములుకూడ నానాడు రాలేదు. అప్పటి కైదు జనములనుండియే యతని దివాణములో చురుకుదనము తగ్గినది. విజయదశమికి కార్యనిర్వహణభారము చక్రవర్తికి నివేదింపవలసిన యాతురత యాతని దివాణమున కున్నట్లే లేదు. ఈనాడు తన కరణములు రామికి కారణముకూడ విచారింపకుండ అతడు తన పారశీకాశ్వ మెక్కి ఎచ్చటికో వెడలిపోయెను.

అట్లే రేచర్ల కామయరెడ్డి, నామయరెడ్డి, మల్లయరెడ్డి, గణపిరెడ్డి, మల్లిరెడ్డి దివాణములను కోట కేతరాజు, ఆనెగొంది రామదేవరాయల దివాణములను కరణములు రాలేదు. వారు అలజడి నొందినట్లే లేదు. వారు నగరవీధుల తమ జవనాశ్వములపై సంచరింపసాగిరి.

వృద్ధు డగు జాయపనాయకునకు ఇప్పుడు అధికారభారము లేదు. పూర్వమాతడు గణపతిదేవుల గజసైన్యముల కధ్యక్షుడు. ఇప్పుడు చేబ్రోలులో నుండి విశ్రాంతితీసికొనుచుండి రాజధానికి నవరాత్రోత్సవములకు వచ్చెను. అతని కున్న

(22 వ పేజీ చూడుడు)

సోషలిస్టు బ్రిటన్‌లో కార్మికుల సమస్య తిరిగి మొదటికొచ్చింది

[నార్మన్ ఏంజెల్]

పరిశ్రమల్ని ప్రభుత్వపరం చేసి పాశ్చాత్య ప్రపంచానికి సోషలిస్టుఆదర్శాల ఉత్కృష్టతను నిరూపించయత్నించిన బ్రిటన్‌లో కార్మిక సంఘాలకు తెగని సమస్య ఒకటి వచ్చిపడింది. అసలిటువంటి పరిస్థితి సంభవిస్తుందని బ్రిటిష్ సోషలిస్టులు ముందే ఎందుకు కానలేకపోయినారో తెలుసుకోవడం కష్టం.

ప్రస్తుతబ్రిటిషుప్రభుత్వం కార్మికోద్యమానికి ఫలితం. ప్రభుత్వవర్గానికి చెందిన వారిలో అత్యధికులు పూర్వం కార్మికసంఘాల కార్యకర్తలు. ప్రభుత్వరాజకీయ పక్షం ఆర్థికరీత్యా పూర్తిగా కార్మిక సంఘాలపైన ఆధారపడి ఉన్నాయి కాని నేడు కార్మిక ప్రభుత్వానికి కనిపెట్టుకునిఉన్న పెద్ద ప్రమాదం కార్మికసంఘాల తిరుగుబాటే.

కార్మికపక్షంపైన కార్మికసంఘాల తిరుగుబాట్లు నానాటికీ హెచ్చుతున్నాయి. ఉదాహరణకి రైల్వేలు చూద్దాం. రైల్వేలు పూర్తిగా ప్రభుత్వపరమైనాయి. వెంటనే ప్రభుత్వంరైల్వే శాఖనిర్వహణలో కొన్ని ముఖ్యసంస్కరణలు ప్రవేశపెట్టింది. సామాన్యంగా వేలాది రైల్వే ఇంజన్ డ్రైవర్లు, బొగ్గుపనివారు వారాని కొక రాత్రి చొ॥ స్వంతనివాసాలకు దూరంగా ఎక్కడో మరొక ప్రాంతంలో గడపకలసి వస్తుంది. ఆప్రాంతాల్లో హాస్టల్ సౌకర్యాలను ప్రభుత్వరైల్వేశాఖ ఏర్పాటుచేసింది. అలా గడపడం ఇష్టంలేనివాళ్లు అసలు ఇటువంటి నౌకరీల్లోనే చేరరు.

ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలవల్ల మామూలుగా వారాని కొక రాత్రి చొ॥ అన్యప్రదేశాల్లో గడపవలసిన వేలాది మంది డ్రైవర్లు, బొగ్గుపనివారు కాక అదనంగా 96 మందికూడా అలా గడపవలసి వచ్చింది. ఆ 96 మందీ ఈ ఏర్పాటుకి ఒప్పుకోలేదు. ఎప్పటిమాదిరిగా పని చేస్తామన్నారు. ప్రభుత్వశాఖ నిర్బంధించేసరికి 96 మందీ సమ్మె చేశారు. వీరి సమ్మెతో ఆప్రాంతాల ఆదివారాలు రైళ్లు నిలిచిపోయాయి. నిలిచిపోయినందువల్ల అనేకవేల కార్మికులకి ఆదివారం సెలవు వ్యర్థమైపోయింది. ఈ సమ్మెదారులికి మద్దతుగా గుడ్సురైళ్లవారు కొంతమంది పని "తిరిగించడం" మొదలెట్టారు. ఈపరిస్థితిలో ప్రభుత్వమూ, జాతీయకార్మికసంఘాల నాయకులూ జోక్యంచేసుకోవలసివచ్చింది.

అదే సమయంలో రైల్వేకార్మికసంఘం జీతాలు హెచ్చించాలని అడుగుతూ ప్రభుత్వాని కొక పత్రం దాఖలుచేసింది. దేశంలో ఆర్థికస్థితి చక్కబడేవరకూ కార్మికులు జీతాలు హెచ్చింపు అడగబోరని ప్రభుత్వానికి కార్మిక నాయకులిక్కీ చేసిన వాగ్దానాని కిది విరుద్ధమే. అయినా అడిగారు. అదింతవరకూ తేలలేదు.

రైల్వేల సంగతి ఇలా ఉండగా ఇతరముఖ్య పరిశ్రమల్లో సమ్మెలు సాగుతున్నాయి. ఓడరేవుల్లో పనిచేసేవారు సమ్మెచేశారు. వారెందుకు సమ్మెచేస్తున్నారో కారణాలు చూస్తే చాలా వింతగా ఉంటుంది. కెనడాలో రెండు ఓడరేవు కార్మికులసంఘాలు ఎందుకో తగవు పెట్టుకున్నారు. ఎందుకో బ్రిటన్‌లో కార్మికులికి స్పష్టంగా తెలియదు. వాటిల్లో ఒక సంఘంలోని కార్మికులు సమ్మెచేస్తున్నారు. వారికి మద్దతుకోసమే బ్రిటన్‌లోని ఓడరేవు కార్మికులు సమ్మెచేశారు. ఈసమ్మెవల్ల వందలాది ఓడలు రేవుల్లో స్తంభించిపోయాయి. అఓడల్లోని సరుకులు దింపడానికి ప్రభుత్వం సైనికుల్ని పంపవలసివచ్చింది.

రైల్వేలు, ఓడరేవుల కార్మికుల సమ్మెలకంటె ప్రమాదమైన మరొక కార్మికవర్గపు సమ్మె సిద్ధంగా ఉంది. ఒక సోషలిస్టుపత్రిక ఈ విషయాన్ని ప్రచురించింది. "రైల్వేశాఖపట్ల రైల్వేకార్మికుల కెంత అవిశ్వాసం ఉందో గనుల పనివారికి గనుల యాజమాన్యంపట్ల అంతకంటె అధికంగా అవిశ్వాసం ఉంది"

ఈ అసంతృప్తికి మూలకారణ మేమిటి? బ్రిటిష్‌కార్మికనాయకుల తరహా బాధ్యత తెలియని విప్లవకారులమాదిరి కాదు. చిరకాలం నుంచీ బ్రిటిష్ కార్మికవర్గాల ఐకమత్యం ఆదర్శప్రాయంగా ఉంది. ప్రపంచంలోని ఉద్యమాలలోకెల్ల బ్రిటిష్ కార్మికోద్యమం ఉత్తమపంథాలో నడిచింది. అద్భుతవిజయాలు సాధించింది అయితే ఇప్పుడెందుకీ రీతిగా సోషలిస్టు వ్యవస్థను కూలద్రోయ్యడానికన్నట్లుగా ఉద్యమకారులు ప్రవర్తిస్తున్నారు? దీనివల్ల సోషలిస్టు వ్యవస్థ కూలిపోతుంది. మార్షల్ ప్రణాళిక వ్యర్థమైపోతుంది. జాతీయార్థికి పునర్నిర్మాణ కృషి అంతా నిష్ఫలమైపోతుంది. ఎందు కీరీతిగా బ్రిటిష్‌కార్మికులు ప్రవర్తిస్తున్నారు!

ఈ క్లిష్టవ్యవస్థకు దారితీసిన తోవను పరిశీలించండి. యజమానులతో బేరమాడ్డానికి కావలసిన బలం ఆర్జించిపెట్టడాని సాధనగా కార్మిక సంఘం ప్రారంభిస్తుంది. యజమానులకు ప్రతిగా వాదించడానికి కార్మికులతరఫున కార్మిక సంఘం ప్లీడరుగా పనిచేస్తుంది. బలం చేకూరిన తరవాత కార్మికసంఘం రాజకీయాల్లో ప్రవేశిస్తుంది. ఒక రాజకీయపక్షానికి కార్మికసంఘం ప్రాణాధార మౌతుంది. కాలక్రమాన ఈ రాజకీయ పక్షం ప్రభుత్వస్థానాన్ని ఆక్రమించగలుగుతుంది. అప్పుడు ఈ కార్మికపక్షప్రభుత్వం బొగ్గు, రైల్వే, విద్యుచ్ఛక్తి, కేంద్రబాంకు మొదలైన ప్రధాన పరిశ్రమల్ని సంస్థల్ని స్వాధీన పరుచుకుంటుంది. స్వాధీనపరుచుకున్నందువల్ల ఆ పరిశ్రమల్ని, సంస్థల్ని సమర్థతతో నిర్వహించవలసిన బాధ్యత వారిపైన పడుతుంది. బొగ్గు చౌకగా అందేలాగ జాగ్రత్త పడవలసి వస్తుంది. బొగ్గుధర, రైల్వే రవాణా చౌకగా ఉంటేగాని పారిశ్రామిక వస్తువుల అమ్మకంలో ఇతరదేశాలతో పోటీచెయ్యడం కష్టం. వర్తకంలో విదేశాలతో పోటీచేస్తేగాని ఆహారాన్ని విదేశాలనుంచి కొనడానికి కావలసినంత విదేశాల ధనం లభించదు. లేకపోతే దేశంలో ఆహారం కొరవై ప్రజలు ఆకలితో బాధపడవలసి వస్తుంది.

"ఎగుమతులు పెంచండి. లేదా మనకు నాశనము తప్పదు" అని ఇప్పుడు బ్రిటిషుప్రభుత్వం ప్రజలతో మొరపెట్టుకుంటోంది.

కాని కార్మికులకు అసంతృప్తి కలిగింది. ఎగుమతులు తగ్గించ నక్కరలేకుండానే తమకు హెచ్చు జీతాలు రావడానికీ, హెచ్చు సెలవులనుభవించడానికీ, వీలుందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు. స్వయంగా ప్రభుత్వాన్ని స్థాపించడానికి ముందు కార్మికసంఘాలవారు కూడా ఇలాగే వీలుందని వాదించేవారు. ఇప్పుడుకూడా కార్మికులు ఈ విధంగానే వీలుందని యజమానులతో వాదించాలంటారు. అయితే ఇప్పుడు యజమానులెవరు? వారి రాజకీయపక్షం స్థాపించిన ప్రభుత్వమే. అంటే వారి రాజకీయ పరికరమే.

గనుల కార్మికులతరఫునో, రైల్వేకార్మికుల తరఫునో వాదించడానికి ఒక ప్రతినిధివర్గం లండన్ వస్తుంది. వచ్చినవారు యజమానుల తరఫు ఒక అధికారితో వాదించాలి. ఆ అధికారేమరి కార్మికసంఘానికి పూర్వం కార్యకర్తగా పని చేసినవాడే కావచ్చును. జీతాలు హెచ్చించాలని అడగండి. ధరలు పెరక్కుండా అణచి ఉంచాలంటే జీతాలు పెంచడానికి వీల్లేదని ఆ అధికారి అంటాడు. ఇతని నోట విన్నేవాదం సరిగ్గా పూర్వం పెట్టుబడిదారులతరఫుఅధికారి నోటినుంచి విన్నదే అయిఉంటుంది. జీతాలు హెచ్చించినా ధరలు పెరగవని ఒకప్పుడు వాదించిన పెద్ద మనిషే ఇప్పుడు ధరలు పెరిగిపోతాయికాబట్టి జీతాలు పెంచడానికి వీల్లేదని వాదిస్తోంటె వింతగానే ఉంటుంది.

ఒకే వ్యక్తి ఇద్దరు యజమానులకింద ఎలా పని చెయ్యడం అని ఈ నాడు కార్మికజనం అడుగుతున్నారు. కార్మికసంఘాలు ఒకవైపున కార్మికులతరఫున యజమానులతో వాదిస్తూ మరొకవైపున ప్రభుత్వపదవిలో యజమానులుగా వర్తించగలరని అడుగుతున్నారు.

అందువల్లనే కార్మికులు క్రమక్రమంగా సిండికలిజం వైపుకు మొగ్గుతున్నారు అంటె గనులన్నీ గనుల కార్మికులకే చెందాలనీ, రైల్వే రైల్వేకార్మికులకు చెందాలనీ కోరుతున్నారన్న మాట. అవి ప్రభుత్వానికి చెందకూడదు. వాని యజమానులు కార్మికులకే జవాబుదారీగా ఉండాలిగాని ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండరాదంటున్నారు. అయితే బొగ్గుధరను కాని రైల్వేరేట్లను కాని నిర్ణయించవలసినవారెవరు? జాతీయఆదాయంలో ఎంతవంతును కార్మికులు కోరవచ్చునో తేల్చవలసిన దెవరు? ఆ వంతుకు కార్మికులు ఎంతెంత పని చూపాలో ఎవరు నిర్ణయించాలి?

వ్యవసాయదారుల కిస్తున్నదానికంటె ఆహారంరేపన్ను తమకు అధికంగా ఇవ్వాలని చేపలు పట్టేవారంటున్నారు. ఫాక్టరీకార్మికుల కిచ్చేదానికంటె ఎక్కువరేషన్లు తమ కివ్వాలని వ్యవసాయదారులంటున్నారు. వీరిలో ఎవరికి ఎక్కువివ్వాలో నిర్ణయించగలవారెవరు? నిష్పక్షపాతమైన అధికారవర్గమొకటి నిర్ణయించాలా? కాని ఆ అధికారవర్గాలు తమవారైనా వారి నిర్ణయాల్ని కార్మికులు అంగీకరించలేకుండా ఉన్నారే! అదీ కాక పరిశ్రమల్లో వారు ప్రధానకార్యాన్ని నిర్వర్తిస్తున్నవారు కాబట్టి తమకోరికలు తీరకపోతే దేశంలో క్షామంకూడా తెచ్చిపెట్టగల బలం వారిచేతుల్లో ఉందికాబట్టి అధికారుల్ని ధిక్కరించే శక్తి వారి కుంది.

కార్మికులేమో కార్మికుల హక్కులకోసం క్షేమంకోసం పోరాడుతున్నామంటారు. కార్మికోద్యమానికే వారు ద్రోహం చేస్తున్నారని ప్రభుత్వం అంటుంది.

తగవులాడే రెండుపక్షాలమధ్య పక్షపాతరహితంగా పరిష్కారం తెచ్చి శాసనాల్ని అనువర్తింపచెయ్యవలసిన ప్రభుత్వం ఒక పక్షంపైన ఆధారపడి ఉండకూడదు. ఆపక్షంపైన కఠినచర్య తీసుకోవలసినప్పుడు తీసుకోడానికి వీలుగా ఉండాలి.

పశ్చిమదేశాల్లో తీవ్రవాదులైన అల్పసంఖ్యాకులు అధికారాన్ని దుర్వినియోగం చెయ్యకుండా నివారించడానికి ఒక పరికరం ఉంది. ఇరుపక్షాలలో ఏ ఒక పక్షంవైపు ప్రభుత్వం అనుచితంగా మొగ్గుతున్నట్లు కనిపించినా, వోటర్లలోని "అస్థిరవర్గం" ఆ ప్రభుత్వానికి విరుద్ధంగా వోటుచేసి ప్రత్యర్థివర్గాన్ని ప్రభుత్వంలోకి తెస్తుంది. ఈ "అస్థిరవర్గం" ఏ ఒక్క వాదాన్నీ లేక పక్షాన్నీ నిత్యం అంటిపెట్టుకుని ఉండదు.

కాని బ్రిటన్‌లో కేవలం కార్మికసంఘాలపైనే ఆధారపడిఉన్న కార్మికపక్షం పరిస్థితి వేరు. పైపద్ధతి వీరివద్ద పనిచెయ్యడంలేదు. కార్మికపక్షంస్థితి చూస్తే ఏకైకపక్షవాదాన్ని, ఏకపక్ష ప్రభుత్వాన్నీ సుస్థిరపరచడానికే యత్నించగలదని తెలుస్తుంది. ఈనాడు కార్మికులస్థితిచూస్తే, కార్మికసంఘాలలో సభ్యుడుగా చేరని ఏవ్యక్తీ ఇంగ్లండులో పరిశ్రమల్లో జీవనోపాధి ఆర్జించుకోలేడు. కార్మికసంఘంలో చేరినట్లయితే కార్మికప్రభుత్వ వర్గానికి చెందినవాడౌతాడు. తన సంఘానికి తాను చెల్లించే సభ్యత్వపు రుసుములో కొంతభాగం కార్మికప్రభుత్వ పక్షానికి చెందుతుంది. దీన్ని "రాజకీయపక్ష సుంకం" అంటారు కార్మికులు. ఆ రాజకీయ పక్షానికి తన రుసుములో పైసాకూడా వెళ్లకూడదని పట్టుబట్టి ఆరీతిగా అనుమతిని కార్మికులు పొందవచ్చుననేమాట సత్యమే. కాని ఒక కార్మికుడు అలా చేసిన క్షణంలో అతన్ని సోదరకార్మికులు మర్చిపోకుండా ఒక కంట కనిపెడతారు. ఆటువంటి ప్రయత్నం చేసే కార్మికులు బహు కొద్దిమంది.

పూర్వం పెట్టుబడిదారుల కాలంలో యజమానులు అనుచితంగా రాజకీయబలాన్ని కార్మికులపైన ప్రయోగిస్తున్నారని నిందించేవారు. కాని అప్పుడు కార్మికులు తమ సంఘంసహాయంతో యజమానిని మార్చుకోడానికి అవకాశం ఉండేది పరిశ్రమలు ప్రభుత్వపరమైన ఈనాడు, ప్రభుత్వం కార్మికులదే అయినప్పటికీ కార్మికులు యజమానిని మార్చుకోడానికి వీలులేదు. ఇప్పుడు అదీకాక ఈ కొత్త యజమాని వల్ల కార్మికులు పొందవలసిన వానిలో జీతమొకటే కాదు. ఆహారం కూడా పొందాలి.

పెట్టుబడిదారుల కింత బలం ఇంత అధికారం ఉండేవికావు. ఆనాడు రాజకీయాధికారం ఆర్థికాధికారం వేరువేరుగా నిర్వర్తించబడేవి. దీనివలన బలం, అధికారం పల్చబడేవి. ఇప్పుడు ఒకేచోట కేంద్రీకరింపబడినాయి. ఈ కొత్త వ్యవస్థలో అపజయం కలుగుతున్న కొద్దీ అధికమైన అధికారాలు కేంద్రీకరింపబడతాయి. అధికబలం ప్రయోగించబడుతుంది. ఇదీ ఈనాడు బ్రిటన్‌కు సంభవిస్తున్న ప్రమాదం.

[రీడర్స్ డైజెస్ట్ నుండి]

మా ఢిల్లీలేఖ:

ప్రభుత్వయంత్రాంగ పునరుద్ధరణ
గోపాలస్వామిఅయ్యంగారి నివేదిక

శ్రీ కృష్ణ

భారతప్రభుత్వం, ప్రభుత్వఉద్యోగవర్గనిర్మాణంలో ఎల్లాటిమార్పులు తేవాలో పరిశీలించేందుకు, శ్రీగోపాలస్వామిఅయ్యంగారి నివేదికను పరిశీలిస్తున్నది. అధికారరీత్యా కాదన్నా, శ్రీగోపాలస్వామిఅయ్యంగారు, ప్రభుత్వయంత్రాంగాన్ని పునరుద్ధరించేందుకు మూలప్రణాళికను తయారుచేశారు. ఈమూల ప్రణాళిక ఇప్పుడు పక్వస్థితికి వచ్చి నివేదికగా తయారయింది.

ఈ నివేదికరీత్యా, కేంద్రసెక్రటేరియటును ముప్పైఏడు యూనిట్లుగా విభజిస్తారు. ఇందులో ఒక మంత్రివర్గ కార్యదర్శిశాఖ, ఎనిమిది కేంద్ర పాలిత కచ్చేరీలు, ఇరవైఎనిమిది, శాఖాభాగాలు ఉంటాయి. ఈ ఇరవైఎనిమిది ప్రభుత్వశాఖలు ఇరవైమంది మంత్రులకు సర్దబడతాయి. ఒక్కొక్క "బీరో! అన్న పేరుతో, ఆర్థిక సాంఘికసేవాకృత్యాలు నిర్వహించేందుకు, కొన్ని మంత్రిత్వాలు, కలిపి ఒకకూటమిగా చేర్చబడతాయి. జాతీయనిక్షేపాలు, వ్యవసాయము కలిపి ఒక 'బీరో', పరిశ్రమలు వాణిజ్యము కలిపి ఒక 'బీరో', రవాణామొదలైనవాటికి ఒక 'బీరో', కార్మికశాఖ, సంఘసేవాశాఖా కలిపి ఒక 'బీరో', ఇల్లా ప్రత్యేకసమితులు ఉంటాయి.

ప్రతిశాఖా, ఒక కార్యదర్శి సమంగా చేయగల పనికి పరిమితమై, ఆశాఖకు కార్యదర్శి సంపూర్ణ బాధ్యత వహించి అవిభక్త అధికారంతో వ్యవహరించేందుకు వీలుగా ఉంటాయి

ఒక్కొక్కశాఖా, కేవలం ఒకళ్లు సర్దుకొనే మాత్రంగా ఉండటమేకాకుండా, ఒకే సామరస్యంకల పరిమితకార్యకలాపాలతోమాత్రమే వ్యవహరిస్తూంటుంది.

కేంద్రమంత్రివర్గసంబంధీకమైన రక్షణ, ఆర్థికవ్యవహారాలు, పరిపాలనాక్రమవిధానాలు వాణిజ్యవ్యవహారాలు ఈ నాలుగువిషయాలకు నాలుగు స్థాయీసంఘాలుంటాయి. మంత్రుల సంఖ్య హెచ్చింపువిషయంలో గోపాలస్వామిగారి దృష్టి పోవటంలేదు.

ఈ నాలుగు 'బీరో'లకు ఒక్కొక్కదానికి ఒక్కొక్కమంత్రి, పెద్దవ్యవహారాలైన, విదేశవ్యవహారామంత్రులు హోమ్, ఆర్థిక, రక్షణ, శాఖల, అవాంత్రలు మరో ముగ్గురో నల్గురో, ఉంటే మంత్రివర్గవ్యవహారాలు సరిచూచుకోటానికి చాలునంటూరు అయ్యంగారు. ఈ సూచనలు చేయటానికి ఇవాళ అయ్యంగారే ప్రథములు కారు. 1946 నాటికే, వీరి మూలసూత్రాన్ని, సర్ రిచర్డ్ టాటిన్‌హామ్ ఈ విధంగా ప్రకటించారు.

"ఇప్పుడున్నదానికంటే, తక్కువ సంఖ్య కలదీ, అందుకని ఇప్పటికన్నా మరింత సమర్థవంతమైనదీ అయిన ప్రభుత్వ కార్యవర్గాన్ని నిర్మించుకో కలిసిఉంది." అని అన్నారు. ఈసూచనలు చేస్తూ, ప్రభుత్వం కేవలం పన్నులు వసూలు చేసి, రూల్సు పెట్టి, రాజ్యం సాగించే విధానంలో మాత్రంగాక, విడివ్యక్తులకు సాధ్యంకాని చోట్లల్లా, జాతి ఆర్థిక, సాంఘిక క్షేమాలను విస్తృతమొనరించేందుకు ఉపకరణంగా ఉండాలి అన్నారు.

సర్ రిచర్డ్ టాటిన్‌హామ్ పదునాల్గుమంత్రులను సూచించారు.

విదేశవ్యవహారాలు
రక్షణ
హోమ్
వాణిజ్యము
పరిశ్రమ, సరఫరా
రవాణా, తపాలా
కార్మిక
ఆహార, వ్యవసాయిక
విద్య, ఆరోగ్యం,
ఖజానా
న్యాయచట్టములు, అభివృద్ధి
(దీని తోపాటుగాని లేక విడిగా)
పోర్టు ఫోలియోలేని మంత్రి.

ఈ మంత్రిత్వాలు, టాటిన్‌హామ్ చెప్పినవి. వీట్లనే కాస్త హస్తలాఘవం చూపించి, పెద్దమంత్రిత్వానికి చికాకు లేకుండా, ఈక్రింద మంత్రిత్వాలు సూచించారు.

1. ప్రభుత్వమంత్రి
2. న్యాయశాఖామంత్రి
3. హోమ్ శాఖా
4. విదేశ వ్యవహారాలు
5. రక్షణ
6. ఖజానా

"బీరోఆఫ్ నేషనల్ రిసోర్సెస్‌కు చెంది

7. వ్యవసాయశాఖామంత్రి
8. ఆహార మంత్రి
9. పబ్లిక్ వర్క్సు మంత్రి

"పరిశ్రమ, వాణిజ్యముల బీరో"కు చెంది

10. గనుల, విద్యుచ్ఛక్తిశాఖా మంత్రి
11. పరిశ్రమశాఖ
12. సరఫరాలశాఖ
13. వాణిజ్యశాఖ

"రవాణా, తపాలుబీరో"కు చెంది

14. రైల్వేశాఖ
15 రవాణాశాఖ
16. తపాలా ఇత్యాదులశాఖ

"సంఘసేవ బీరో"కు చెంది

17. కార్మికశాఖ
18. ఆరోగ్యశాఖ
19. విద్యాశాఖ
20. పునరావాసశాఖ
21. శాస్త్రపరిశోధకశాఖ

ఇన్ని మంత్రిత్వాలు ఉంటాయి వీరి సూచన ప్రకారం. తన సూచనల ప్రకారం చేస్తే ప్రభుత్వం చేసే మొత్తం ఖర్చు హెచ్చజాలదని అయ్యంగారు అంటారు. ఆరోగ్య, విద్యా, వ్యవసాయశాఖను మూడు మంత్రిత్వాల క్రిందకు జేర్చవలసిందని స్వర్గీయ జోగీంద్రసింగు సూచించినప్పుడు, ఖర్చు తగ్గుతుందనే సూచించాడు. కాని ఈనాడు ఆ మూడు మంత్రిత్వాల క్రిందా అయే ఖర్చు ఆనాడు ఊహకైనా అందలేదు. ఈ ఖర్చులకు మితంఅంటూ ఏర్పరచటం వృధాప్రయాసే. పాలకవర్గం పెంచుకొన్నకొద్దీ, బంధుప్రయత్వంతో ఉద్యోగుల సంఖ్య కూడా మిడుతల దండులాగా పెరిగేదే. !

రైలుప్రయాణంటిక్కట్లు నిర్ణయించటంలో ప్రజ ఎంతవరకు భరించగలరనేది ముఖ్యసూత్రంగా పరిగణిస్తారు. ప్రభుత్వం ఖర్చులకుగూడా అదేగీటుగాయి. ఉద్యోగాలలో లేనంతకాలమూ, కాంగ్రెస్‌వారు ప్రభుత్వం అధికవ్యయం చేసేస్తుందని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెసు ప్రభుత్వంలోకి వచ్చాక ప్రభుత్వం మునుపటికన్నా భాగ్యశాలిఅయిందా ? అధికారరీత్యా వెలువడే అంకెలు చూస్తే ఆసూచన ఎక్కడా కనపడటం లేదు. దేశవిభజన అయినప్పటినుంచి ప్రభుత్వ వ్యయం మరింత పెరిగిపోయిందని సర్వేసర్వత్రా ఒప్పుకోబడ్డది. ఈ క్రింది అంకెలే స్పష్ట పరుస్తాయి. సివిల్ పరిపాలనకు మాత్రమే. అయినఖర్చులు

1938/39లో	రు.	38 97 కోట్లు
1944/45	,, ,,	81.40 ,,
1944/45	,, ,,	100 76 ,,
1945/46	,, ,,	126 38 ,,
1946/47	,, ,,	143 37 ,,
1948/49	,, ,,	184 43 ,,
1949/50	,, ,,	155.16 ,,

తదితరగ్రాంటులకోసం అభ్యర్థనలుకూడా కలిపితే 1949/50 బడ్జెటు మొత్తం 155, 16 కోట్లనుంచి 184, 43 కోట్లదాకానో అంతకుమించో పెరుగుతుంది.

ఈ పరిస్థితిలో, 28 మంత్రిత్వశాఖలు, 20 మంత్రివర్గాల ఖర్చును ఇప్పటికే నడుంబరువుతో వెన్ను విరిగిపోతున్న ప్రజల భరించకలదా అనేది మొదటి ప్రశ్న.

గాంధీసూత్రాలను నిత్యం ప్రవచిస్తూంటటం వినబడుతుంది. పరిపాలనఖర్చులవిషయంలో కొద్దిగా ఈ సూత్రాలను పాటించగల్గితే చాలా బాగుంటుందికదా! మహాత్ముడు పార్లమెంటరీ కార్యదర్శుల ఖర్చే అనవసరమని అనేవాడు. దేశఆదాయానికి అనువుగా, ప్రభుత్వం ఖర్చును తగ్గించుకోవాలని మహాత్ముడు ఆదేశించాడు. శ్రీ గోపాలస్వామిగారి నివేదికను స్వీకరించాలా పరిహరించాలా అనేందుకు మహాత్ముని బోధలన్నీ పట్టిపట్టి చదువవలసిన అవసరంకూడా లేదు.

ప్రస్తుతప్రభుత్వయంత్రాంగం చురుకుగా, సమర్థనీయంగా సహకరించి పనిచేయటంలేదని శ్రీ గోపాలస్వామి అయ్యంగార్ అంటారు. బ్రిటిష్‌వారు మనకు అద్వితీయమైన ప్రభుత్వయంత్రాంగం నిర్మించి వెళ్లారు. మన సివిల్ సర్వీస్‌శాఖ ప్రసిద్ధమయిన పేరు తెచ్చుకొంది. ఈనాడు ప్రభుత్వ యంత్రాంగంలో లోపాలు కనపడుతున్నాయంటే సమగ్రమైన ఉద్యోగుల కార్యకలాపాలలో మంత్రులు అధికంగా జోక్యం కల్గించుకొని వాళ్ల "అస్తిత్వం" మీదే అపనమ్మకం పుట్టించారు. ఉద్యోగాలు వేయటాలే కాకుండా, రోజురోజూ ట్రాన్స్‌ఫర్లు, మార్పులు, దైనందికకార్యక్రమం అన్నిటిలోనూ మంత్రులు ప్రమేయం కల్గించుకోటంతో అస్తవ్యస్తంగా తయారవుతూంది. ఇప్పటి పరిస్థితులలో ఉద్యోగులు, న్యాయంగా, సమర్థనీయంగా ఉంటే చాలదు. ప్రతినిమిషము తమ నీతిని సామర్థ్యాన్ని ప్రకటించుకొని ప్రచారం చేసుకోవలసివస్తుంది. ఉద్యోగులలో తమ "అస్తిత్వం"మీద మంత్రివర్గాలు కల్పించిన ఈ అపనమ్మకాలు తొలగి స్వేచ్ఛ ప్రభుత్వ ఉద్యోగవర్గము సామర్థ్యంతో, నీతిగా పనిచేయలేదు.

శాఖాసంయుక్తమంత్రివర్గాలను, కార్యదర్శిత్వాలను తీసివేయాలని గోపాలస్వామి అయ్యంగారు అన్నారు. దీనితో సెక్రటేరియట్ కలాపాలలో చాలా చిక్కులు కలుగుతాయి. సంయుక్త కార్యదర్శులుగా పనిచేస్తున్న డిపార్టుమెంటు సీనియర్ సెక్రటరీలను, వారికి తెలియనిశాఖలలో డిపార్టుమెంటు కార్యదర్శులుగా చేస్తారు. ఉద్యోగశాఖలు కూడా అనుభవజ్ఞులు ఇల్లా బెదిరితే సామర్థ్యంతో పని చేయటం కష్టం.

శాఖల పరస్పరసమన్వయంకోసం ప్రభుత్వం ఇప్పటికే చాలా సంఘాలు నిర్మించింది. ఆర్థిక వ్యవహారసంఘము, రక్షణసంఘము, శాఖాంతర సంఘాలు శాఖాసంఘాలు చాలా ఉన్నవి.



గోపాలస్వామి అయ్యంగారు

ఈ సమన్వయవ్యవహారమంతా ఇప్పుడొక ఉపకార్యదర్శికి వదలుతారు. ఆయనకు కార్యదర్శిహోదా గాని అనుభవం గాని రెండూ ఉండవు. ఇల్లా ఒకవైపు సమన్వయం సహకారం కావాలంటూ అటు పైనాన్సు మంత్రాంగాన్ని; నాలుగుశాఖల క్రిందచీల్చి నల్గురు కార్యదర్శులకు అప్పచెప్పుతున్నారు.

అయ్యంగారి నివేదికప్రకారం ఒక క్లిష్ట యంత్రాంగాన్ని తయారుచేసి ఖర్చు పెంచుకోటం తప్ప సుగుణమేదీ కనపడటం లేదు.

సమర్థనీయంగా పనిచెయ్యాలంటే అధికారం ఒక్క చేతిలో కేంద్రీకృతమై ఉండాలి. నిర్ణయాలు, నిష్పాక్షికము సంపూర్ణము అయిన విషయసేకరణము మీద ఆధారపడినపుడు ఈ అధికారం బలీయంగా ఉంటుంది. లేకపోతే ఉండదు. అధికారం ఉన్న వ్యక్తి నిర్ణయాలు కొనసాగించే బాధ్యత ఉండాలి. ఈ సూత్రాల వేటినీ గోపాలస్వామిగారి నివేదిక విశదీకరించలేదు.

నివేదికకారుడు, ఒక్కొక్కశాఖ; కార్యకలాపానికి అందుబాటైన పరిమితిలోఉండి ఒక్కత్రాటిమీద నడిచేదిగా ఉండాలన్నారు. వారే స్వయంగా, రవాణాశాఖామంత్రులుగా, రైల్వేలు, ప్రభుత్వఉద్యోగవ్యవహారాలు, ఇండో-పాకిస్తాన్ వ్యవహారాలు ఇన్నిటికీ మంత్రులుగా ఉన్నారు. ఇన్నిపనులు ఒక్కశాఖలో సుసాధ్యంగా సుగమ్యంగా జరుగుతాయో జరగవో అనుభవైక్యంగా వివరింపబడలేదు.

ఒకటిమాత్రం తెలుస్తోంది. ఆగ్గురు మంత్రులతో, ఇప్పటికన్నా 126.19 కోట్ల రూపాయల తక్కువ వ్యయంతో, బ్రిటిష్ హయాములో ఉద్యోగవర్గం బాగా పనిచేసింది. యంత్రాంగబలగంకన్నా, పనిచేసే మూలపురుషులు సమర్థనీయులవటం ముఖ్యం గోపాలస్వామి అయ్యంగారి సూచనలు నిజంగ మంచివే అయినా, వాట్లను ఆచరణలో పెట్టేందుకు చాలా సమర్థులైన ఉద్యోగులు అవసరం.

ప్రభుత్వ విదేశ వ్యాపారము

(గౌతమ)

ప్రభుత్వమే వ్యాపారం చేయడమనేది గొప్ప సమస్య. దాని బాగోగులనుగూర్చి దేశముఖ్ సంఘంవారు విచారించి నివేదికను దాఖలుచేయనున్నారు. అట్టిది, ఆర్థికవ్యవస్థఅంతా ప్రభుత్వ వశమందున్న రష్యావంటిదేశాలలోనే పూర్తిగ సాధ్యం కాగలదు. యుద్ధసమయంలో ఇంగ్లాండునందు ప్రభుత్వవ్యాపారయత్నము కొంత జరిగెను. ప్రస్తుతం ఇండియా ప్రభుత్వంవారు ఆహారధాన్యాల ఎరువులు ఇనుము ఉక్కు దిగుమతివిషయంలోను, యితరవస్తువులు కొన్నింటి ఎగుమతివిషయంలోను యితరదేశ ప్రభుత్వాలతో వస్తువినిమయ పద్ధతిని వ్యాపారంచేయ యత్నించుచున్నారు.

ఇండియాలో ప్రభుత్వవ్యాపారం - ఏదో తప్పనిసరిగ అత్యవసరసమయాలందు చేయవలసిందేగాని, రష్యాలోవలె సర్వదా చేయుటకు తగిన రాజకీయవాతావరణంగాని మనోతత్వంగాని లేవు.

2

ఇండియాయొక్క విదేశవ్యాపారం క్లిష్ట పరిస్థితులలో పడినది. దేశవిభజనవల్ల ఇండియా యూనియనుకు జనుము, ప్రత్తి చర్మములు మున్నగు ముఖ్యముడిపదార్థములు లోటయినవి. 1948-49 లో ఇండియాయొక్క కోస్తావ్యాపారంలో రూ 95 కోట్లు, పాకిస్తానులో రోడ్డు మార్గాన వ్యాపారం రూ 50 కోట్లు లోపం వచ్చింది. ఈసాలుమొదట్లో కొంచెం ఎగుమతులు హెచ్చినా ఆలోటు అట్లేయుంది. కనక విదేశాలకు చెల్లించవలసిన మొత్తాలగూర్చి ఇండియాప్రభుత్వానికి బెంగగా వుంది. అందుకే ప్రభుత్వమే స్వయంగా వ్యాపారం చేసి సర్దుకొనజూచుచున్నారు.

ఇండియాఎగుమతివ్యాపారములందు చాల లోపము లున్నట్లు యిదివరకుఅనుభవమునుబట్టి తెలియుచున్నది. ఆస్ట్రేలియా మున్నగు దేశాలకు ఇండియానుండి పోయిన వస్త్రాల నాణ్యంగూర్చి ఎన్నో ఫిర్యాదులు వచ్చినవి. ప్యాకింగు సరిగా లేదన్నారు. చూపిన మచ్చురకం ఒకటి పంపిన సరుకు యింకొక టన్నారు. ఈఫిర్యాదులవలన మన విదేశీవ్యాపారం తగ్గింది. పైగా సరుకు తీసుకపోయే స్టీమరుకంపెనీలకు మాట వచ్చెను. నూనెలు నూనెవిత్తుల ధరలు విపరీతంగా పెరుగుటగూడ ఎగుమతి తగ్గుటకు కారణమయ్యెను. ఇట్టిపరిస్థితులలో ప్రభుత్వమే యీ యెగుమతిపూచీ వహించినచో విదేశాలందు కొనుబడిదారులకు నమ్మకం కల్గి, మన ఎగుమతులు పెంపొందగలవని ఇండియాప్రభుత్వంవారు భావించిరి.

అనేకదేశాలతో ఇండియాప్రభుత్వం గత ఏడాదిలోగా అనేక అన్యోన్యఒడంబడికలు గావించుకొన్నది. ఆయాదేశాలకు చెల్లింపవలసిన బాకీమొత్తాలు చూసుకొని వాటికి తగినట్లు వారికి కావలసిన వస్తువులు పంపి మనకు కావలసినవి తెప్పించుకొనుటకే, ఒక పథకం నిర్ణయించి ఆ దేశాలతో వ్యాపారం సాగించుటకు యీ ఒడంబడికలు ఉద్దేశింపబడినవి. ఏ దేశానికి ఎంత పంపాలో గరిష్టప్రమాణాలు నిర్ణయించి, అంతవరకే పంపినచో ఇండియాకు లాభముండును. అందుకే, మామూలువ్యాపారంలో ప్రభుత్వం జోక్యం కలిగించుకొనవలసివస్తున్నది. ప్రభుత్వవ్యాపారాన్ని సమర్థించుటకు యిది పెద్దవాదము కాదుగాని, విదేశవ్యాపారం తగ్గి దేశానికి నష్టం వస్తున్నపుడు, యీ వాదం అంగీకరింపక తప్పకున్నది.

పాకిస్తానుతో వ్యాపారం

గత సెప్టంబరులో పౌండునాణెమువిలువ తగ్గిపోవుటచే ఇండియాకు క్రొత్తసమస్య లేర్పడినవి. నాణెంవిలువ తగ్గినందువలన విదేశాలకు ఎగుమతులు ఎక్కువై, ఎగుమతి దిగుమతుల విలవారా సన్నగిల్లు ననుకొన్నారు. కాని పాకిస్తాను ప్రభుత్వం తన నాణెమువిలువను తగ్గించనందున తీవ్రప్రతిబంధకా లేర్పడినవి. గత జూలైలో పాకిస్తాను - ఇండియాప్రభుత్వముల ఒడంబడిక ప్రకారం ఇండియాకు 40 లక్షల బేళ్లు, ముడిజనుము, 27 లక్షల చర్మములు, $4\frac{1}{2}$ లక్షల బేళ్ల ముడిప్రత్తి దిగుమతిచేసుకొనటకును, దానికి బదులుగ $20\frac{1}{2}$ లక్షల టన్నుల బొగ్గు, $1\frac{1}{2}$ లక్షల బేళ్ల మిల్లువస్త్రాలు, 1 లక్ష బేళ్లనూలు, 50 000 ట. జనుము పంచులు, 71000 ట. తినేనూనెలు, తదితరవస్తువులు పాకిస్తానుకి ఎగుమతిచేయుటకును, అంగీకరించబడెను. పాకిస్తాను రూపాయితో ఇండియారూపాయిమారకంవిలువ తగ్గినందున, ఇండియా యిపుడు తాను దిగుమతిచేసుకొను వస్తువులకు ఎక్కువడబ్బిచ్చి, దిగుమతి చేసుకొనువాటికి తక్కువ ద్రవ్యం పుచ్చుకోవాలి. రెండువిధాల నష్టమే.

ముఖ్యమగు ముడిపదార్థాలు ఇండియాకు పాకిస్తానునుండే రావలసియున్నవి. తయారయిన జనుమువస్తువులు 1948 లో మొత్తం రూ $151\frac{1}{2}$ కోట్లు ఎగుమతికాగా, అందు రూ 76, కోట్ల 36 లక్షలుమాత్రం డాలరుప్రాంతాలకు పోయినవి. కాని, యికముందు పాకిస్తానునుండి తెచ్చుకునే ముడిజనుమునకు ఎక్కువ యిచ్చుకోవాలి. డాలరుప్రాంతాలకు జనుమువస్తువులే ఎక్కువ పంపుచున్నాము కనుక తద్వారా ఎక్కువడాలరులు సంపాదించే అవకాశంకూడ తగ్గిపోవును. ఇట్లే పాకిస్తానునుండి వచ్చు ప్రత్తి, వెళ్ళు చర్మాలగూర్చి గూడ నష్టమే వచ్చును. పాకిపాకిస్తాను రూపాయివిలువ తగ్గించనందున ఇండియా ఎగుమతి వ్యాపారవిధానం తారుమారయింది.

పాకిస్తాను ఎపుడో ఒకప్పుడు తన నాణెం విలువ తగ్గించుకోకతప్పదని ఇండియాయును, యితరదేశాలు కొన్ని భావించుచున్నవి. ఈ ఆశతో ప్రస్తుతం పాకిస్తానుతో వ్యాపారం స్తంభించిపోయింది. రెండు దేశాలమధ్య వాణిజ్యయుద్ధం జరుగుచున్నవి. ఎవరు గెలుస్తారనేది వారి వారి సత్తువపై నాధారపడియుండును. అందుచే, రూపాయిమారకంవిలువ మారుటవల్ల కలిగిన నష్టములు తొలగించి, వీలయినంత లాభం పొందుటకే ఇండియాప్రభుత్వంవారు ప్రభుత్వ వ్యాపారస్కీములు తలపెట్టిరని యిందువల్ల స్పష్టమయినది.

కనుక అత్యవసరపరిస్థితులలోనే యీ పని జరుగుచున్నదనుటకు సందేహంలేదు. ఈప్రభుత్వవ్యాపారం తాత్కాలికమయిన ఏర్పాటకు టకు యింకో కారణం కూడ గలదు. వర్తక సుంకాల జనరలు ఒడంబడికయందు ఇండియా సంతకంచేసి, హవానాచార్టరును ఆమోదించినందున యీరెండింటగూడ, హెచ్చుతగ్గులు సవరించుటకు తప్ప ప్రభుత్వములు విదేశవ్యాపారములందు జోక్యం కలిగించుకోరాదని విధించబడియున్నది.

3

విదేశీవ్యాపారమునందు అన్ని వస్తువులు ప్రభుత్వమే తెప్పించి పంచు బాధ్యత వహించజాలదు. అందుకు విశేషసిబ్బంది, అనుభవము, పెట్టుబడి కావలసియుండును. కొన్నింటమాత్రము ప్రభుత్వం పెత్తనం వహించగలదు. అన్నివస్తువుల వ్యాపారము ప్రభుత్వమే చేసినచో మామూలువ్యాపారస్తులకు పనిలేకుండపోవును. వారికి విదేశీ వ్యాపారస్తులతో సంపర్కం తొలగిపోవును. కొన్నింటమాత్రమే వ్యాపారం చేసినచో, యీ విదేశీవ్యాపారం చేస్తున్నవారికి యితర వస్తువులలో వ్యాపారం చేసుకొనుటకు అవకాశం యుండును. అందుచే అవసరం తీరినపిదప, తిరిగి మామూలువ్యాపారస్తులకు ప్రభుత్వం చేస్తున్న విదేశీవ్యాపారం విడచుటకు ఆట్టే కష్టముండదు.

ప్రభుత్వం తీసుకోవలసిన వ్యాపారా లెట్టివి

ప్రభుత్వం వ్యాపారంచేయవలసిన వస్తుసామగ్రి ఎట్టిదో ఆలోచింతము. సరకు తగ్గిపోనిగు జరుగుచున్న వస్తువులను దిగుమతిచేసి పంచే అధికారం ప్రభుత్వం వహించాలి. విదేశాలకు పంపే సరకు మంచిదిగానుండి, ఆ వ్యాపారం పెంపొందించుట అవసరమని తోచినపుడు ప్రభుత్వం జోక్యం కలిగించుకోవచ్చు. వ్యాపారస్తులు అనవసరంగా ధరలు పెంచుటచే, విదేశీ ఎగుమతులు తగ్గిపోతున్నపుడు ప్రభుత్వం జోక్యం కలిగించుకోవలసియుండును. రూపాయిమారకంరేటు మారినందున దెబ్బతిన్న వస్తువుల ఎగుమతి దిగుమతుల విషయంలోగూడా ప్రభుత్వమే వ్యాపారపెత్తనం వహించాలి.

ఈ సిద్ధాంతాల ననుసరించి యీ దిగువవస్తుసామగ్రియందు ప్రభుత్వం వ్యాపారం చేయవచ్చు. ఎగుమతులు: జనుమువస్తువులు, ప్రత్తినూలు, వస్త్రములు, తేయాకు, ముడిజనుము, దాని రద్దు, ప్రత్తిరద్దు, నూనెలు నూనెవిత్తులు, చర్మములు. ఈ వస్తువుల 1948-49 ఎగుమతి విలువ :—జనుము వస్తువులు రూ 146.81 కోట్లు తేయాకు రూ. 63.69 కోట్లు, ప్రత్తినూలు, వస్త్రాలు రూ. 39 85 కో. ముడిజనుము రద్దు 28.89 కో. ముడిప్రత్తి, రద్దు - రూ. 19.15 కో. నూనెలు, నూనెవిత్తులు రూ 18.39 కో. చర్మములు-రూ 18.23 కో. మొత్తం రూ 335.06 కో 1948-49 సం॥ ఎగుమతు లన్నింటి మొత్తం విలువ రూ 422.82 కో.

దిగుమతులు :—ముడిజనుము, ముడిప్రత్తి, చర్మాలు, ఆహారధాన్యాలు, ఎరువులు, ఇనుము ఉక్కు, రసాయనములు. జనుము, ప్రత్తి చర్మాలు పాకిస్తానునుండే రావాలి. ఆహారధాన్యాల దిగుమతులు, మనదేశంలో ఉత్పత్తి ఎంత ఎక్కువ చేయగలరో దానిపై నాధారపడియుండును.

4

కొనుగోలు పంపకం మంచి కట్టుదిట్టములతో జరుగుట ప్రభుత్వవ్యాపారానికి చాల అవసరము. టెండరులద్వారా కొన్ని వస్తువులు కొనవచ్చును. మరికొన్ని ఉత్పత్తిదారులవద్దనుండే సరాసరి కొనవచ్చును. ప్రభుత్వం వారు యితరదేశప్రభుత్వంద్వారా కొనే వస్తువులను విదేశదిగుమతిదారులద్వారా తెప్పించుకొనవచ్చును. విదేశాలందుండు ట్రేడుకమిషనరుల సహాయంతో విదేశాలందు సెల్లింగు ఏజెంటులను నియమించవచ్చును. విదేశాలందు సరకు కొని ఇండియాకు పంపే ఏర్పాటులు వారు చేయగలరు.

ఆహారధాన్యాలవంటి వస్తువులు ప్రభుత్వోద్యోగులే దిగుమతిచేసి టోకు వ్యాపారస్తులకు పంచవచ్చును. దిగుమతయే ముడిపదార్థాలు సరాసరి పరిశ్రామిక కేంద్రాలకే పంపేటట్లు ఏర్పాటుచేయవచ్చును. పాకిస్తానునుండి వచ్చే జనుము సరాసరి భారతీయమిల్లులకు అందజేయవచ్చును. ఇతర ముఖ్యమయినవస్తువులను వ్యాపారసంస్థలద్వారానే, స్థానికంగా పంపకం జరిపించవచ్చు.

ప్రభుత్వం విదేశాలతో వ్యాపారంచేయునపుడు అక్కడకు పంపే సరకు ఉత్పత్తి కంట్రోలుగూడా ప్రభుత్వం వశమందుంచుకోవాలి. సరకునాణెము కాపాడుటకు దేశంలో కావలసింది యుంచి మిగిలింది ఎగుమతి చేయుటకు యిది అవసరము. ఇతరదేశాలపై ఎక్కువగ ఆధారపడి యుండకుండుటకై ఉత్పత్తి యెక్కువ చేయుటకు ప్రభుత్వం కంట్రోలు వహించుట అవసరం. ప్రభుత్వంవారు కనీస ఎగుమతివిలువలనుగూడ నిర్ణయించవలసియుండును. ఆహారధాన్యాదులవిషయంలో వాడుకొనేవారి శ్రేయము నారసి ఎలాగూ ధరలు నిర్ణయించక తప్పదు.

ఇట్టి వ్యాపారములందు ప్రభుత్వంతో ప్రయివేటువ్యాపారస్తులు పోటీచేయజాలరు. కనుక ఆవస్తువులందు యితరులు వ్యాపారం చేయనేరదు.

5

ప్రభుత్వంవారు తమ పరిపాలనాశాఖల ద్వారానే యీ వ్యాపారం కొనసాగించుట అసాధ్యము. అనుభవజ్ఞులు వ్యాపారజ్ఞానం గలవారు ఉద్యోగులలో అట్టేమంది యుండరు. పైగా ప్రభుత్వానికి అవసరమగు పెట్టుబడి అంతాకూడ ఉండకపోవచ్చు. కనుక వ్యాపారస్తుల సహాయం గైకొనక తప్పదు.

కనుక ప్రభుత్వవ్యాపారసంస్థలు (స్టేటు ట్రేడింగు కార్పొరేషన్సు) కొన్ని స్థాపించి, వాటికి కొన్ని ప్రత్యేకవస్తువుల వ్యాపారపెత్తనమే ఒప్పగించి, పెట్టుబడి ప్రభుత్వంవారును ప్రయివేటువ్యాపారస్తులు సమభాగంగా పంచుకోవాలి. డైరక్టరుల బోర్డులో ఉభయవర్గాల ప్రతినిధు లుండవచ్చు వారికి అధికారేతర సలహా సంఘా లుండవచ్చును. ఈ సంస్థల నిర్వహణవిషయమున ప్రభుత్వానికి పూర్ణాధికారం ఉండును. అధికలాభాల ఉద్దేశం యీ సంస్థకుండరాదు. ఈ సంస్థలు అత్యవసరపరిస్థితులందే కొనసాగి, విదేశీవ్యాపారమును సక్రమంగా జరిపించి, విదేశాలకు మనదేశంనుండి యిచ్చిపుచ్చుకునే లావాదేవీలందు మనకు నష్టం రాకుండా చూచి, ఇండియాలో ప్రస్తుత మేర్పడిన క్లిష్టపరిస్థితులను తొలగింపగలవు.



కార్మికుల కనిష్టవేతనాల శాసనంమీద చేవ్రాలుచేస్తూ అమెరికాఅధ్యక్షుడు ట్రూమన్

ముఖస్తుతులు

శ్రీమతి వేదుల మీనాక్షీదేవి

అలకభ్రాజితమై, సుధాంశునిభమై,
వాసప్రభోద్దామమై
జలజాతంబయి కర్ణకుండలవిరా
జద్గండమై యొప్పు నా
జలజాతాక్షుముఖంబు .....
....

అని అక్రూరుడు శ్రీకృష్ణుని ముఖమును స్తుతించాడు. నిజంగా అతను ముఖస్తుతికే అంటే ఆ కృష్ణుని యెదటే అనేవాడు. కాని అతని కలాంటి వుద్దేశం లేదు. ప్రతిఫలాపేక్ష కలవాడు కాడతను. పరమభక్తుడు. అందుకనే తనలో తను ఆ భగవంతుని రూపమును స్మరించుకుని ఆనందంతో తన్మయుడయ్యాడు.

ముఖస్తుతి అంటే ముఖాన్ని స్తోత్రం చెయ్యడం. ముఖసౌందర్యవర్ణన అనికూడా చెప్పవచ్చు. దీన్ని కవులు అనేకవిధాలుగా వుపయోగించారు. చాలామంది గ్రంథరచనారంభమందు "ఇష్టదేవతాప్రార్థన"లలో ముఖస్తుతి చేశారు.

"నాలుగుమోములన్ నిగమ
నాదము లుప్పతిలన్ ప్రచండవా
తూలహతిం జనించు రొద
తోడి గుహావళి నొప్పు మేరువున్ . .
బోలె..............."

అని వర్ణించాడు పెద్దన్న బ్రహ్మని. "నీ నోళ్లు నాలుగూ కొండగుహల్లా వున్నాయిగా అబ్బ" అన్నా పాపం బ్రహ్మ కోపగించలేదు. ఎందుకు? ఆ నోళ్లల్లో 'నిగమనాదా లుప్పతిల్లుతున్నాయి' అన్నాడుగదా అని ఆనందించి, అతని వాంఛితార్థమైన కృష్ణరాయని "విభవోజ్వలుణ్ణి" చేశాడా వేదవిప్రుడు.

నాయికానాయకుల విషయంలో యితోధికంగా వుంటాయి యీ ముఖస్తుతులు. వారు వొకరి చక్కదనాన్ని మరొకరు వర్ణించడమో, లేక, కవే వారి రూపాన్ని, ముఖలక్షణాలని పాఠకుల కళ్లకి కట్టేటట్టు వర్ణించడమో జరుగుతుంది.

ముఖం చంద్రబింబంతోను, చెవులు శ్రీకారంతోను, ముక్కు సంపెంగమొగ్గతోను, కళ్లు కలువరేకులతోను, జుట్టు తుమ్మెదరెక్కలతోను కంఠం శంఖంతోను పోలుస్తారు. 'ఇదే ముఖస్తుతి' అంటే.

అప్పటి ముఖస్తుతికీ, యిప్పటి ముఖస్తుతికీ వుత్తరధృవానికీ, దక్షిణధృవానికి వున్నంత సామీప్యం కనబడుతోంది.

ఇప్పటి ముఖస్తుతికి "ముఖంయెదుట మెప్పుమాటలాడడం" అని అర్థం. యతి, ప్రాస, నీతి, నియమా లక్కరలే దిప్పటి ముఖస్తుతులకి. ముఖసౌందర్యంతో పని అసలే లేదు. సుగుణాలతో పని అంతకన్నా లేదు. ఏదైనా పని కావలసివస్తే యెవరివల్ల ఆపని అవుతుందో కనుక్కుని, వొకవేళ ఆయనంటే యిష్టం లేకపోయినా ఆయనదగ్గిర కెళ్లి, యేవో యిచ్చకాలాడి ఆయనమెప్పు సంపాదించి, తన పని నెరవేర్చుకునేదాకా విడిచిపెట్టకపోవడం. నెరవేరాక వాడెవడో ? నే నెవడో ? ఇదీ నేటి పరిస్థితి.

ఇవి ముఖస్తుతుల రోజులు. ధనవంతుడైనా సరే. విద్యాధికుడైనాసరే. ఇది చేతగానివాడు యెందుకూ కొరగానివాడు. వాని విలువ చిల్లిగవ్వకూడా చెయ్యదు. ఏ తెలివి లేకపోయినా యీ తెలివి కలవాళ్లు ఆదర్శప్రాయులు.

ఈ ముఖస్తుతికి లొంగనివా రుండరు. వ్యాపారస్తులుకూడా ముఖస్తుతి చేసేటప్పటికి వొక క్షణం వ్యాపారధర్మం మరచిపోవడం కద్దు.

వర్మకి చెప్పతగ్గ పాండిత్యం లేకపోయినా తెలుగులో మంచి కృషి చేశాడని చెప్పవచ్చు. కొత్తపక్కీలో విరహగీతాలూ అవీ అల్లగలడు. ఈ మహాశయుడు తెల్లవారేసరికి కాల్యకృత్యాలు తీర్చుకుని మంచి పంచ, చొక్కా, ధరించి, కళ్లకి చలవజోడూ, కాళ్లకి జోడూ తగిలించుతాడు. ఆ వూళ్లో కొత్తగా హోటలు పెట్టాడొక అయ్యరు పొరుగూరినుండి వచ్చి. ఆ హోటలుకి వెళ్లి అయ్యరుతో బాతాఖానీ వేశాడు వర్మ. తానా వూళ్ళో మంచి పలుకుబడి కలవాడనీ, మంచి కవి అనీ చెబుతూ పనిలోపని అయ్యరుని కొస్త పొగుడుతూవుండేవాడు.

హోటలుకి వచ్చేవాళ్లు ఫలహారానంతరం డబ్బు అతనిచేతిలో పారేసి అతని ముఖం కాదుసరికదా ఆ డబ్బులైనా "చేతిలో పడ్డాయో, నేలమీద పడ్డాయో"అనైనా చూడకుండా వెళ్లిపోతారు. అదీగాక ఆ అయ్యరు కా వూరు కొత్త. దానికి తగ్గట్టు "నా" అనేవా ళ్లెవ్వరూ లేరతనికి. ఈ పరిస్థితిలో వర్మ తనతో మాట్లాడిందే చాలు ననుకుని తనుకూడా కబుర్లలోకి దిగి ఆయన్ని త్వరగా వెళ్లనిచ్చేవాడు కాడు. అందువల్ల వారికి స్నేహం కుదిరి అందుకు చిహ్నంగా వొక కప్పు కాఫీ, రెండు యిడ్లీలు ; వొక దోసె యివ్వడం జరిగేది వర్మకి. వర్మ పాచిక పారింది. వర్మ బయలుదేరిన వేళావిశేషమేమోగాని ఆ అయ్యరుకి మహాగురి కుదిరింది యితనంటే.

వర్మకూడా వంటరివాడే. ఇదివరలో యేదో హోటలులో భోజనం చేస్తూండేవాడు. అయ్యరుతో స్నేహం అయిందిమొదలు యితన్ని తరచు భోజనానికి పిలుస్తూండేవాడు. తరువాత కొద్ది రోజులకే, అక్కడే భోజనం యేర్పాటు చేశాడు "ఫ్రీ"గా యితనికి.

వర్మకోసం యెవరైనా స్నేహితులు పొరుగూరినుండి వచ్చేవారు. వాళ్లని ఆ అయ్యరుగారి హోటలుకి తీసుకువెళ్ళి ఆయన్ని వాళ్లకి చూపిస్తూ "ఈయన చాలా మర్యాదస్థుడు. మంచి రసజ్ఞుడు మనబోటిగాళ్ల రచనలు చాలా ఆనందంతో వింటాడు. నాకీ వూళ్లో చెప్పుకోదగ్గ స్నేహితు లెవరూ అంటే యీయనే అని చెప్పాలి" అనేవాడు వర్మ. అయ్యరు ఆమాటలకి వుబ్బిపోయి నవ్వుతూ "ఏందో వర్మగారు అట్టగా అంటురు. ఆయనకు నేనంటే రొంబ అభిమానం" అని వారందరికీ తనే భోజనం యేర్పాటుచేసేవాడు వాళ్ళవర్మకి ఖర్చు అక్కరలేకుండా.

కావలసిన వ్యక్తిని పొగిడినా పొగడకపోయినా అతని శత్రువునిగురించి నింద చెయ్యడం వొకరకం ముఖస్తుతి.

వెంకోజీరావుగారికి మేష్టరీవుద్యోగం. పరమబద్ధకస్తుడు. క్లాసుకి వెళ్లిందిమొదలు యెందుకో అందుకు పిల్లల్ని చివాట్లెట్టడం, లేకపోతే బాతాఖానీలోకి దిగడం తప్ప పట్టుమని పాఠం చెప్పేవాడే కాదు. పిల్లలకి పరీక్షలు దగ్గిర కొస్తున్నాయని చదువుకునేందుకేమీ ఆధారం లేకపోయేది. ఏదో మార్గం చూసుకోకపోతే లాభం లేకపోయిందా విద్యార్థులకి. ఇప్పటి విద్యార్థులంటే సామాన్యులా ? ఆవలించకుండానే పేగులు లెక్కపెట్టేస్తున్నారు. చదువులో ఆ తెలివితేట లున్నా లేకపోయినా, వెంకోజీరావుగారికీ రామారావుగారికీ బద్ధవైరం అనీ, రామారావుగారు కష్టపడి పాఠం చెబుతారనీ, తెలివైనవాడనీ తెలుసుకున్నారు. రహస్యంగా ఆయనయింటికి వెళ్లి "మేష్టారూ. మీరు మాకు వస్తే బ్రతికిపోదుము. అంత అదృష్టమా ? మా దురదృష్టంకొద్దీ ఆ వెంకోజీరావుగారు దాపరించాడు. ఏ జన్మన్నీ పాఠం చెప్పినపాపాన పోడు. ఖర్మం చాలక చెబితే మా కర్థం కాదు. తెలియలేదంటే "మీ అచ్చుపుస్తకాల్లో వుంటుంది. చదువుకోండి"అంటారు. మా అంతట మేమా పుస్తకాలు చదువుకుని, అర్థంచేసుకుని, పరీక్షకు తయారైతే యీయ నెందుకండీ మాకు ? మీరు చెప్పిన నోట్సు చాలు నని మా విద్యార్థులు సంతోషిస్తున్నారు. మీ కెప్పుడు తీరికగా వుంటుందో చెబితే అప్పుడు వస్తాం. మాకు గల సందేహాలు తీర్చండి మీకు పుణ్యం వుంటుం" దని బ్రతిమాలారు.

తనను పొగడడంకంటె తన ప్రతికక్షి అయిన వెంకోజీరావుగారిని నిందించడంవల్ల కలిగిన ఆనందంతో వారానికి వొకగంట వారికోసం వినియోగించుతా నని వాగ్దానంచేసి ఆప్రకారం ప్రతీ శనివారం వారికి కావలసిన విషయాలు చెప్పేవాడు మళ్లీ సందేహం అనేది కలగకుండా.

ముఖస్తుతి చెయ్యడం లేదంటూ మాట్లాడడం యింకొక ముఖస్తుతి.

ఉన్నతాశయాలు కలవాడనీ, కరుణామయుడనీ పేరుపొందిన వొక అధికారి వుండేవాడు. ఆయన ముఖస్తుతులకు లొంగడని ప్రతీతి. ఒకనాడాయనదగ్గిరకి పనిమీద శాస్త్రుల్లుగా రెవరో వచ్చి నమస్కారం చేసి నిలబడ్డాడు. ఆ అధికారి తిరిగి నమస్కారం చేసి ఆయన్ని కూర్చోమని తనుకూడా కూర్చుని "యేమిటి సంగతి ?" అన్నారు. అందుకా ముసలాయన "అయ్యా ! వొరొకరూ మరొకరూ అయితే నాలుగు మెప్పుమాటలాడి పని నెరవేర్చుకునేవాడిని. పొగడ్తలకు పరాఙ్ముఖులయిన తమవంటివారివద్ద అలాంటి వేమీ పనికిరావు. అందుచేత యేవిధంగా మాట్లాడాలో తోచడంలేదు" అన్నాడు సమయస్ఫూర్తిగా.

అందుకా అధికారి "చూడండి శాస్త్రీజీ. ఇది నా గొప్ప కాదు. వంశపారంపర్యా వస్తున్న సాంప్రదాయం. మా తాత ముత్తాతల దగ్గరనుండీ ముఖస్తుతులంటే కిట్టకపోవడమే. ఆ మాటఅంటే అరికాలిమంట నెత్తి కెక్కుతుంది. వొకరిని పొగడనూవద్దు. వకరిచేత పొగిడించుకోనూ వద్దు ఇంతకీ యెందుకు చెబుతున్నానంటే 'పొగడ్తలనవసరం' అని. ఎవరంతటివాళ్లం వాళ్లం. ఇందులో వొకరి తక్కువ. వొకరి యెక్కువ యేమిటి ? ఆ భగవంతుని దృష్టిలో అంతా సమానమే. సరే దానికేం గాని మీరు వచ్చిన పనేమిటో చెప్పారుకారు." అని ఆ పని తెలుసుకొని వెంటనే నెరవేర్చి పంపేశాడా వృద్ధుని. "ఈవాడు తప్ప యింత వెంటనే పనిచెయ్యడం అనేది ఆయనజన్మలో యెరగడు." అని బంట్రోతులు ఆశ్చర్యపోయారు.

"వ్రతానా ముత్తమం వ్రతం" అన్నట్టు యెదట యెవరు అధికారపీఠంమీద వుంటే వాళ్లే మంచివారని పొగడడం (మిగిలినవారు కానట్టు) మరొక ముఖస్తుతి.

మాయింట్లో కుటుంబీకుడైన సుమస్తాగారు కాపురం వుండేవారు. జీతం యాభయ్యెంతో వుండేది. విశేషం చదువు లేకపోయినా యెంతటివాడినీ లొంగతీసుకునే చాకచక్యము వుండేది. అధికారిగా యెవడు వస్తే వాడి నే పట్టేసేవాడు. వచ్చిన మర్నాటినుండీ రోజూ వుదయం, సాయంత్రం యింటికి వెళ్లి ఆయన వద్ద చేతులు కట్టుకుని నిలబడేవాడు. ప్రతీదానికీ "చిత్తం" అంటూండేవాడు. యజమానిదగ్గిర యెవ్వరు లేకుండా చూసి "మీలాంటి ప్రభువులు మాకు రావడం మా అదృష్టం. ఇదివరకు వచ్చినవా రంతా మీలాగ తమ పనివాళ్ల కష్టసుఖాలు చూసేవా రనుకున్నారా ? తెలివైన వాళ్లనీ, కష్టపడి పని చేసే వాళ్లనీ అణగదొక్కేసేవారు. ఆఫీసులో అడుగు పెట్టింది మొదలు మమ్మల్నెంచడం చివాట్లెట్టడంతో సరిపోయేది. పది నిముషాలైనా పట్టుమని ఆఫీసులో వుండేవారాండి ? ముఖంయెదుట అనడం కాదుగానీండీ నిజం చెప్పవలసివస్తే యిప్పుడే మనశ్శాంతి లభించి, సుఖిస్తున్నాము. మీలాంటి ధర్మమూర్తు లుండబట్టే యింకా వానలంటూ కురుస్తున్నాయి భూమిమీద." అని ముఖస్తుతి చేస్తూ ఆయనకు కావలసిన సమస్తసదుపాయాలు చేసేవాడు "మనో వాక్కాయ కర్మణా". (మనస్సుమినహాయించే) ఈ విధంగా చేసి చివరకు ఆయనను లొంగతీసుకునేవాడు. ఇక యీయన యెంతచెప్పితే అంత అధికారికి. తన పనైనా సరే ఆయనతో చెప్పందే చేసేవాడు కాడు. ఆ ఆఫీసులో యెవరికేపని కావలసి వచ్చినా యీయన "సిఫార్సు" చెయ్యందే అయేది కాదు. క్రమంగా అధికారి యెవరో తెలియక ఖంగారుపడేవారు ప్రజలు ఆఫీసులో వాళ్లు తప్ప.



మంగళగిరిలో తుపానుబాధితులకు వస్త్రదానం.

కథానిక:



ఇది ఇవాళా నిన్నటి కథ కాదు. మన కథా కాలంనాటికి లోకానికి విజ్ఞానభిక్ష పెట్టిన ఆర్యులే అజ్ఞానస్థితిలో వున్నారని చెప్పాల్సి వస్తుంది. అప్పటికి పంచాంగాలు గుణించటం ఆర్యులు నేర్చుకోలేదు. సూర్యచంద్రులూ తదితరగ్రహాలూ నక్షత్రాలూ ఆకాశంలో ఇష్టం వచ్చినట్లు తిరుగుతుండేవి. వాటి తిరుగుడుకీ తమ జీవితానికీ ముడిపెట్టటం అప్పటికి ఆర్యులకి తెలియదు.

ఆర్యులు భారతదేశాన్ని ఆక్రమించుకొని అక్కడనివసిస్తున్న అనార్యులని వింధ్యపర్వతాల అవతలకి తరిమివెయ్యటంతో తృప్తిపడి వూరుకోలేదు. వాళ్లకి రాక్షసులు, భూతాలు, దొంగలు అనేబిరుదుల్ని కూడా అంటకట్టారు.

ఆర్యులు ఉత్తరదేశాన్ని ఆక్రమించుకున్న కొంతకాలానికి అగస్త్యమహాముని కొంతమంది

శ్రీ 'అమరేంద్ర'

శిష్యులతో దక్షిణాదికి తరలివచ్చాడు. ఆతరవాత కొందరు ఆర్యయోధులు వింధ్యపర్వతాలు దాటి దక్షిణాదికి దండెత్తిరావటం మొదలుపెట్టారు. ప్రద్యుమ్నుడూ మఘవుడూ అనే ఆర్యయోధులుకూడా అల్లాగే దక్షిణానికి వచ్చి అక్కడివాళ్లని కొండల్లోకి తరిమేసి సారవంతమైన కొంతప్రదేశాన్ని ఆక్రమించుకుని తమ రాజ్యం స్థాపించారు.

ప్రద్యుమ్నుడూ మఘవుడూ ప్రాణమిత్రులు. ఇద్దరూ కష్టపడి తమ భుజబలంవల్లా పరాక్రమంవల్లా రాజ్యం సంపాదించారు. కాని సంపాదించిన రాజ్యానికి రాజు ఎవరనే చిక్కుప్రశ్న వచ్చి ప్రాణమిత్రులిద్దరినీ చికాకుపరిచింది.

"మఘవా ? నువ్వే రాజువి. నేను నీకు సేనానిగా వుంటాను" అన్నాడు ప్రద్యుమ్నుడు.

"కాదు కాదు ప్రద్యుమ్నా! నువ్వే రాజువి కా. నేను నీకు సేనానిగా వుంటాను" అన్నాడు మఘవుడు.

ఎంతకీ చిక్కు విడిపోలేదు. మఘవుడికి ప్రద్యుమ్నుడు రాజయితే బాగుండునని వుంది. వాళ్ల స్నేహం అంత గాఢమైనది. ఎవరిలోనూ స్వార్థం లేదు. పోనీ రాజ్యాన్ని పంచుకుని చెరొకసగం తీసుకుందామా అంటే చాలా చిన్న రాజ్యం. రెండుముక్కలు చేస్తే బలహీనమైపోతుంది. శత్రువులకి మరీ వీలుచిక్కుతుంది. అందువల్ల ఈ సమస్యని ఎల్లా పరిష్కరించాలో తెలియక మిత్రులిద్దరూ తికమకపడుతున్నారు.

ఇల్లా వుండగా ఒకనాటి రాత్రి వాళ్లిద్దరూ చికాకుగా వున్న మనస్సుల్తో తమ కోటచివరి అంతస్తుడాబామీద తిరుగుతున్నారు. ఆకాశంలో పూర్ణిమచంద్రుడు కిలకిల నవ్వుతున్నాడు. మఘవుడికి ఆలోచించే అలవాటు లేదు. కొంచెం సేపు ఆలోచించవలసివచ్చినా చేత్తో తన పొడుగాటి నల్లగడ్డాన్ని దువ్వుకోటం అతనికో అలవాటు. అతని శరీరం ఉక్కులాగా నిగనిగలాడుతూ వుంటుంది. నల్లరాయితో చెక్కిన విగ్రహంలాగా వుంటాడు.

ప్రద్యుమ్నుడు కొంచెం నాజూకుమనిషి. బలమైన శరీరం, బంగారంరంగు ఉంగరాల గిరజాలూ, కొంచెం నీలంగా వుండే కళ్లూ. అతను గడ్డం పెంచుకోలేదు. పెంచుకుంటే, కంఠాన్ని గిలిగింతలు పెడుతూ గుచ్చుకుంటుందని అసహ్యపడి తన కత్తిమొనతో నున్నగా క్షౌరం చేసుకునేవాడు మెలితిరిగిన మీసాలుమటుకు పెంచాడు. వాటిని వేళ్లతో సవరించుకుంటూ కోపంగా చికాకుగా చంద్రుడికేసి చూశాడు. కాని చంద్రుడు కిలకిల నవ్వుతున్నాడు. పంచాంగాలు లేకపోవటంచేత తనకి రాబోయే విపత్తు సంగతి తెలియక చంద్రుడు అమాయకంగా నవ్వుతున్నాడు. "నాకో వూహ తట్టింది ప్రద్యుమ్నా! ఎవరి చేతుల్లో ఎక్కువ బలం వుంటే వాళ్లు రాజు కావాలి. పరీక్ష చేసుకుందాంరా. నువ్వు నాచేతిని వొంచగలిగితే నువ్వు రాజువౌతావు. నేను నీ చేతిని వొంచగలిగితే నేను రాజునౌతాను. రా, చెయ్యి జాపు" అని మఘవుడు కేక పెట్టాడు. కోరమీసాలలో చిరునవ్వుని దాచుకుంటూ "అమ్మ దొంగా! నన్ను మోసంచేద్దామనా! యుద్ధంలో నా చెయ్యి నొప్పి పెట్టింది. వీల్లేదు" అన్నాడు. తన ఉపాయం కొరగాకుండాపోయినందుకు విచారిస్తూ మఘవుడు మళ్లీ ఆలోచనల్లో బడ్డాడు. గడ్డం నిమురుకుంటూ "అయితే ఇద్దరమూ రాజులం అయితే సరిపోతుందిగా" అన్నాడు. ఇది విని ప్రద్యుమ్నుడు "బాగానే వుంది. ఇద్దరం రాజులమైతే ఎవరిమాట ఎవరు వినాలి! ఎవరి మాటని ప్రజలు వినాలి ?" అన్నాడు. "అవునవును చిక్కుల్లో పడతాం. ఏందుకొచ్చిన గొడవ ?"

"పోనీ ఒకరితరవాత ఒకరం రాజయితే బాగుండదా ?"

అదెల్లా కుదురుతుందీ ?"

"కొంతకాలం నువ్వు రాజువి నేను సేనానిని. తరవాత నేను రాజునౌతాను నువ్వు సేనానివౌతావు. బాగుండదూ ?"

మఘవుడు ఆలోచించినమీదట "నీ ఆలోచన చాలా బాగుంది. కనక ఒకరోజు నువ్వు రాజువీ, మర్నాడు నేను రాజునీ అయితే బాగుంటుంది" అన్నాడు.

"అబ్బే అంత తొందరగా రాజులు మారితే రాజ్యం అల్లకల్లోలంగా వుంటుంది" అని అడ్డు చెప్పాడు ప్రద్యుమ్నుడు.

"అన్నిటికీ అన్నీ చెబితే ఈ సమస్య తెగేది ఎల్లాగు?" అని చికాకుగా అన్నాడు మఘవుడు.

"పోని నువ్వే ఆలోచించు. ఇవాళ నేను రాజునైనాను. నిన్ను పిలిచి "సేనానీ! నాకు దక్షిణదేశంలో లంబోదరుడి తోటలో మంచి మామిడిపళ్లున్నయ్యని తెలిసింది. వెళ్లి కోసుకురా" అని ఆజ్ఞాపించాననుకో. నువ్వు వెళ్లి కష్టపడి కోసుకొస్తావు. వచ్చేసరికి నువ్వు రాజువైపోయి నేను సేనానినైతే పళ్లు ఎవరు తినాలి!" అని యుక్తిగా అడిగాడు ప్రద్యుమ్నుడు.

"ఔను. ఇదంతా పెద్ద గొడవ అవుతుందిలే. ఎందుకొచ్చింది అనవసరమైన చికాకు ?" అన్నాడు. మఘవుడు.

ఇక్కడ ఒకసంగతి గుర్తుంచుకోవాలి. అప్పటికి ఆర్యులు అనాగరికులుగానే వున్నారు. ఒకరిద్దరు ఋషులు ఆకస్మికంగా దివ్యదృష్టిని పొంది ఉత్తరుభావాలని వెల్లడించేవారు. వారికి ఋతువులనీ వాటి మార్పునీ గురించి కొంచెం తెలుసునుకాని కాలాన్ని వారాలూ, మాసాలూ, నక్షత్రాలూ అని సూక్ష్మంగా విభజించటం తెలియదు. అందువల్ల మఘవుడూ ప్రద్యుమ్నుడూ మరీ చిక్కులో పడ్డారు.

పూర్ణిమచంద్రుడికేసి చూస్తున్న ప్రద్యుమ్నుడు "చూడు, చూడు, ఏమిటిది? ఏమిటిది?" అని ఖంగారుగా కేక పెట్టాడు. ఇది విని మఘవుడు ఆకాశంకేసి చూశాడు. ఎక్కడా మబ్బుతునక అయినా లేదు. కాని చంద్రబింబాన్ని ఏదో నల్లటి నీడ కప్పివేస్తోంది. ఆ చీకటినీడ రాకాసిలాగా కబళించివేస్తోంది. మిత్రులిద్దరూ ఆవేశంతో, ఆందోళనతో గజగజ వణికిపోయారు. మఘవుడు గబగబా వచ్చి ప్రద్యుమ్నుడి చెయ్యి గట్టిగా పుచ్చుకుని వొణుకుతున్న కంఠంతో "చంద్రగ్రహణం !" అన్నాడు.

"అవును. మరేం భయం లేదు. కాస్సేపటికి మామూలుగానే చంద్రుడు కనిపిస్తాడు. నా చిన్నప్పుడు అంగీరసమహర్షి ఆకాశంలో రాహువు అనే అదృశ్యరాక్షసు డున్నాడనీ, వాడు మధ్యమధ్య చంద్రుణ్నీ సూర్యుణ్నీ కబళిస్తాడనీ, మింగుడుపడక వదిలేస్తాడనీ చెప్పాడు. నీకేం భయం లేదు." అన్నాడు ప్రద్యుమ్నుడు.

"భయమేమీ లేదులే. నేనూ ఇదివరకు నాలుగైదుసార్లు చూశాము" స్నేహితులిద్దరూ ఒకరి చేతు లొకరు గట్టిగా పుచ్చుకుని ఆకాశంకేసి చూస్తూ నిలబడ్డారు. కోటచుట్టూ వెనురుతున్న జనం గుంపులుకూడి రకరకాల శబ్దాలు చేస్తున్నారు. ఈ ప్రచండధ్వని విని చంద్రుణ్ని మింగుతున్న పిశాచం చెదిరి పారిపోతుందని వాళ్ల నమ్మకం!

చాలాసేపటికి నెలవంక జాబిల్లీరేక తొంగి చూసింది. క్షణక్షణానికి బింబం పెద్దదై కాస్సేపట్లో నిండుబింబం బైటికి వచ్చింది. తన కేమీ బాధ కలగనట్లుగా ఎప్పటిలాగే చందమామ వెన్నెలచిరునవ్వులు వెదజల్లుతున్నాడు. అంతా ఆనందంతో గంతులేశారు. మఘవుడు పెద్ద నిట్టూర్పు విడిచి "అమ్మయ్య" అన్నాడు.

"మన చిక్కుకూడా విడిపోయింది" అన్నాడు ప్రద్యుమ్నుడు.

"ఎల్లా గెల్లాగు?" అని ఆత్రంగా అడిగాడు మఘవుడు.

"ఎల్లాగా ? ఇవాళ మొదలుకుని మళ్లీ చంద్రగ్రహణం వచ్చేదాకా నువ్వు రాజువి, నేను సేనాపతిని. తరవాత నేను రాజుని, నువ్వు సేనానివి. ఏం బాగా లేదూ ?" అన్నాడు ప్రద్యుమ్నుడు. మఘవుడు బాగా ఆలోచించి "బాగానే వుంది. కాని ముందు నేను రాజుని కావటం ఎందుకూ ?" అన్నాడు.

"ఎందుకా? ముందు ఆలోచన నాకు తట్టిందికనక నువ్వే మొదట రాజువి. ఇక నే వెళ్తాను. పొద్దున్నే సేనలని కూర్చుకుని దాడి వెళ్తాను. నువ్వు ప్రజలని ధర్మంతప్పకుండా పాలించు. మఘవమహారాజుకీ జై" అన్నాడు ప్రద్యుమ్నుడు. డాబామీదినుంచి దిగి కిందికి వెళ్లబోయాడు.

మఘవుడు దిగులుతో గడ్డం దువ్వుకున్నాడు. ఆకస్మికంగా అతని బుర్రలోకి ఒక ఊహ వచ్చింది గంభీరస్వరంతో "ప్రద్యుమ్న సేనానీ!" అని కేక వేశాడు. వెళ్లబోతున్న ప్రద్యుమ్నుడు ఆగిపోయి చేతులుకట్టుకుని నిలబడి "ఏమిటి శెలవు మహారాజా ?" అన్నాడు.

"రేపుపొద్దున్నే నేను సైన్యాన్ని తీసుకుని జైత్రయాత్రకి వెళ్తున్నాను. నేను తిరిగి వచ్చేదాకా నువ్వు ప్రజలని తండ్రిలాగా పరిపాలించాలని నాఆజ్ఞ. చాలా పొద్దుపోయింది. వెళ్తున్నాను" అని బిగ్గరగా నవ్వుతూ వెళ్లిపోయాడు. మఘవుడు వేసిన ఎత్తు గ్రహించి ప్రద్యుమ్నుడు చేసేది లేక మీసాలు మెలితిప్పుకున్నాడు.

మర్నాడే మఘవుడు సైన్యంతో దాడివెడలాడు. తన రాజ్యానికి దక్షిణభాగాన కోదండులనే అనార్యజాతివాళ్లున్నారు. వాళ్లని లొంగదీసుకోవాలని మఘవుడు బయలుదేరాడు.

కొంతకాలానికి మఘవుడు తిరిగి తన రాజ్యానికి వచ్చాడు. ప్రస్తుతకాలమానాన్నిబట్టి కొలిస్తే అతను మూడు నెలలతరవాత తిరిగివచ్చాడని చెప్పాలి. జుట్టు జడలుకట్టి పొదలాగా ఎదిగింది. కట్టుకున్న తోళ్లు చినిగి పేలికలై వేళ్లాడుతున్నయ్. కాని ముఖంలోమాత్రం సంతృప్తితో కూడుకున్న చిరునవ్వు చిందులాడుతోంది. రాజ్యానికి తిరిగి రాగానే ప్రద్యుమ్నుడి వీపుమీద ఫెళ్లున ఒక్క చఱుపు చరిచి "ఏం, బాగున్నావా ?" అన్నాడు. మిత్రులిద్దరూ గాఢాలింగనం చేసుకున్నారు. "ఏమిటి, ఇంత చిక్కిపోయావేం ? తినటానికి ఏమీ దొరకలేదా యేమిటి ?" అని చనువుగా అనేసి, నాలుక కరుచుకుని తప్పు దిద్దుకుని "జై మఘవమహారాజా! తమరు క్షేమంగా వున్నారా?" అని సేనాపతి ప్రద్యుమ్నుడు అడిగాడు. మఘవుడు గర్వంగా "కోదండులందరినీ చితక కొట్టి వచ్చాను. అంతే కాదు. నేనొక వింతవస్తువు తీసుకువచ్చాను. రా, చూద్దువుగాని" అన్నాడు.

కోదండులదగ్గరనుంచి కొల్లగొట్టుకొనివచ్చిన వింతవింతవస్తువులన్నిటినీ సైనికులు పారా కాస్తున్నారు మఘవుడు, తిన్నగా రాజసౌధం వేపుకి నడిచాడు. వెంటవస్తున్న ప్రద్యుమ్నుణ్ని చూసి "ఏమిటి రాజ్యంలో విశేషాలు ? ప్రజలంతా బాగున్నారా ?" అని అడిగాడు. ఈమధ్య వాళ్ల ఆనందం అతిశయించింది." అన్నాడు ప్రద్యుమ్నుడు.


"ఏం, ఏమిటి విశేషం ?"

"ఏం లేదు. ఈమధ్యన ఆర్యవీరులందరిలోనూ ప్రేమ అనే కొత్త అనుభవం తలయెత్తింది. అనార్యబాలికలని ఎత్తుకొచ్చి మన వీరులు పెళ్లిచేసుకుంటున్నారు"


మఘవుడు పకపకా నవ్వుతూ "ఓ హో! అల్లాగా, ఇదొక అంటువ్యాధిలాగా వుందే!" అన్నాడు. ప్రద్యుమ్నుడికి అర్థంకాక మఘవుడి ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

మఘవుడు "ఇంకో దారి లేదు. ఈ దూరదేశంలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నాక మన ఆర్యరక్తం పరిశుద్ధంగా వుండాలంటే ఎల్లా

(18 వ పేజీ చూడుడు)




డిపోలో శిక్షణ నందేవారు, అడవులలో క్యాంపు శిక్షణ కూడా పొందుతారు. ఇల్లా నాల్గు వారాల పాటు శిక్షణ పొందేందుకు అడివిలో క్యాంపుకు విద్యార్థులు వెళ్తూన్న దృశ్యం.



ఈ శిక్షణలో అనేక అవాంతరాలున్న మా
పెద్ద బండలెక్కి పోవలసివస్తుంది. అందు
అనే పోటీ పరుగు పం

(జళహళ్లి కేంద్రంలోని 'డిపో' కార్యకలాపాలు)

రాయల్ ఇండియన్



వైమానిక దళాలలోకి వివిధజీవితరంగాలలో నుంచివచ్చిన యువకులు తరిఫీదు పొందేందుకు సిద్ధంగా ఉన్నారు.




జలహళ్ళి కేంద్రానికి పండిట్ నెహ్రూవచ్చినప్పుడు శిక్షణాపద్ధతులను, అక్కడి విద్యార్థులను చాలా అభినందించారు.




క్యాంపులో వైమానికుల విద్యార్థులకు శిక్షణ ఇస్తూన్న దృశ్యం.



"హరికేన్" ఫైటర్ విమాన ఇ
విద్యార్థు



లలో, చెట్లెక్కి, పుట్టలెక్కి అడ్డువచ్చిన పెద్ద ఇల్లాంటి నిర్మాణాలతో "అబ్‌స్టకుల్ రేస్"లు పెట్టి శిక్షణ ఇస్తున్నారు.



★

వైమానిక దళంలో చేరేందుకు, కసరతు మరిగిన దేహాలు ఉండాలి. కాంపులో శిక్షణ పొందుతున్న విద్యార్థులు చేస్తున్న కవాతు ప్రదర్శనాలు.

★

వైమానిక దళం





వైమానిక శిక్షణ పొందుతున్న సైనికులకు వైద్యసహాయం మొదలైనవన్నీ డిపోవారు చూస్తారు. డిపో వైద్యశాలలో ప్రథమచికిత్స లందుకుంటూన్న విద్యార్థి.




యంత్ర విశేషాల నన్నిటినీ సైనిక లు బోధిస్తున్న దృశ్యం.

★

అడివి జీవితంలో కావలసిన శిక్షణను పొందుతున్న విద్యార్థులను సర్. థామస్ ఎల్మ్‌హర్స్టు తదితర ఉద్యోగులు పరీక్షిస్తున్నారు.

★





సుషుప్త సుందరి

మూలం : **ఫేవొరిట్ ఫైరీటేల్సు**

అనువాదం : **శ్రీ గుండెపూడి శ్రీరామమూర్తి**

పూర్వ మెూ పట్నంలో వొండొరుల నతిగా ప్రేమించుకొనే వకరాజు వకరాణీ వుండేవారు. పిల్లలేరను కొదవొక్కటే వారి సంతోషాని కాటంకము. అందుకని చాలాయేండ్లు గడచాక ఒక చక్కని స్త్రీరత్నము యిరువురికి జన్మించగా వారి సంతోషానికంతనేది లేకపోయింది. తుమ్మెదరెక్కల్లా నల్లని నయనాలతోనూ అందమయిన శరీరంతోనూ బిడ్డ చూచువారికానందము కలుగచేస్తుండేది. రాజు రాణి స్త్రీరత్న ముద్భవించినను సంతోషముతో గొప్ప విందేర్పాటుచేసి బీదలకందరికి ధర్మం చేయటాన్కి చాలాధనము వెచ్చించుట కాజ్ఞాపించారు. బిడ్డసుఖము కోరు తలిదండ్రు లిరువురు దేశములోనున్నట్టి దేవతలందర్నీ ప్రతిదేవతా వరము తప్పక తమ పుత్రికకు ప్రసాదిస్తుందను వుద్దేశముతో విందుకూ జ్ఞానస్నాన మొనరించుటకూ ఆహ్వానించారు. అలా పిల్చుట పూర్వకాలంలో వో ఆచారముగా వుండేది.

విందు కాహ్వానించుటలో వక పొరబాటు జరిగింది. మంత్రకత్తెలా పరిగణించబడే అసహ్యస్వభావము గల వక మునలిదేవతను మాత్రము మరచిపోయి ఎవ్వరూ పిలవలేదు. ఇతరదేశాల్లో సంచరిస్తుంటంవల్ల తిరిగి వచ్చిందని తెలుసుకోలేక రాజమంత్రికూడా క్షేమం చేకూర్చేలా ఆమెకో ఆహ్వానపత్రాన్ని పంపలేకపోయాడు.

జ్ఞానస్నాన మయాక అతిధులందరొక విశాలమైన ఆవరణలోకి రుచికరమగు విందుకొరకు గొంపోబడ్డారు. రాజు రాణి వచ్చిన అతిధులందర్నీ సత్కరించుట కన్ని విధాలా ప్రయత్నించి అతిధులైన యేడుగురు దేవతల్లో ప్రతివక్కరికి తినుబండారాలారగించుట కో పసిడిపళ్ళెరమూ వజ్రవైడూర్యాలు పొదుపబడిన వక కత్తి మరొకి చెంచా గౌరవార్థ మివ్వబడినవి. కొద్దిసేపే అయింది విందుప్రారంభించి. / యింతలో మంత్రకత్తయిన మునలిదేవ తొచ్చి తనకూ్కడా మిగత దేవతల్లో స్థల మేర్పరుప మని గొణిగింది. అడుగుటే తడవుగా వెంటనే అలా జరుపబడింది. మునలిదేవత తన స్థలంల్లో కూర్చుంది కానీ ఆమె నెవరూ పిలువకపోవుటచేతా విందు[illegible]చ్చు నని ముందుగా యెవరూ అనుకొనకపోవుట చేతా బంగారుపళ్ళెరముకాని మణిఖచితమైన కత్తికాని చెంచాకానీ సిద్ధము చేయలేకపొయ్యారు. పదార్థాలన్నీ తనకూ్కడా వడ్డించాక తన కిచ్చిన వస్తువులు మిగత దేవతల కిచ్చినవానిలా అందముగనూ విలువయినవిగనూ లేవని తెలిసికొని ఆ మునలిదేవత కోపగించినదై కసి దీర్చుకోవాలని తనలో గొణగడం ప్రారంభించింది.



అదృష్టవశాత్తీ క్రూరచూపు లాం దేవతల్లో మునలిదేవతగుణగణాన్ని తెలిసికొన్న వో దేవత కనుగొని యేమీ తెలియని పసిబిడ్డపై వాక్కులతో దుష్ప్రయోగ మేదో మునలి వపిష్ఠిదేవత తప్పనిసరిగా చేస్తుందని తలచింది. అందుకని విందయాక మంచిదేవత మిగత దేవతలు తమ వరాల్నీ పసిబిడ్డకొసగాక మునలిదేవతేమైనా కీడు కలిగించిన దాన్ని కాస్తా తొలగించుటకై అలంకారంకొరకు వ్రేలాడగట్టబడిన పట్టుజలతారువెనక దాక్కొంది.

అక్కడామె దాగివుండి పసిబిడ్డగురించి మిగత దేవతల పొగడ్త వినుచుండెను. దేవతల్లో వకరు పసిబిడ్డ నేత్రాల్ని కొనియాడారు. మరొకరు బలిష్ఠమై లేతకుల్లా సున్నితంగా వున్న చేతుల్ని పొగడారు. యింకొకరు నల్లగ నిగనిగలాడ్తున్న కురుల్నిచూచి సంతోషించారు. యింతసేపూ తనలో తానేమో గొణుక్కుంటూ మంత్రకత్తయిన మునలిదేవత విడిగా ఎచ్చటో నిలబడింది. సమయ మొచ్చాక ప్రతిదేవత ముందుకు నడచి తమకుతోచిన వరాల్నీ, శుభాశీస్సులనూ యిచ్చారు చిన్ని రాచబిడ్డకు. మొట్ట మొదటి దేవత పసిబిడ్డకు అందాన్నిచ్చింది. రెండవదేవత తెలివితేటల్నిచ్చేలా వాగ్దానాన్ని చేసింది. మూడవదేవత మృదుస్వభావాన్నీ యిలా ఒక్కొక్క దేవ తొక్కొక్క మంచిగుణాన్ని పసిడ్డకు ప్రసాదించింది. యిప్పుడు క్రూరమునలిదేవత మాత్రమే వరాన్నివ్వాల్సింది. ఆవరణమధ్య కెళ్ళి చేతులు రెండు చాచి తల వణకిస్తూ మునలిమంత్రకత్తె 'నూలువడికెడి కదురును వేల్లో గుచ్చుకొని గాయమున్నచనిపోవడమే యీ రాచబిడ్డకు నేనిచ్చే వర' మని బిగ్గరగా అరచింది.

విన్నవా రందరు ఆశ్చర్యముతోనూ భయముతోనూ నిశ్చేష్టులై తడబడేమయినా అలా అందేమోని మునలిదేవతను తీక్ష్ణంగా చూడ మొదలెట్టారు. సరిగా వినలేదేమోని చేతులు చాచి రాచబిడ్డని చూపుతూ మరొకసారి తన వరాన్ని వుచ్చరించిందా మునలి మంత్రకత్తె. తరువాతో వికటాట్టహాసంతోనూ తీక్ష్ణమైనదృష్టితోనూ వదలేసిందా స్థలాన్ని.

సింహాసనాన్నధిష్ఠించిన రాజునుండి తలుపుసందుగుండ తొంగిచూస్తున్న పల్లెకారివరకూ దుఃఖపడనివారు లేరు. రాజుగారి ఆస్థానహాస్యగాడు గూడా రాచబిడ్డకు ముందున్న దుర్గతి తెల్సుకొని దుఃఖపడ్డాడు. యీ సమయంలో అలంకారముకొరకు వ్రేలాడ కట్టబడిన పట్టుజలతారువెనుక దాగివున్న మంచిదేవత యింటిలో, అడుగుపెట్టి నెమ్మదిగా యిలా చెప్పింది.

'స్నేహితులారా! దుఃఖపడకండి. మీరనుకొన్నంత కీడు జరుగదు. మునలిమంత్రకత్తె యీర్ష్యచేతా దుస్స్వభావమువలన అలా పల్కింది. పూర్తిగా శాపాన్ని తీసివేయలేకపోయినా నేను కొంతవర కా శాపాన్ని తొలగిస్తాను. మీ బిడ్డ నిజముగానే నూలువడికెడి కదుర్ని వేల్లో గుచ్చుకొంటుంది కానీ ఆ గాయముచే తామె చనిపోదు. ఒక గాఢనిద్రలో మునిగిపోతుంది. తన చుట్టూ వున్న ప్రతిదానికీ వక నూరేండ్లదాక ప్రాణము లేని దానిలానే వుంటుందికానీ నిర్ణీతకాలానికి నిర్ణయింపబడిన వ్యక్తి ఆమెను లేపుతాడు, అని రాణిరాజులతో చెప్పి తోడిదేవతల్తో కూడా అందర్నీ దుఃఖంలో ముంచి అంతర్ధాన మయిందా మంచిదేవత.

క్రమక్రమంగా రాచబిడ్డ పెరిగి పెద్ద దవసాగింది. రోజురోజుకు అందముగా తెలివిగా వక టేమిటి! ప్రతివారియందూ దయ గల్గి సాధుప్రవర్తనతో వుంటంవల్ల ప్రతివారామెను కొనియాడేవారే. యింటిదాసీలకూ పరిచారికలకూ ఆమంటే కష్టమే లేదు. యింట్లో నివసించు ప్రతివార్నీ చూచినా మొరిగే యింటి కుక్క కూడా తోక వూపుతూ మెడలో పూలదండల్ని పెట్టనిస్తుంది. రాచబిడ్డ ఎంత యెక్కువగా కుక[illegible] చెవులు లాగితే అదంతగా సం[illegible].

మునలిమంత్రకత్తె చె[illegible] మరువక రాజుగారు కోటలోని నూలువడుకు కదుర్లన్నింటినీ నాశనము చేయించి సామంతులనూ సేవకులనూ వకదాన్నుపయోగించినా శిరచ్ఛేదమవునని ఆజ్ఞాపించాడుకానీ యీ జాగ్రతంతా యెందు క్కొరగాదని కొద్దిలోనే తెలుస్తుందిగదా!

రాచకుమార్తెకు పదిహేనవయేడు రాగా వకరోజు రాజుగారు మహారాణీ, కుమార్తె పుట్టిన మొదటిసారిగా భవనాన్నొది లెచ్చటకో పొయ్యారు. రాచబిడ్డొక్కతే యింట్లో వదలివేయబ[illegible] కాల మెలా వెళ్ళబుచ్చాలో తెలియ[illegible]స్తకాల్తోటీ సంగీతంతోటీ విసిగి [illegible]తా తిరగతల్చింది. కోటలో చాలా పురాతనమయిన గోపురాన్నిచూచి [illegible]దుమ్ముతో గూడిన అంతస్థులన్నీ యెక్కి పై అంతస్థులోని వక గది చేరింది. మెల్లగా తలుపు తెరచి పురాతనమైన పీటపై కూర్చొని గమ్మత్తయిన స్వరంతో పాటేదో గొణుగుతూ పంటెకోలతోనూ (నూలుచుట్టెడికొయ్య) కదురుతోనూ నూలువడకుతున్న ముసలవ్వను చూచి ఆశ్చర్యపోయిందా రాచసుందరి. ఆ బీదముసలవ్వ నేకసంవత్సరాలనుండా గదిలో నివసించుట కంగీకరింపబడుటచే యెప్పుడు గది వదలక నివసిస్తుంది. రాజగృహపు వంటగదికి మిగిలిన పదార్థాలు తెచ్చుకొంటాన్కి మాత్రం ముసలవ్వ గదివీడి పోతుంది. అందుకనీ అదీగాక చెవు డెక్కువగా వుంటంచేత రాజాజ్ఞ వినని ముసలవ్వ తను చేసేది రాజాజ్ఞకు వ్యతిరేక మని కలనైనా తల్చింది కాదు.

'అవ్వా! యేం చేస్తున్నా వంది రాచసుందరి.

'అందగత్తా! నూలువడకుతున్నా నం' దా ముసలవ్వ రాకుమార్తె ప్రశ్నార్థం చేసుకొన్నాక.

'అవ్వా యెంత బాగుందీ! నేను కూడా వడకాలని వుంది. వకమారు నాక్కూడా యిస్తావా?' అంది రాచసుందరి.

తన్ను దర్శించవచ్చినామె రాకుమార్తెని తెల్సికోలేక ముసలవ్వ వెంటనే వప్పుకొంది రాకుమార్తె కోర్కెకు. నూలుచుట్టడి పంటుకోలను తీసుకొని యెన్నడు ముట్టకపోవుటచే మరుక్షణంలోనే వేలికి కదురు గుచ్చుకొంది. గాయాన్ని చూచి రాకుమార్తె చిన్న కేక వేసి దీర్ఘనిద్రలో మునిగిపోయింది. చాలా భయపడ్డ ముసలవ్వ సహాయంకొరకు ఎగ్గరగా అరవగా అంతఃపురస్త్రీలు యితర సేవకులు పరుగెత్తొచ్చారు. జరిగిన సంగతెల్సుకొని చాలా చింతిల్లారు. కొందరు రాకుమార్తెముఖంపై చల్లని నీరు చల్లారు. చేతులు రుద్దుతూ శాంతేర్పరుపదలచారు మరికొందరు. యింకొందరు సెంట్లతో కనుబొమలు తడి చేశారు. కాని యివన్నీ వృధఅయిపోయాయి. రాచకుమార్తె చచ్చిన దేవతలా అందాలన్నీ వొలకబోస్తూ పెదవుల్లోనూ బుగ్గల్లోనూ యెరుపుందనము కన్పరుస్తూ మరణం లాంటి నిద్రలో మునిగి కళ్ళు మూసుక పడుకుంది.

మహారాణీరాజులు యిల్లు చేరి వోగ్పుతప్ప మరి వేరుమార్గమువల్ల ప్రయోజనం లేదని తెలిసికొన్నారు. క్రూర ముసలి దేవత శాపముఫలించింది. కానీ యింతలో వాండ్లు నిస్పృహ చెందలా మంచిదేవత మాటలుకూడా గుర్తున్న రాజురాణీలు. తిరిగి కుమార్తెను చూడలేకపోయినా తమ కుమార్తె పూర్తిగా చనిపోలేదుగదాని ఘొరడిల్లారు.

కుమార్తెను అందమైన పరుపుపరువబడ్డ మంచంపై పరుండబెట్టమని రాజాజ్ఞాపించాడు. పరుపు లేసుతోనూ పట్టుతోనూ కప్పబడి రాజభవనములోని అందమయిన గదిలో రాకుమార్తెను పరుండబెట్టారు. ఆ గదిచుట్టూ పగలు రాత్రులు కాపలా వుండమని సేవకుల నాజ్ఞాపించాడు రాజు. అమితంగా దుఃఖిస్తూ రాజభవనంలో వుండలేక రాజుగారున్నూ మహారాణీ రాజ్యానికో దూరప్రదేశాన్ని చేరుకున్నారు.

దూరప్రదేశంలో వున్న మంచిదేవతి వృత్తాంతం విని రాజభవనానికి దేవనాగుపాములచే లాగబడు రథములో బయలుదేరి యితరులకంట పడకండా కన్పడిన ప్రతివస్తువును తన చేతి దండముతో తాకుతూ భవనము ప్రవేశించింది. వెంటనే తను ముట్టుకున్న ప్రతి జీవమున్న వస్తువూ దీర్ఘనిద్రలో మునిగిపోయింది. అంతఃపురస్త్రీలు పరిచారకజనము అధికారులు వంటవాండ్లు పల్లెకాపులు రక్షకభటులు నౌకరులు గుర్రపుశాలలోని గుర్రాలు మంటముందున్న పిల్లులూ అన్నీ వక్కసారిగా నిద్రపోయ్యాయి. ఆశ్చర్యమేమంటే తాము చేసేపనే పూర్తిచేయు వ్యవధి లేక అందరూ వక్కసారిగా నిద్రపోయ్యారు. రాకుమార్తె చిన్నకుక్కకూడా మూడుకాళ్ళమీదే నిల్చిపోయింది. మరి కొద్దిరోజులకో పెద్దపొద రాజభవనముచుట్టు పెరిగింది. ఒక చెట్టు మరొకచెట్టుకు పెనవేసుకొని జంతువుకునూ మానవునకూ గోడలా అడ్డు తగులుతూ పెరిగిందో పెద్దపొద కొద్దిరోజులకే.

నూరువత్సరాలనగా చాలా పెద్దకాలము. రోజులు గడిచేకొద్ది అనేకం జరుగుతుంటయ్. రాజుగారు మహారాణి యిద్దరూ చనిపోయ్యారు. పిల్లలెవరూ లేకపోవుటచే రాచకుటుంబంలోని మరొకరికి పోయింగీ సింహాసనము. వత్సరాలు గడుస్తుండగా యీ కోట వున్నసంగతే మరచిపోయ్యారందరూ. కానీ అప్పుడప్పుడు ముసలివారు మాత్రం తమ పిల్లలకు రాజుగారి విందుగురించి అందమైన రాచసుందరిని గూర్చి ఆమె చనిపోయిన విధాన్ని గూర్చి యెక్కడ పడుకొనివున్నదో తెలియకపోయినప్పటికీ బంగారు వెండితో చేయబడిన పక్కపై ఆశ్చర్యకరమైన కోటలో ఆ అడవిలోనే యెచ్చటో వుందని చెప్తుండేవారు.

చిట్టచివరకో శతాబ్దం గడిచింది. అప్పుడా దేశాన్ని పాలించే రాకుమారుడు అడవిలో వేటాడుతూ మామూలుగాకన్నా యింకొద్దిగా లోపలికి ప్రవేశించాడు. అప్పుడాతనికో కోటచిహ్నాలు కానొచ్చాయి. అందుకని సేవకుల చుట్టుపట్ల ఆ కోటసంగతి తెల్సికొనమ పంపాడు. కానీ కోటసంగతి తెలియకో తెలిసినా యిష్టపడకనో యెవ్వరు తెలియజేయలా. కానీ చిట్టచివరకో చాలా ముసలి వ్యవసాయదారుడు జరిగిన కథంతా చెప్పి తను చిన్నతనంలో వుండగా తన తండ్రి తనకు చెప్పాడని తెలియజేశాడు. యిప్పటికో నూరువత్సరాలు గడిచినట్లే తలుస్తానని గూడా చెప్పాడు. ఆ వ్యవసాయదారుని మాటలు రాకుమారుని దీర్ఘాలోచనానిమగ్నుని కానిచ్చాయి. ఆ రాత్రి నిద్రించి మరునాడు తన అదృష్టాన్ని చూచుకోదలచాడు.

ఉదయాన్నే రాకుమారు డొంటరిగా అడవికి బయలుదేరాడు. అడవిని ప్రవేశించాక గుర్రాన్ని దిగి బాగా పెరిగిన పొదలో దారి కోయటానికి కత్తి దూశాడు. ఆశ్చర్యాన్ని చేకూర్చేలా దారిచ్చిందా ముళ్ళపొద తను పోవుకొద్ది. తనవెనుక దారి లేకండా మూసుకొస్తున్నప్పటికి రాకుమారుడు ధైర్యంగా కోట చేరుకున్నాడు. అక్కడో గుంపు సంగీతవిద్వాంసులు పాడ్తుండగా రాజాంతఃపురపు హాస్యగాడు వింటూ అందరూ దీర్ఘనిద్రలో మునిగివున్నట్లు చూచాడు రాకుమారుడు. పాడ్తున్న సంగీతవిద్వాంసుడు తెరిచిన నోరు మూసుకొనుటకూడా వ్యవధి లేక నిద్రించ మొదలెట్టాడు. ముఖ్యద్వారంగుండా పోగా కొద్దిలో పల రాకుమారుడో నేటగాండ్లజట్టును చూచాడు. కొంతమంది యింకనూ జీనులోనే నిద్రపోతూ మరికొందరు నిలబడే నిదురిస్తుంటం చూచాడు. ఆ మృత్యుతుల్యమైన నిశ్శబ్దము రాకుమారు నమితంగా ఆశ్చర్యపరచింది.

తరువాతో నౌకరుగది చేరుకున్నాడు రాకుమారుడు. తన అధిపతి యొక్క వకగ్లాసు సారా తాగుతూ అలాగే నిద్రిస్తున్నాడా నౌకరు. పనిచేసేవారందరూ ఆవరణలో నిద్రిస్తుంటం రాకుమారుడు చూచాడు. యింతకుమును పెన్నడే రాజభవనంలోనూ పనివారితోకూడా యింత నిదురమత్తుగా వుండలేదే కోటయినా. మహారాణిగారి ప్రియమైన పిల్లి వకశతాబ్దపూర్వమునుండి నేలపై ముక్కుపెట్టి యెలుకనో దాన్ని వాసనపట్టి నూరువత్సరాలనుండీ అలాగే యెలుక్కొర క్కొచుక్కుచుంది. పొడవైన వో మార్గం చివరమెట్లను చూచాడు రాకుమారుడు. చిట్టచివర పట్టుతోనూ లేసుతోనూ వున్న గదిముందు ఆయుధపాణులై అనేకమంది సైనికులు పారా చేస్తుంటంచే అదో ముఖ్యమయిన గదని తలచాడు రాకుమారుడు. కాని అందరూ నిద్రిస్తున్నవారే. వాళ్ళందర్నీ దాటాక రాకుమారుడు తెరతొలగించి గదిమధ్యన విలువైన పరుపుతో మంచంపై పరుండియున్న రాకుమార్తెను చూచాడు. ఆకులతో అమర్చబడిన పక్కపై పరుండి గులాబిమొగ్గలా వుంది. వో గంటముందుమాత్రమే నిద్రించినదానిలా కన్పడిందా రాచసుందరి.

రాకుమారుని ఆశ్చర్యానికి మేర లేకపోయింది. రాకుమార్తెపై వంగుతూ దీర్ఘంగానూ అతిత్వరితంగానూ చూచి యెంత త్వరితంగా యెంత దీర్ఘంగా చూస్తే అంత సంతోషించాడు రాకుమారుడు. సాధారణమానవులు చేయునట్లే చేశాడు తనూ. అంటే ఆమెను ముద్దుపెట్టుకున్నాడు! యింతలోనే కోటంతటిలోనూ పెద్దచలన మేర్పడింది. ఒక నిట్టూర్పుతో స్త్రీలూ పురుషులూ పిల్లలూ జంతువులూ అన్నీ వక్కసారి నిద్ర మేల్కాంచినయ్. రాకుమార్తెగదవతల సైనికులు రాజభటులు ఆయుధాల్ని ధరిస్తున్న పెద్దశబ్దము వినబడింది. సారా తాగుతున్న నౌకరు తాగటం పూర్తిచేశాడు. ఎలుకను పట్టుటకు ప్రయత్నించిన పిల్లి తన పనికి తిరిగి పోమొదలెట్టింది; యిలాగే కోటలో ఎవరిపనికి వారు పొయ్యారు.

రాకుమార్తె రాకుమారునితో ఏమి మాట్లాడిందో ఎవరికి తెలియదుకానీ కన్నియ కోరునట్టి పురుషునికన్న రాకుమారుడుండగా డవటంమూలాన పూర్వమో నూరువత్సరాలనుండీ జరగనట్టి గొప్ప వివాహము జరిగింది వారిరువురికి.

మరెన్నడు రాకుమార రాకుమార్తెలు పల్లెత్తుమాట లేక సుఖంగా కాలక్షేపము చేస్తున్నారుకనుక వార్నిగురించి యింకను దేవత లతిజాగ్రతతో మెలగుతూ మరే అపాయమూ సంభవించకండా చూస్తున్నారని తప్పక తలుస్తుంటా రందరు.

బాలగేయాలు :

బొమ్మరిల్లు

శ్రీ యస్. వి. జోగారావు

బడి విడచునంత నింటికి పరుగులెత్తి
పలకబలపాలు గూటిలో పదిలపఱచి
అమ్మ యిచ్చిన పప్పు బెల్లమ్ము దినుచు
నాడుకొనబోదు నీవు సాయంతనమున.

ఊరిదాపల నొక సెలయేఱు గలదు
కల విసుకపనకలు దాని గట్టుమీద
ఇచ్చవచ్చిన మచ్చున నీ వచటను
ఈడుజోడైనవారితో నాడుకొనుము.

గట్టుమీదనె యెంతైన గంతుగాని
లో తెలియంగని నీళ్ల గాలూనబోకు-
పెంకిపిల్లలు పేచీలుపెట్టునపుడు
మంచి వస్తాదు నేస్తాల మఱువుబోవుము.

అలతివాడవు; 'చెడుగుడు' లాడలేవు
నేల విడిచిన సాము నీ కేల? వినుము
చెంత సెలయేటి చెలమలో చెమ్మగిల్లు
యిసుకతో నాడుకో బొమరిండ్లు గట్టి.

ఇరుగుపొరుగుల బొమరిండ్లమరుచు కొన్న
చెలులతో బొమ్మపెండ్లిండ్లు సేయునపుడు
తరలివచ్చును పుల్లుము తైదువలును
గూళ్లు విడిచి మీ గుజ్జనగూళ్లదరికి.

బళిర! బొమ్మరిండ్లాటపాటలను గడచు
చీకుచింత లెఱుగని నీ చిన్నతనము;
పెరిగి పెండ్లముతోడి కాపురము సేయ,
గలదు నీ పనిబట్టు నిక్కంపుటిల్లు.

వైరాగ్యము

శ్రీమతి గొల్లపూడి శారదాదేవి

ఒక వూళ్లో ఒక కాపు కుటుంబం ఉండేది. ఆ యింట్లో అందరు వైరాగ్యానికి పేరుపొందినవాళ్ళు. ఒకనాడు త్రిమూర్తులు వాళ్ళ వైరాగ్యాన్ని పరిక్షించవలయు నని వచ్చారు. కాపు పొలంలో బ్రహ్మదేవుడు ఒక పుట్ట అయినాడు; శివుడు నాగుపాము అయి అందులో చేరుకొన్నాడు. విష్ణువు ముసలి బ్రాహ్మణుడై ఆ పుట్టదగ్గరగా నిలుచుకున్నాడు.

కాపు, కాపుకొడుకు తెల్లవారే లేచి నాగళ్లు కట్టుకొని పోయి ఆ పొలంలో దున్నుతూ, పుట్టదగ్గఱికి రాగానే పుట్టలో ఉన్న పాము బయటికి



వచ్చి కొడుకును కాటు వేసింది. అంత వాడు మరణించాడు. తండ్రి చచ్చి పడియున్న కొడుకును జూచి కాళ్లు పట్టి యీడ్చి ఆవల పారవేసి దున్నుకుంటూ పోయినాడు. అక్కడున్న బాపడువాడి దగ్గరకు వచ్చి అయ్యో! చేతికందిన కొడుకే! పామువాత పడి చచ్చెనే! నీ కీ వయసులో ఎంత దుఃఖము వచ్చిందోయ్! అని ఓదార్పుమాటలు చెప్పినాడు. వాడు ఆయనను చూచి చిరునవ్వు నవ్వి "వెఱ్ఱితండ్రీ, దీనికి యింత విచార మెందులకు? ఋణ మున్నంత వరకు బతికివుండి, తీరగానే తనదోవను తాను పోయినాడు. ఈ మాత్రానికి చింత ఎందులకు?" అని దున్నుకుంటూ ఉండినాడు.

వీడితో లాభం లే దనుకొని ముసలాయన వాని పెండ్లాముదగ్గరికి పోయి, జాలి పుట్టేటట్టుగా కొడుకుచావును వినిపించినాడు.

అది విని ఆమె ఒక నిట్టూర్పు విడిచి "ఏమో నాయనా ఇది మాయలోకం. అయ్యా, కుమ్మరవాడు కుండలు చేయునపుడు పగలిపోయిన కుండలను పారవేయగా అవి మట్టిలో కలసిపోతున్నవికదా? ఇదికూడ అంతే కాదూ! దీని కెందుకు విచారము?" అని చెప్పి తల్లి ఏదో పని చేయుటకు వెళ్ళిపోయింది.

'ఆ మొగుడికి తగిన పెండ్లామేరా' అని ఆశ్చర్యపడుతూ, చచ్చినవాడి భార్య వున్నచోటికి వెళ్లి మొగుడి చావును, గుండె బ్రద్దలయ్యేటట్లుగా తెలిపినాడు, ఆ బ్రాహ్మణుడు.

ఇక ఆమె అన్నదికదా, "అయ్యా ఇదొక పెద్దసంగతిగా చెప్పినన్నోదారుస్తున్నావు! కాలప్రవాహములో రెండు జీవులు కలుస్తూఉంటవి, భార్యాభర్తలుగా; మళ్ళీ విడిపోతూ వుంటవి. అక్కడనుండి ఎవరి దారి వారిదే దీనికా నేను దుఃఖించవలసినది" అని నిర్విచారముగా ఉండిపోయింది. ఆ బాపడు అక్కడనుండి ఆమెతమ్ముని దగ్గరకు వెళ్లి చెప్పినాడు. వాడయినా దుఃఖించడా అనుకొన్నాడు. వాడాయనను చూచి "స్వామీ, గొప్ప వీరులయిన కృష్ణార్జునులు కంటికి రెప్పలవలె కాచియున్న అభిమన్యుడికి చావక తప్పిందా? ఇంక మా బావమాటెందులకు?" అని నిర్లక్ష్యముగా మాట్లాడినాడు.

మాయబాపడు వీరందరి వైరాగ్యానికి నివ్వెరపోయినాడు. కుటుంబములో అందరిని పరిక్షించడము అయింది. తన పట్టునెగ్గిందిగాదు. ఇంకపనికత్తె ఒక్కతె మిగిలింది. దాన్నయినా లొంగదీయక పోతానా అనుకున్నాడు. పాపం దాని దగ్గరికి వెళ్లినాడు. చావుసంగతి చెప్పి 'నీకు ముందుదిక్కు లేకపోయిరికదా' అని తానుకూడా ఏడిచాడు. 'నీవు చాల ముసలాయనవు. లోకస్వభావము ఎరగకపోవడం చాలా వింతగా ఉంది. చూడు. పక్షులు ఆశ్రయమయిన చెట్టు లేకపోయినపుడు ఇంకొక చెట్టును చూచుకోవడములేదా? నారు పోసిన వాడు నీరు పొయ్యకపోతాడా? ఎందుకు నాకు విచారం' అని జవాబు చెప్పింది.

అప్పుడు త్రిమూర్తులు వీరి వైరాగ్యానికి చాలా మెచ్చుకొని వారి కందరికి ప్రత్యక్షమయి, చచ్చినవానిని బ్రతికించారు. 'ఇంక యిక్కడ వీళ్లను వుండనిచ్చామంటే వైకుంఠము కుక్కలదొడ్డి అయిపోతుందని వాళ్లకు మోక్షం ప్రసాదించారు. వెంటనే దివ్యవిమానాలు వచ్చినవి. వాళ్లందరు వాటినెక్కి వైకుంఠం చేరుకొన్నారు. కథ కంచికి వెళ్లింది, మనం ఇంటికి చేరుకున్నాము.

యుక్తికి ప్రతియుక్తి

శ్రీ సీతారామారావు

అనగాఅనగా ఒక ఊళ్లో కోటయ్య అనే మోసగాడు ఉండేవాడు. వాడు యెంత మోసగాడు అంటే ఆ వూళ్ళో ఒకసారి మోసపోయినవాళ్ళు కూడ మళ్ళీ మళ్ళీ మోసపోయేవారు. వాడికి ఒకరోజున ప్రొద్దునే లేవగానే మొట్టమొదట పిల్లి ప్రత్యక్షమయింది. ఇదేంటిరా భగవంతుడా, కొంపతీసి నాకు ఎవడు టోపీ వేయడుకదా అనుకొన్నాడు. ఈ అపశకునం యేంటని పిల్లిని నాలుగు తిట్టి, ముఖం కడుక్కుందామని నూతిదగ్గరకి వెళ్ళేడు. పాపం. నాచుమీద కాలు వేసేడో యేంటో కర్మం దభీమని బురదలో పడ్డాడు. ప్రొద్దున్నే యేంటిరా ఈ కర్మం అనుకొన్నాడు.

ఆరోజున, ఇంట్లో ఆ పూటకే అన్నానికి అఖాకుబియ్యం లేక యెవడికి టోపీవేద్దామా అని ఆలోచిస్తున్నాడు. యేం చేయడానికి తోచడంలేదు. పోనీ యెవడినేనా అప్పు అడుగుదామా అనుకొన్నాడు. 'దేహి' అనడానికి ఇష్టం లేక 'ఛీ ఛీ' అని చీదరించుకొన్నాడు. అయినా వాళ్లు లేదంటే అవమానానికి అంతు వుందా? ఆలోచిస్తున్నాడు, ఆలోచిస్తున్నాడు. వెధవఆలోచన అంతూ పొంతూ లేని ఆలోచనలాగుంది. యెప్పటికి తెమలటంలేదు. పచార్లు చేస్తూ వీధిలోకి చూసేసరికి వీధిలో వకీలు తమ్మయ్య అవుపించేడు. పేరుబడ్డ వకీలు. మర్యాదస్థుడు, మంచి వాడు. అంతకంటె యేం కావాలి? అన్నిటికన్నా అతనిదగ్గరున్న సుగుణమేమంటే ఎవడిదగ్గర యెలా ఉండాలో అలా వుంటాడు. ఐతే మాత్రం కోటయ్యకంటె యేం తక్కువవాడు కాదు! యెంతటివాడయినా ఇతన్ని మాత్రం టోపీ వెయ్యలేడు.

అతన్ని చూడగానే కోటయ్య మెదడులో మెఱుపులాంటి ఆలోచన ఒకటి మెరిసింది. వెంటనే వకీలు తమ్మయ్యను కేకవేసేడు. అతను వస్తూనే, "యేమండోయ్......" అని పల్కరించేడు. "యేం విశేషాలు లేవండి" అని అటు యిటూ పైకి తెలియకుండా తటపటాయిస్తూ సమాధానాలు చెప్తున్నాడు. అల్లీ బిల్లీ కబుర్లు చెప్పడంలో ఆరితేరిన కోటయ్య యేదో లోకాభిరామాయణం మొదలు పెట్టేడు. అతనితో మాట్లాడుతున్నాడే కాని ముందుముందు అసలువిషయం యేవిధంగా మొదలుపెట్టి యెలా సమాధానాలు చెప్పాలో ఊహాగానం చేసుకొంటున్నాడు. "ఐతే నాకో చిన్న సందేహం వుంది తీరుస్తారా?" అని మెల్లిగా వకీలుతమ్మయ్యను కదిపేడు. "దాని కేముంది, తెలుస్తే దివ్యంగా చెప్తా" అని తమ్మయ్య సమాధానం చెప్పేడు.

"దాని దుంప తెగ, ఈ సందేహం యెందుకు వచ్చిందో నేనే మర్చిపోయేనండీ, ఒకడిదగ్గర రెండు పావురాలు వున్నాయి. వాటిని ఒక పెంపుడుకుక్క వచ్చి తినేసింది. ఐతే యిలాంటప్పుడు యేం చెయ్యాలంటారుఅంటే" అని అతి చమత్కృతిగా అడిగేడు. మొదటి వాక్యం అనవసరమని తెలిసికూడ తన ఉపాయంకోసం, ఆ వాక్యం చెప్పేడు.

"ఒస్స్, ఇంతేనటండీ బ్రహ్మాండం. యేమో అనుకొన్నా, కుక్క యెవళ్ళదయితే వాళ్లదగ్గర పావురాల ఖరీదు నష్టపరిహారంక్రింద వసూలుచెయ్యాలి. అంతే, అంటే సుమారు పావురం 5 రూపాయలు కాబట్టి 10 రూపాయలు అన్నమాట" అని అతని సందేహాన్ని నివారణచేస్తూ సమాధానం చెప్పేడు తమ్మయ్య. ఆ మాటలు వినేసరికి కోటయ్యకు అంతులేని ఆనందం వచ్చింది. పావురాలు తనవే నని, కుక్క తమ్మయ్యదే నని అబద్ధమాడి, అతనన్నట్టు పావురాలవెల 10 రూపాయలూ యిమ్మన్నాడు. ఆ మాటలు వినేసరికి వకీలుతమ్మయ్యకి మోసం తెలిసికోనేసరికి వకీలుతమ్మయ్యకు కోపం వచ్చింది. వచ్చిన కోపాన్ని దిగమింగుకొని జేబులోంచి పర్సు తీసి, 10 రూపాయలు లెక్కపెట్టాంటే కోటయ్యఆనందానికి పట్టపగ్గాలు లేవు. తమ్మయ్యే తన టోపీలో పడ్డాడుకదా అని ఉబ్బిదబ్బిబ్బయి ఊరంతయేడు. పాపం, మానవులు చేసేవన్ని దైవం అనుకూలంగా లేనిది ఫలించ దని విన లేదు కాబోలు.

నోట్లు లెక్కపెడ్తూ సగంలో ఆగి, "ఆ అన్నట్టు మీకు చెప్ప మరిచాను. నేను సాధారణంగా ఇలాంటి సలహాలు ఇచ్చినందుకు 20 రూపాయలు ఫీజు పుచ్చుకొంటాను. అందుచేత మీరే మిగిలిన పదీ సాయింత్రంలోపల ఇంటికి పంపెయ్యండి, నాకు చాలా పనులున్నాయి వెళ్లాలి." అని సమాధానం కోసమయినా యెదురుచూడకుండా తమ్మయ్య వెళ్తుంటే "టకటక" మనే బూట్లు చప్పుడు 'నేనేం తెలివితక్కువదద్దమ్మ ననుకున్నావా?' అని అంటూన్నట్టు అనిపించింది. యుద్ధంలో విజయం పొంది విజయగర్వంతో విజయసూచకంగా జయజయ ధ్వనులతో వాయించిన వాయిద్యాలు లాగను, తను ఓడిపోయి శత్రువుకి చిక్కిన అపజయశూరుడులాగ అనిపించింది.

మొహం పాలిపోయింది. కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

సినిమాపుట :

★ అమెరికన్ సినిమా ★ పూర్వోత్తరాలు

పూర్వం అమెరికన్ భౌతికశాస్త్రవిజ్ఞానవేత్త థామస్ ఎడిసన్ కినెటోస్కోప్ కనిపెట్టినప్పుడు, ప్రపంచంలో దాని ప్రభావం ఎంతగా వ్యాపించగలదో అతనికి తెలియదు. కినెటోస్కోప్‌నిర్మాణాన్ని పూర్తిచేసి ఎడిసన్ తన పరిశోధనాలయంలో ఒకమూల పడవేసి ఉంచాడు. రెండేళ్లతరవాత వ్యాపారదక్షుడొకడు దానిని తీసి దుమ్ము దులిపాడు. 1894 ఏప్రిల్‌లో న్యూయార్కునగరంలో దాని నుపయోగించి నగరవాసుల కొక అపూర్వ ప్రదర్శనం ఏర్పాటుచేశాడు. చిన్న చిన్న ఫిలిం చుట్లు ఉపయోగించి జానపదాలు ప్రదర్శించాడు. అయితే ఈ యంత్రంలో ఒక్కొక్కసారి ఒక్కొక్క ప్రేక్షకుడుచొప్పున చిన్న రంధ్రంగుండా చూడవలసివచ్చింది, అయినా నగరవాసులు అతిఆనందంతో ఈ విచిత్రప్రదర్శనాన్ని చూడ్డానికి విరగబడి వచ్చారు.

ఆతరవాత రెండేళ్లకి కినెటోస్కోప్ చలనచిత్రాన్ని మాజిక్‌లాంతరుఫక్కీపైన నడపడం ఆరంభించారు. అప్పుడు చిత్రాన్ని ఒక తెరపైకి ప్రసరింపచేసి ఒకేసారి ప్రేక్షకులందరికీ వినోద మివ్వడానికి వీలయింది. 1896 వ సంవత్సరంలో అమెరికాలోనూ, యూరప్‌లోనూ సినిమాయుగం ప్రారంభమయింది. మొట్టమొదట ఖాళీకొట్లల్ని సినిమాప్రదర్శన కుపయోగించారు. అప్పటికే సర్కస్‌లలోనూ, వినోదనాటకప్రదర్శనాలుగాక సభలు మొదలైనవాటిలో ఒకభాగంగా సినిమాలు ఉపయోగపడుతున్నాయి. అయితే తయారైన చిత్రాల్లో వినోదం లోపించడంవల్ల పైన చెప్పిన సందర్భాలలో ఆట ఆఖరయిందని ప్రకటించడానికి మాత్రమే సినిమారీల్ ఉపయోగించేవారట.

అనతికాలంలోనే కథల్ని సినిమాలుగా తీసే ప్రయత్నాలు ప్రారంభమైనాయి. మొట్టమొదట ఎడిసన్‌వద్ద ఛాయాచిత్రగ్రాహకుడుగా పనిచేసిన ఎడ్విన్ పోర్టర్ "అమెరికన్ అగ్నిమాపకదళసభ్యుల జీవితం" అని చిన్న కథ తీశాడు. దీనికి ప్రజలు అపారమైన ఆసక్తి చూపడంవల్ల పెద్ద కథల్ని తియ్యడం ప్రారంభించారు. అదేసమయంలో పెన్సిల్వేనియాలో ఒక వ్యాపారి ఒక హాల్లో అయిదేసి సెంట్లు (దాదాపు బేడా అర్ధణా) టిక్కట్లకి సినిమాలు చూపించడం ప్రారంభించాడు. అతడు ప్రారంభించిన ఏడాదిలో అమెరికాలో అటువంటి సినిమామందిరాలు అయిదువేలు వెలిశాయి. సినిమాల వాణిజ్యం పెరిగిన కొద్దీ రేట్లు పెరిగి రెట్టింపయినాయి.

సినిమాలో కథ తెలిపే కళ క్రమంగా వృద్ధికావడం మొదలెట్టింది. డైరెక్టర్ల ప్రతిభ, ప్రతిష్ఠ అధికమైనాయి. ఆనాడు డైరెక్టర్లలోకెల్ల నిపుణు డనిపించుకున్నవాడు డి. డబ్ల్యు. గ్రిఫిత్. అతనివద్ద ఛాయాచిత్రగ్రాహకుడు విలియం బిట్జర్ కూడా పేరు పొందాడు. ఇద్దరూ కలిసి కథానిర్వహణలో అనేక పోకడలు చూపారు. క్లోజప్స్ ఎలా ఉపయోగించాలో, కథలో పట్టు బిగించడానికి ఒక సన్నివేశాన్ని ఉచ్చులో నిలుపుచేసి మరొక సన్నివేశం సృష్టించడం మొదలైనవన్నీ గ్రిఫిత్ కనిపెట్టినవే. అప్పటి కింకా సినిమాకథలు ఒక్కొక్కటి పదిపదిహేనునిమిషాలే నడిచేవి. వరసగా గంటలో అనేక చిన్న చిన్న కథలు ప్రదర్శించేవారు. 1912 లో ఈచిన్నకథల పద్ధతిని విడిచిపెట్టి, ప్రదర్శనకాలానికంతకి సరిపోయే పెద్దకథల్ని చిత్రాలుగా తియ్యడం ప్రారంభించారు. ఆతరవాత ప్రదర్శించబడిన పెద్ద సినిమాల్లో రోమ్‌లో తియ్యబడిన "క్వో వాడిస్" అనే చిత్రం ఒకటీ, "క్వీన్ ఎలిజబెత్" అనే చిత్రం ఒకటీ అపారంగా ధన మార్జించిపెట్టాయి. అప్పుడు నాటకరంగంలో ప్రఖ్యాతతార అయిన శారా బెర్న్‌హార్ట్ "క్వీన్ ఎలిజబెత్" లో నటించింది.

ఆ పైన పదేళ్లు సినిమాపరిశ్రమ అతిశీఘ్రముగా వృద్ధిపొందుతూ వచ్చింది. రసవత్తరమైన కథలు చిత్రాల్లో వచ్చాయి. రసజ్ఞులైన దర్శకుల ఆధ్వర్యంలో తయారైన చిత్రాలు ప్రజల నాకర్షించాయి. రుడాల్ఫ్ వాలంటినో నటించిన "ది ఫోర్ హార్స్‌మెన్ ఆఫ్ ది ఎపోకలిప్స్" లాన్‌చానీ నటించిన "ది హంచ్‌బాక్ ఆఫ్ నోటర్‌డేమ్", చార్లీ చాప్లిన్ నటించిన "ది కిడ్" మొదలయినవి ఆ యుగానికి చెందినవి. ఆ చిత్రాల నీనాటికీ అమెరికనులు మరిచిపోరు. సినిమాప్రేక్షకుల్లో ఆ నటులు అపారమైన పరపతి నార్జించారు.

1927 లో సినిమారంగంలో విప్లవపరిణామం వచ్చింది. ఎలక్ట్రానిక్ ధ్వని గ్రహణ, పునఃప్రసారం సాధ్యమవడంతో మాట్లాడే సినిమాలు అవతరించాయి. ఈ ధ్వనిగ్రహణవిధానం కనిపెట్టడానికి టెలిఫోన్, రేడియోలు ఆధారం. దానితో అప్పటికి రంగంలో ఉన్న అనేకమంది ప్రఖ్యాతి నటీనటులు అగాధంలో పడిపోయారు. వార్నర్ బ్రదర్స్ స్టూడియోవారు సంభాషణలు, పాటలు గల చిత్రాలు తియ్యడం ప్రారంభించారు. వెండితెరకి వాణి లభించగానే పాతకాపులు వెనకపడిపోయారు. ఇంక సినిమా నిర్మాతలు నాటకాలు వ్రాసేవారినీ, నాటకాల్లో నటించేవారినీ సినిమారంగంలోకి తీసుకున్నారు. "సైలెంట్ ఫిల్మ్స్" లో అనగా పాటలూ మాటలూ లేక కేవలం ఆటమాత్రమే ఉండిన సినిమాల్లో పేరు తెచ్చుకున్న తారలు రాలిపోయారు.

కొందరికి సాంఘికాలిష్టం. ఇలాగే ఇంకా ఉన్నాయి. ఉత్తమరచనలు కొన్ని సినిమాలు తియ్యబడినాయి. ఒక వైపున ప్రేక్షకులందరికీ రుచించే వినోదచిత్రాలుచేస్తూ మరొకవైపున ఉత్కృష్టగ్రంథాల్ని చిత్రంలోకి తెస్తున్నారు. కొందరు సామాన్యప్రజలకి సినిమాలు చూసినతరవాత గ్రంథాలవిలువ తెలుస్తుంది. "హౌ స్రీ ది షిఫ్ట్" సినిమా చూసినతరవాత కథలు మొదలైనవి. ప్రపంచంలో దర్శించదగిన ప్రదేశాలను రంగుల్లో చిత్రాలుతీసి ప్రదర్శిస్తున్నారు. ఈ చిత్రాలవల్ల ఆఫ్రికాలో ప్రజల జీవితం, అరణ్యాలు మొదలైన విషయాలను బాలబాలికలు స్కూళ్లలోకంటె అధికంగా నేర్చుకోగలుగుతున్నారు.

సినిమాలసంఖ్య ఎక్కువకాగానే ప్రజలు కోరిన రకాలనే ఎంచుకుని చూస్తారు. కొందరికి డిటెక్టివ్ సినిమా లిష్టం. కొందరికి రాజకీయకథ లిష్టం. కొందరికి అరణ్యచిత్రాలిష్టం.

ఆటతోపాటు మాటకూడా రాగానే సినిమా అద్భుతకళావైదగ్ధ్యంతో వికసించింది. కళాఈషణకు అపూర్వఅవకాశాలు లభించాయి. పోనాడు అమెరికాలో వారానికి తొమ్మిది కోట్లమంది ప్రజలు సినిమాలు చూస్తున్నారు. దామాషాను ఒక్కొక్క అమెరికన్ దేశస్థుడు నెలకు రెండు సినిమాలు చూస్తున్నాడు. ఈనాటి చలనమందిరాలూ, రంగురంగుల సినిమాలూ, మిక్కీమౌస్ బొమ్మలూ ఎక్కడ, ఆనాటి ఖాళీకొట్లూ చావళ్లు, మాటలేని చిన్న సినిమా ముక్క లెక్కడ.

ఇప్పుడు అమెరికన్లను అధికంగా ఆకర్షిస్తున్నవి సినిమాలకు ముందు చూపే చిన్న చిన్న విజ్ఞానచిత్రాలు, వార్తాచిత్రాలు, మిక్కీమౌస్. అమెరికాలో షేక్స్పియర్ రచించిన ఆనాటకం ప్రతులు ఒక్కటీ మిగలకుండా అమ్ముడైనాయి. ఎప్పటికప్పుడు తయారైనచిత్రాలు ప్రదర్శనకు వస్తూఉండగా కొన్ని ఉత్తమచిత్రాలు పాతవైనా తిరిగి తిరిగి ప్రదర్శింపబడుతున్నాయి. చార్లీ చాప్లిన్ సైలెంట్ సినిమాలు కొన్నిటిని తిరిగి ముద్రించి సంభాషణలు చేర్చి తిరిగి ప్రదర్శిస్తున్నారు.

చలనచిత్రాలవల్ల ప్రజల వైఖరిలోనూ, నడవడిలోనూ, మాటతీరులోనూ ఎలాంటి మార్పులు ఎంతవరకూ వచ్చాయో గణించడం కష్టం. కాని అమెరికాలో వివిధప్రాంతాల మధ్య సఖ్యత చేకూర్చగలిగాయని ఖచ్చితంగా చెప్పవచ్చును. ఈ చిత్రాలద్వారా ఒకప్రాంతప్రజలు మరొకప్రాంతంలోని ప్రజల నడవడిని అర్థంచేసుకోడానికి వీలయింది. అమెరికాలో ఈనాడు చలనచిత్రాలు అత్యంత ప్రాధాన్యాన్ని గడించి అనేకరీతుల అభివృద్ధి చెందుతున్నాయి.

[అమెరికన్ ప్రచారశాఖా పత్రం ఆధారం.

విజ్ఞానవిశేషాలు :

వెలుగు పువ్వులు మిణుగురు పురుగులు

"ఖద్యోతో జ్యోతిరింగణః"

వేసవిలో ఒక సాయంకాలం. రంగురంగుల మేఘాలతో శోభిస్తున్న ఆకాశం క్రమక్రమంగా చీకటిలో చెరిగిపోతుంది. చిలకలు, పిచికలు, తూనీగలు సాంధ్యతారకు పిడోక్కలు పాడతాయి. బయళ్లలో పరుగులెత్తుతున్న పిల్లల ఆకారాలు చీకటిలో ముద్దకడతాయి. పెరటిగుమ్మాలలో తల్లుల పిలుపులు దూరంగా ఆకాశంలోకి ఎత్తుగా తేలిపోతాయి. దృష్టికి గోచరించని ఐంద్రజాలికుని మంత్రదండం సంధ్యాదృశ్యాన్ని చీకటితెరలో మరుగుపరుస్తుంది. వెంటనే స్వప్నసదృశమైన అపూర్వదృశ్యం అవతరిస్తుంది. చింత, వేప, నిద్రగన్నేరు, జువ్వి మొదలైన పెద్దపెద్ద వృక్షాల శిరస్సుల్లో వింత చేమంతులు మిణుకుమిణుకుమంటాయి. పచ్చికబయళ్లలో నేలపైన వింత పచ్చలు ప్రకాశిస్తాయి. వింత జ్యోతిజీవాల ఋతువు ప్రారంభమౌతుంది.

సంధ్యవెలుగు ఎప్పుడు చీకటిలో మాయమైనాయో కనిపెట్టడం కష్టం. కన్ను గుచ్చుకు చూసినా ఏక్షణంలోనో మనకు తెలియకుండా మన కన్ను కప్పి చీకటి వచ్చిపడుతుంది. అదెప్పుడెలా దట్టమౌతుందో చూడలేం. ఆ కాలాన్నే "దుర్లభమైన కాలం" అని భౌతిక విజ్ఞానశాస్త్రవేత్త లంటారు. సరిగ్గా వెలుగు ఒక తెరలో ఉన్నప్పుడు, గాలిలో తేమ సుమారుగా ఉన్నపుడు అప్పుడే మిణుగురుపురుగులు తమ దీపాలు వెలిగిస్తాయి. కాలం స్థితి అనుకూలమైనప్పుడు దేశం అంతటా ఈ చివరినుంచి ఆ చివరకు మిణుగురుపురుగులు చీకటితెరలో నక్షత్రాల్ని వెలిగించి రాత్రిని ఆహ్వానిస్తాయి. పైన ఆ తారలు కింద ఈ తారలు.

వెస్టిండీస్ ద్వీపనివాసులు పెద్దవైన మిణుగురుపురుగుల్ని కాళ్లబొటనవేళ్లకికట్టి, వాని వెలుగుఆధారంతో అరణ్యాలలో దారి వెతుక్కుంటారు. బ్రెజిల్‌లో యువతులు ఈ మిణుగురుపురుగుల్ని తలలో పువ్వుల్లా ధరిస్తారు. జపాన్‌లో ప్రజలు "మిణుగురు పండగ" రోజున తాము పెంచిన వేలాదిపురుగుల్ని వలపంజరాల్లో పట్టి క్యోటోసరస్సులో పడవల్లో తీసికెళ్లి మధ్యలో వాని నాకాశంలోకి విడిచిపెడతారు. ఎక్కడో ఆకాశంలో ఆ నక్షత్రాలు, సమీపంలోనే శిరస్సులవద్ద ఎగిరే ఈ నక్షత్రాలు చూసి ఆనందిస్తారు.

ప్రకృతివిచిత్రాలలో మిణుగురుపురుగుల వెలుగొకటి. అది వేడిలేని వెలుగు. స్వచ్ఛమైన కాంతి. వేసవిరాత్రుల వేడిమిలో మిణుగురు చల్లగా ఉంటుంది. మిణుగురు ఈగ జాతికి చెందినది కాదు. పేడపురుగుల జాతికి చెందినది. వాని రెక్కలపైన రెండు కప్పులుంటాయి. పగలు చూస్తే మిణుగుర్లు అంత ఆకర్షవంతంగా ఉండవు. జేగురు, బూడిద, నలుపు రంగుల్లో ఉంటాయి.

మిణుగురుపురుగులు రాత్రివేళ రెక్కలు విప్పి ఎగురుతూ చిమ్మే సన్నవెలుగులే జంటలకు పిలుపు. మగపురుగులు మెల్లిమెల్లిగా నేలకు చేరతాయి. చేరి ఆడపురుగులకోసం అన్వేషణ ఆరంభిస్తాయి. మిణుగుర్ల వెలుగు మిణుకుమిణుకుమంటుంది. దామాషాను 5-8 సెకండ్లకొకసారి వెలుగు వెలుస్తుంది. వేడి అధికంగా ఉంటే ఇంకా చురుగ్గా ఉంటుంది. చల్లగా ఉంటే నెమ్మదిగా వెలుగుతుంది. పచ్చికలో ఉండే ఆడపురుగులు తమ వెలుగుతో మగపురుగుల్ని ఆహ్వానిస్తాయి. విచిత్ర మేమిటంటే వెలుగు రంగులో వీసమైనా తేడా ఉండకపోయినా, వెలుగునుబట్టే పురుగు ఆడదో మగదో మగపురుగు దూరంనుంచి ఇట్టే గ్రహించగలదు. ఆడపురుగు వెలుగు కొద్దిగా సన్నగా ఉంటుంది. కాని ఆ తేడా మన కంటికి కనపడ్డం కష్టం. మగపురుగు వెలుగు చూసిన తరవాత సరిగా 2.1 సెకండ్లకు ఆడపురుగు తన దీపం వెలిగిస్తుంది. "వెలుగు జండా" కనిపించగానే మగపురుగు ఆడపురుగు వైపుకు ఎగిరి వస్తుంది.

ఈవిధంగా మగపురుగుల్ని సులువుగా ఆకర్షించవచ్చును. పచ్చికలో ఫ్లాష్ లైట్ పెట్టండి. పైన ఎగిరే పురుగుల వెలుక్కి తరవాత సరిగా 2,1 సెకండ్లు చొ॥ లైట్ వెలిగించండి. ఫ్లాష్‌లైట్ రంగు ఏదయినా ఇబ్బందిలేదు. వెలిగినతరవాత ఒక సెకను వెలిగినా సరే లేక ఏభయోవంతు సెకను వెలిగినా సరే కాని పైవెలుక్కి సరిగ్గా 2.1 సెకన్లతరవాతనే వెలిగించాలి, అంతే మగపురుగు దగ్గరికి వస్తుంది.

పురుగు గుప్పెట్లో మూసి ఉంచితే మామూలుగా వచ్చే వెలుగుమెరుపులు కాక పొట్టకింద నిత్యమూ ఉండే సన్నని కాంతిని చూడవచ్చును. లైట్‌హౌస్‌లో చుట్టూ తిరిగే వెలుగుతీగవలె ఉన్నట్టుండి పురుగుపొట్టకిందనుంచి మెరుపులు వస్తాయి. కాని మెరుపు క్షణంమాత్రమే ఉంటుంది. ఎలా చటుక్కున వచ్చిందో అలాగే చటుక్కున మాయమౌతుంది. సరిగ్గా లయతప్పకుండా మెరుపులువస్తూ ఉంటాయి. పురుగు గాయపడిందంటే మెరుపులు అడుగడుక్కీ వస్తాయి - ఆవేగం వచ్చినప్పుడు మన హృదయస్పందనం అధికమైనట్లు.

మిణుగురుపురుగులో వెలుతురిచ్చే భాగం రెండు పొరలుగా ఉంటుంది. పైపొరలో చిన్న పూస లున్నట్లుంటుంది. రెండోపొరలో స్ఫటికలవంటివి ఉండి కాంతిని ప్రతిఫలింపచేస్తాయి. పూసలు వెలుగు నిస్తాయి. ఆ పూసల

(20-వ పేజీ చూడుడు)

చంద్రగ్రహణం

(11-వ పేజీ తరువాయి)

కుదురుతుందీ ? ఇక్కడికి మన ఆర్యయువతులని దిగుమతిచేసుకోటం ఎల్లా వీలవుతుంది? మరి మన వంశాలు వృద్ధిఅవటం ఎల్లాగు ? వృద్ధికాక పోతే కష్టపడి జయించిన ఈ రాజ్యం అంతా ఎవరిపాలు అవుతుందీ?" అన్నాడు. ప్రద్యుమ్నుడు ఔనని తలవూపాడు.

మఘవమహారాజూ ప్రద్యుమ్న సేనానీ దర్బారుహాలులోకి వెళ్లారు. సభాభవనంఅంతా ఖాళీగా వుంది. నలుగురు సైనికులు ఒక పెద్ద పేముబుట్టని మోసుకొచ్చి వాళ్ల ముందు పెట్టారు. బుట్టకి మూత గట్టిగా బిగించివుంది. దాంట్లో ఏదో భయంకరమైన బరువైన జంతు వుందని ప్రద్యుమ్న సేనాని వూహించాడు. ఆశ్చర్యంతో" రాజా ! ఏముంది లోపల ? కొండ చిలువా ?" అని అడిగాడు. మారుగా మఘవుడు సైనికులని వెళ్లిపొమ్మని చేత్తో సైగచేశాడు. వాళ్లు వెళ్లిపోగానే చిరునవ్వుతో బుట్ట మీది మూతని నెమ్మదిగా తీశాడు.

మూత తియ్యగానే విప్పిన పడగతో చరాలున లేచే తాచుపాములాగా ఒక స్త్రీ చివాలున లేచి నిలబడింది. నీలిమబ్బులలాటి ఆమె కళ్లలో తళుక్కున మెరుపులు మెరసినయ్. ప్రద్యుమ్నుడు ప్రతిమలాగా నిలబడిపోయాడు. విస్మయంతో నోరు తెరుచుకుని "ఏమిటీ? యువతా ?" అన్నాడు.

మఘవుడు బిగ్గరగా నవ్వుతూ "అవునవును. యువతే ! బాగుందా ? పసందుగా వుందా ?" అని అడిగాడు.

ప్రద్యుమ్న సేనాని యువతిని పరీక్షగా చూశాడు. మిసమిసలాడే రంగు, కాటుకపెట్టిన కళ్లూ, ఉంగరాల జుట్టూ, ఆభరణాల అనవసరమైన ఆర్భాటం లేదు. మెళ్లో పూసల దండ. చేతులకి శంఖుపుగాజులు. చెవులకి పెట్టుకున్న సంపెంగపూలు వాడిపోయినయ్. వింతరంగుల వలువ మోకాళ్లదాకా వేళ్లాడుతోంది. ఆమె సుకుమారయౌవనదేహంలో ఏదో జ్వాల వెలుగుతున్నట్లుగా వుంది. "ఏమంటావ్ ? బాగా వుందా ?" అని మఘవుడు మళ్లీ అడిగాడు.

అదిరిపడి తన్మయతలోంచి తెప్పరిల్లుకుని ప్రద్యుమ్నుడు మఘవుడికేసి తిరిగి "నువ్వు నిజంగా మూర్ఖుడివి. యుద్ధంకోసం వెళ్లినవాడివి యువతిని పట్టుకుని వెంటపెట్టుకురావటమేమిటి ? ఇప్పుడీ యువతిని ఏం చేస్తావో చెప్పు ?" అని మందలింపుగా అన్నాడు.

ఒక్కసారి ఆ యువతికేసి చూస్తే చాలు. అటువంటి సుందరిని దాసిగా వుపయోగించటానికి ఎవరికీ బుద్ధిపుట్టదు. అందుకే మఘవుడు "పెళ్లిచేసుకుంటాను" అన్నాడు. విస్తుపోతూ "పెళ్లాడుతావా ?" అన్నాడు సేనాని.

"అవును. ఈమె ఎవరో తెలుసా ? కోదండరాజుకూతురు" అన్నాడు మఘవుడు. సేనాపతిముఖం గంభీరమైపోయింది. రాజు ఇల్లా చెప్పటం మొదలుపెట్టాడు "కోదండరాజభవనాన్ని నేను ముట్టడించినప్పుడు అంతా పారిపోయారు. ఈ అమ్మాయి ఒక్కత్తే భవనంలో వుంది. ఎన్ని ప్రశ్నలడిగినా ఒక్కదానికీ జవాబు చెప్పలేదు. మన భాష రాదు. అందాన్ని బట్టి చూస్తే ఏ ఆర్యరాజుకైనా రాణి కాదగిన యువతి. అందుకే బుట్టలో పెట్టి ఇక్కడికి తీసుకొచ్చాను. ముందు మన భాష నేర్పాలి. తరవాత ఈమెని నా రాణిని చేసుకుంటాను."

ప్రద్యుమ్న సేనాని ఇంకోసారి ఆ యువతికేసి చూశాడు. ఆమెకి వీళ్ల మాటలే అర్థంకావటం లేదు. ఆమెకళ్లుమాత్రం మెరుపుల్లాగా ఒకరిమీదనుంచి ఒకరిమీదకి పరిగెడుతున్నయ్. ఆమె ముఖంలో భయం కాని, సంకోచం కాని, ఆందోళన కాని లేశంకూడా కనిపించటంలేదు. ఆమెకళ్లలో ఈ అనాగరికుల చేష్టలమీద నిరసనా, వీళ్లు ఏచేస్తారా అనే కుతూహలం తొంగి చూస్తున్నయ్.

సేనాని "నువ్వు చాలా తప్పుపని చేశావు మఘవా ! ఒక రాజకుమారిని దొంగతనంగా ఎత్తుకురావటం ఆర్యులు చెయ్యదగిన పని కాదు" అన్నాడు.

"పెళ్లాడాలనే వుద్దేశంతో పిల్లని ఎత్తుకురావటంలో తప్పు లేదు" అని మఘవుడు సమర్థించుకున్నాడు.

"ఏమైనా నువ్వు చేసింది తప్పే. ఈక్షణంలోనే ఈమెని నువ్వు విడిచిపెట్టటం మంచిది" అని ప్రద్యుమ్నుడు అన్నాడు. కోపంగా మఘవుడు "వీల్లేదు" అని అరిచాడు. కోపం చల్లారినాక "ప్రద్యుమ్న సేనానీ ! ఇది నా ఆజ్ఞ. ఈ సుందరికి వసతి ఏర్పాటుచెయ్యి. సౌకర్యంగానూ, పారిపోయే వీలు లేకుండానూ ఏర్పాటు చెయ్యి. పారిపోకుండా చూసే భారం నీది" అన్నాడు.

చేతులుజోడించి ప్రద్యుమ్నుడు "చిత్తం. ప్రభువుగారి ఆజ్ఞ శిరసావహిస్తాను" అన్నాడు.

కాబోయే రాణిగారికి మేడమీద ఒక గదిలో నివాసం ఏర్పాటుచేశారు. ఆ గదిలోకి కోదండ రాజకుమారి నిబ్బరంగా అడుగులు వేస్తూ మౌనంగా నడిచివెళ్లింది. అది ఆమెకి ఖైదు అయినప్పటికీ గదిముందు చిన్న వరండా వుండటంవల్ల హాయిగా వీలుగా వుంది. పారిపోయే దారి తప్ప అన్ని హంగులూ అన్ని వసతులూ వున్నయ్.

పట్టలేని సంబరంతో మఘవుడు ప్రద్యుమ్నుడి వీపుమీద చరిచి "ఏం, తగిన రాణి దొరికింది కదూ ?" అని అడిగాడు. సేనాని అవునని తల వూపాడు.

మర్నాడుపొద్దున్నే దుర్వార్త వచ్చింది కోదండుల రాజ్యంనుంచి ఒకడు గుండెలు పగిలేట్లు పరిగెత్తుకుంటూ వచ్చి ఒక వార్త తీసుకొచ్చాడు. తమ రాజకుమారిని ఎత్తుకుపోయిన సంగతి తెలియంగానే కోదండులు ప్రచండమైన దండుతో వచ్చి ఆర్యులమీద పడి అందర్నీ చంపేశారుట. వార్త తెచ్చిన మనిషి మటుకు ఎల్లాగో చావు తప్పించుకుని వచ్చాడుట.

వినగానే ప్రద్యుమ్న సేనాని "అనుమతివ్వండి రాజా ! వెళ్లి కోదండులని పిండిపిండి చేసివస్తాను" అన్నాడు.

"కాదు. నేనే వెళ్లి వాళ్ల తలపొగరు అణిచివస్తాను" అంటూ మఘవమహారాజు సేనలు కూర్చుకుని దాడివెళ్లాడు. కొంతదూరం వెళ్లాక వెనక్కి తిరిగి వచ్చి "ప్రద్యుమ్న సేనానీ ! నేను కోదండులకి మంచి పాఠం నేర్పివస్తాను. ఈ లోపున నువ్వు యువతికి ఆర్యభాష బాగా నేర్పాలి." అన్నాడు. ప్రద్యుమ్న సేనాని సరే అన్నాడు.

కొద్దిరోజుల్లోనే ప్రద్యుమ్న సేనానికి అనార్య యువతి కున్న అద్భుతమైన తెలివితేటలు తెలిసి వచ్చినయ్. వారం తిరక్కముందే నట్టునట్టుగా ఆర్యభాష మాట్లాడటం నేర్చుకుంది. ఆమె పేరు ఇల. ఎంత చక్కటి పేరు ! ప్రద్యుమ్న సేనాని ఆ పేరుని ఎన్నోసార్లు మనస్సులో జపం చేసి "ఇల ! ఎంత బాగుంది పేరు" అనుకున్నాడు.

మాట్లాడటం నేర్చుకోగానే ఇల ఆర్యభాషలో అడిగిన మొదటి ప్రశ్న "నన్ను పట్టుకుని ఇక్కడికి తీసుకొచ్చిన ఆ మనిషి ఎవరూ?"

"నా మిత్రుడు" అని సేనాని బదులు చెప్పాడు.

మిత్రుడు అనే మాటకి అర్థం వెంటనే తెలియలేదు. తెలియగానే ఏవగింపుతో ముడుచుకున్న ముఖంతో "మీరు మూర్ఖులు !" అంది.

ప్రద్యుమ్నుడికి ఆశ్చర్యం వేసింది. "ఏమిటీ ? మేం ఆర్యులం ! మేమే మూర్ఖులమా ? అని విస్తుపోయాడు.

క్రమంగా ఇలకి ఆర్యభాష అంతా వచ్చేసింది. మంచినీళ్ల ప్రాయంగా మాట్లాడగలిగింది. ఒకనాడు "నన్నిక్కడ ఎందుకు వుంచుతున్నారు ?" అని ఇల అడిగింది.

"నీకు మాభాష నేర్పటానికి" అని సేనాని బదులుచెప్పాడు.

"పాడుభాష ! ఎందుకు నేర్చుకోటం ?"

"మా భాష నేర్చుకుంటే మా రాజుగారితో మంచి సరసాలాడటానికి వీలుగా వుంటుంది. నువ్వు మఘవమహారాజుగారి భార్యవి కాబోతున్నావుగా !" అని సేనాని చిరునవ్వుతో అన్నాడు.

ఇలా వరాలున లేచి నిలబడింది. కొంచెంసేపు సేనానికేసి రెప్పవాల్చకుండా చూసింది. మళ్లీ తాపీగా కూచుని "నేను పెళ్లి చేసుకోను. ఉత్త మూర్ఖుడు !" అంది.

"గర్వం వుందనుకో. కాని మనిషి చాలా మంచివాడు" అని సేనాని సర్దుబాటు చెయ్యబోయాడు. వినిపించుకోకుండా ఇల మళ్లీ "మూర్ఖుడు" అంది హేళనగా.

ఇల్లా రోజులు దొర్లుతున్నయ్. మఘవుడి జాడా జవాబూ లేదు. ఏమైపోయాడో అని ప్రద్యుమ్నుడికి ఆందోళనగా వుంది. మూడునెల్లు గడిచినా మఘవుడి అతీ గతీ లేదు.

ఒకరోజు పొద్దున్నే ప్రద్యుమ్నుడు ఇల గదిలోకి వెళ్లాడు. కిటికీదగ్గర నిలుచుని ఇల జడ విప్పుకుంటోంది ప్రద్యుమ్నుడు రావటం విని ఒకసారి అతనికేసి చూసి మళ్లీ కిటికీలోంచి దూరంగా చూపులు పరిగెత్తిస్తూ చేతులతో తాచుపాములాటి జడ విప్పటం మొదలుపెట్టింది. తను వచ్చినట్లు తెలియాలని సేనాని గొంతు సవరించుకున్నాడు. లాభంలేక చివరికి తనూ వెళ్లి కిటికీదగ్గర ఇలపక్కనే నిలబడ్డాడు. కిటికీలోంచి ఒకసారి ఆకాశంలోకీ ఒకసారి కిందికీ చూసి "చలికాలం వెళ్లిపోయింది. ఇప్పుడు చాలా హాయిగా వుంది" అన్నాడు. ఇల అవునన్నది. ఉత్సాహంగా "దక్షిణంనుంచి వచ్చే గాలిని మీరు మలయపవనం అంటారుకదూ ? అటువంటి గాలి మా ఆర్యదేశంలో లేదు" అన్నాడు ప్రద్యుమ్న సేనాని.

అనగానే తన బరువైన కనరెప్ప లొకసారి పైకెత్తి ఇల "ఈమధ్యన నువ్విక్కడికి రావటం మానేశావేం ?" అని అడిగింది. కొంచెం తికమకపడి చివరికి "తీరుబాటు లేదు. అదీకాక నీకు మా భాషంతా వచ్చేసింది. ఇంక నేనేం నేర్పను?" అన్నాడు సేనాని.

కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా నిలబడ్డారు. ఇల తలవంచుకుని వేళ్లతో తన నొక్కులజుట్టు చిక్కుతీసుకుంటోంది. సంభాషణ సాగించటంకోసం సేనాని "రాజుగారు వస్తే బాగుండును. ఎన్నాళ్లయిందో వెళ్లి ! కబురే లేదు. ఆదుర్దాగా వుంది" అన్నాడు.

కొంచెమైనా సానుభూతి లేకుండా క్రూరంగా నవ్వుతూ "ఇంక మీరాజు తిరిగి రాడు. ఈపాటికే మావాళ్లు చంపేసివుంటారు" అంది ఇల.

"మఘవుడు మహావీరుడు. అతణ్ని ఓడించగలవారు దక్షిణదేశంలో ఒక్కరూ లేరు"అన్నాడు సేనాని కోపంగా.

ఇల "మహావీరుడా ? పరమమూర్ఖుడు!" అంది. సేనాని కోపంగా "ఆ మూర్ఖుణ్నే నువ్వు పెళ్లాడాలి" అన్నాడు. కనుబొమలు ముడివేస్తూ "నిజంగానా ? నీ కిష్టం లేకపోయినా తప్పదా? అంది ఇల.

"నువ్వు బందీవి. నీ ఇష్టానిష్టాలతో మాకేం పని ?"అన్నాడు సేనాని.

"అల్లాగా ! ఇష్టం లేకుండా నన్ను పెళ్లాడగల ఆర్యుడు ఇంతవరకూ పుట్టలేదు. ఇదిగో ఈ దండ చూశావా ?" అంది ఆవేశంతో ఇల. అంటూ దండని చేత్తో పుచ్చుకుని "ఇదుగో ఒక్క గింజ నమిలితే చాలు ఇక నాకేం భయం లేదు. నా శవాన్ని పెళ్లిచేసుకోవలసిందే !" అంది. భయంతో వణుకుతూ సేనాని "ఏమిటీ, విషమా ? ఇల్లాతే, ఆ పాడుదండ ఇల్లాతే" అన్నాడు.

కొంచెం దూరంగా జరిగి "ఇంతకాలం బందీగా వున్నానని నేను మీ దాసి ననుకున్నారా ? నేను మీకు ఆటవస్తువు ననుకున్నారా ? క్షణంలో మీ ఖైదునించి విముక్తి పొందగలను తెలుసునా ?" అంది.

"అయితే ఎందుకు పొందలే. దింకా ?" అవ్వెర్రిగా అడిగాడు సేనాని.

(21 వ పేజీ చూడుడు)

ప్రాచీన కవిశేఖరుల కదనరంగములే రాజాస్థానములు:

శ్రీ కోన వేంకటరాయశర్మ

భారతీదేవి సంగీతసాహిత్యస్వరూపిణి. దేశ కాలపరిస్థితులనుబట్టి దేశభాషలకును శాస్త్రములకును ప్రజాదరము లేక పాశ్చాత్య విద్యావ్యామోహబలమున విద్యార్థుల మనస్సులు కళలయం దన్నిట లగ్నమగుటచే గావ్యకళయు బేలవమయినది. ఇవ్విధముగ విద్య లన్నియు బేలవమగుటచే మనవిద్యాసాధనలలో భారతీదేవి సాక్షాత్కరింపజాలకున్నయది. సాక్షాత్కారము లేనిచో సిద్ధి లేదు. సిద్ధి లేనిదే ఫలితము లేదు.

"తేజస్వినావధీత మస్తు" అను నుపనిషద్వాక్య మవగత మొనర్చికొనినయెడల బూర్వ విద్యావ్యాసంగములు తేజోవంతము లయియున్నవని ద్యోతింపకమానదు. విద్యవలన జావును గెలిచి మనుష్య డమరత్వము నందునని యీ యుపనిషద్వాక్యము దెలుపుచున్నది. ఐహిక పారలౌకికములని యమరత్వము ద్వివిధము. సప్తసంతానములవలన నైహికమును, మోక్షవిద్యాభ్యాసమువలన బారలౌకికమును,—గలుగు నని మన పూర్వుల యభిప్రాయము. కావుననే భాషామయములగు సాహిత్యములు ప్రబలిన జాతములందెల్ల సాహిత్యరసానుభవము జరామరణాతీతమగు నాత్మసాక్షాత్కారమును గవికిని శ్రోతకును క్షణికముగానైనను గల్గించుచున్నది. అట్టి దీక్ష, విశ్వాసము, నేడు మనలో నరిదిగా నుండుట గానరాదు. పూర్వులలో నవి గాఢముగా నుండుటవలననే వారు "విరుదుకవు" లయిరి.

ఇట్టి లలితకళావిన్యాసము ప్రభుసామంతమంత్రిసత్తములకే గాక యుపపత్తికయియత్నించు పండితప్రకాండులకును సులవిద్యయై, బిరుదలాంఛనమై,—విలసిల్లెను. ఇందువలన నైహికము సాధింపజాలనివా రాముష్మికమునకు బ్రయత్నించిరని తెల్లమయ్యెడిని. రాజాస్థానములలో పండితులు, కవులు, ఉత్తమప్రకృతులుగా సంభావింపబడుటయు, గవిత్వయుద్ధములు వాదనాపుటయు, విజయోత్సాహములు జిక్కులు పిక్కటిల్లుటయు,-కలుగుచుండెను. కవితాగౌరవమునకయి ప్రత్యేకోత్సవము లేర్పఱుపబడుచుండెడివి.

కవిశేఖరులకు ప్రభుసామంతులతోడను, సచివోత్తములతోడను, సమావేశములు గౌరవప్రపత్తులు అలవడుచుండెడివి. సత్కరించువారును సత్కృతుల నందికొనువారును స్వయముగ పండితకవు లయి యుండిరి. ఇట్టి సాముగరిడీలలో నారితేరిన రచన లగుటచేతనే పూర్వకవితలలో లాలిత్యము, శిల్పవైచిత్ర్యము, గంభీరభావవిలసనము, రసోత్కర్షము, ధారాశుద్ధి, శయ్యాగౌరవము, ప్రతిభావ్యుత్పత్తులు,-ఎన్నియేని గోచరించుచున్నవి. కావుననే "రవి గాననిచో గవి గాంచునేగదా" యను నభియుక్తోక్తి ప్రపంచింపబడినది. ఈనాటి కవిత్వమున కట్టి కదనరంగము లేదు. కాగా నిస్తేజితమైన యాశాకల్పితమ్మగు మృగతృష్ణలో దట్టుముట్టాడుచున్నది.

"పద్మినీ పరిణయ" మందలి—

"భాగవతాది ప్రబంధగీర్వాణాంధ్ర
    భాషామయశ్లోక పద్యములను,
బ్రత్యక్షబాహాటపాంచాల రీతిగా
    జదువుటచే దదక్షరవిలేఖ
నమున దదర్థముల్ నవరసయుక్తిగా
    బలుకుటచే గావ్యఫణితివలన
శబ్దశాస్త్రద్వయ సకల ఛందోపూర్వ
    నాటకాలంకరణప్రరూఢి
నుభయభాషాకవిత్వాద్భుతోరుశక్తి
భువనమోహనసంగీతపూర్తిచేత
స్వమతసిద్ధాంతమార్గవిచారమునను
బధికుడవు నీకు నుపమింప బరులు గలరె.

"మును గవినాథులెల్ల ముద
    ముం దలుకొత్త రచించినట్టి గ్రం
థనిచయముం గణింప ద్వివి
    ధార్థ మలంకృతి శబ్దపుష్టి క
ల్పన బహుభంగి గల్గి బుధ
    పామరసాధ్యము గాదు గాన వా
సిని యవి యన్ని గల్గి జన
    సేవ్యము గాగ రచింపు కావ్యమున్."

అనుపద్యములంబట్టి యెట్టి కవితలు సనాదరణీయములయి యుండెనో, కవులు ప్రబంధములలో గ్రొత్తత్రోవల ద్రొక్క నవకాశ ముండెడిదో, - యవగతము కాగలదు. ఆనాడు పదకవిత్వములను బామరజనసంసేవ్యములై యుండియందలి దేశిఛందస్సులు పండితకవి సమాదరణీయములుగా నుండుటచే బ్రబంధకవిత్వము జనసామాన్యమునకు దురవగాహమై యుండినది. శివకవు లీ యాధారమున దమమతమును బ్రబలించికొనిరి. కావుననే—

"భ్రమరాంబికాలబ్ధభాసితమ్మగునట్టి
    కవితారసజ్ఞత గాంచినాడ
సంస్కృతాంధ్రవిచారసారకల్పితపద్య
    గద్యచమత్కృతి గల్గినాడ
తాళాదిరాగసందర్భనాటకవేష
    జాతీయవిషయములు సల్పినాడ
మాఘ ప్రబంధ నిర్మాణధౌరేయత
    విద్వత్సభాస్థలి వెలసినాడ
లాలితాకారమోక్షలక్ష్మీలలామ
యార్జితానందరాగయోగాంకముద్ర
కలితుడౌ ఘట్టిరామసత్కవివరుండు
ఘనతకెక్కెను బదపద్యకల్పనమున."

అని పదకవిత్వము నారంభించిరి.

కొన్ని పలుకుబడికల కుటుంబములకు గవుల నాదరించి గ్రంథములు కృతినందుట యనూచానమౌట గవితావిజృంభణమునకు వేఱొక ప్రోత్సాహము. ఇందుల కెన్నియేని నిదర్శనములు నూపుదును. "శ్రీశైల ఖండకావ్యము"ను గృతినందిన కందుకూరి వీరశలింగ మంత్రినిగూర్చి—

"మెచ్చగా గృతియందె మీ తాతమల్లికా
    ర్జునమంత్రి "కువలయాశ్వుని చరిత్ర"
మహిత "పంచాక్షరీ మాహాత్మ్య" కృతి గొని
    వెలసె మీ పెదతండ్రి వీరమంత్రి
అతిదాత మీ తండ్రియగు బసవామాత్య
    డందె 'శంతనువిలాసా' దికృతులు
గొనిరయ మీ పెదతండ్రికొడుకగు నమృత
    గము 'చెన్న బసవన్న కథ' సుకృతిగ,
ఇట్టి మీవారలందఱు నెలమి గృతులు
గొనిరి యట్టులు గావున ననఘ మీరు
కోర్కె మీరంగ గృతియందుకొనుట మేలు
రంగదౌదార్య వీరశలింగవర్య!"

అని కలదు. కావ్యములలో పాండితీప్రకర్ష నపేక్షించుటవలన గృతికర్తకు దన ప్రతిభావ్యుత్పత్తుల జూపగల్గు నవకాశము లభించి కవితకు బఠనయోగ్యతయు గాంభీర్యము (హుందా) ను,—జేకూరినది.

వూసపాటి బసవభూపాలుని కార్యాచరణ మంత్రి చందలూరి గంగన 'నాచికేతూపాఖ్యానము' రచించిన దగ్గుపల్లి దుగ్గనకవిత్వమును—

"శ్రుతుల విహారదేశములు
    సుస్థిరవాక్యపదప్రమాణశా
స్త్రతతుల యిక్కలాగమవు
    రాణచయమ్ముల కేళిసద్మముల్
స్మృతుల నివాసముల్ కవిస
    మాహితసత్కవితాగుణప్రసా
దితములు దగ్గుపల్లి కవి
    తిప్పయ దుగ్గని గద్యపద్యముల్."

అని యుగ్గడించెను. దీనింబట్టి యాంధ్రకవిత్వమున సారస్వతవస్తువిస్తృత మెట్టిదియపేక్షణీయమో రూఢియగుచున్నది. తామర పల్లి తిమ్మయమంత్రినిగూర్చి 'శేషధర్మము' లను గ్రంథమున—

"బహుపురాణగ్రంథపరిష్కారకరణాతి
    శూరుండు మీ యన్న సూరమంత్రి
మహితసభాభిరామముఖ కావ్యంబులు
    ధర నిల్పె మీ తండ్రి శరణమంత్రి
తగవరియై యన్నదానంబు సేయుచు
    వెలసె మీ పెదతండ్రి విస్సమంత్రి
వేదపర్వత మన వినుతులు గాంచెను
    సరసుండు మీ తాత చంద్రమంత్రి
ప్రౌఢరాయల మెప్పించి రాయసమున
జైడిగంటంబువారని పద్దు దెచ్చె
యలరె మీ తాత ముత్తాత యబ్బమంత్రి
……………………………………"

"మృగమదసౌరభ
ప్రదకవితారాజ్యపట్టభద్రుడవు; భళీ
పొదలెను యదునాథవరా
స్పదవచనసుధాళి గ్రమ్మ! శరణయతిమ్మా!"

అని యుట్టంకింపబడినది. రాజాస్థానములలో సఖిలవిద్వజ్జనసమక్షమున వివిధసత్కృతులు లభించుటయు, గవితామాత్సర్యము లుత్పన్నమగుటయు, విజయోత్సాహములు ప్రబలుటయు కవితావిజృంభణమునకు దారితీసెను. దీనితో గవిరాజ హంసలకు బ్రభువులతో అమాత్యాది ధీమంతులతో దగిన గౌరవమర్యాదలు సాంఘికముగకూడ సమగ్రనీయ మయ్యెనని తెలియందగును. విద్వత్ప్రభూత్తంసుల యాస్థానముల కేగి నప్పుడు పరిణతి గల కవికి జంకు, భీతి యెట్టు లేర్పడుచుండెడిదో—

"దీనారటంకాల తీర్థమాడించితి
    దక్షిణాధీశు ముత్యాలశాల
పలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య
    నైషధగ్రంథసందర్భమునకు
బగులగొట్టించి తుద్భటవివాదప్రౌఢి
    గౌడడిండిమభట్టు కంచుఢక్క
చంద్రశేఖరక్రియాశక్తి రాయలయొద్ద
    బాదుకొల్పితి సార్వభౌమబిరుద
మెటుల మెప్పించెదో నన్ను నింకమీద
రావుసింగమహీపాలు దేవిశాలు
నిండు కొలువున నెలకొని యుండి నీవు
సకల సద్గుణనికురంబ శారదాంబ."

అను శ్రీనాథకవిసార్వభౌముని పద్య మవగత మొనర్చుచున్నది. డిండిమభట్టును గెలుపొందియే యతని 'కవిసార్వభౌమ' బిరుద మీ శ్రీనాథమహాకవి వహించినాడు. రాధామాధవ కవి యప్పటి విజయోత్సాహమును—

"గానాస్త్రప్రమదామదస్ఫురితవ
    క్షోజాతకాఠిన్యము
న్మానంజాలు వచోవిలాసముల నే
    ర్పల్ మూకి కర్ణాటక
క్ష్మానాథేంద్రుసభ స్వవిత్వవిజయో
    త్సాహంబు నైకొన్న మా
శ్రీనాథు న్గవిసార్వభౌము గొలుతున్
    సేవాంజలు ల్గీల్కొనన్."

అని యభివర్ణించినాడు. తన కాలమున దన కెట్టి కవితావిజయము సేకూరెనో రాధామాధవ కవి—

"రాధామాధవ మచ్యుతాంకితముగా
    శ్రాఘక్రియం జెప్పి త
న్మాధుర్యంబున గృష్ణరాయవిభుగ
    న్గాశేకు మెప్పించి నా
నాధాత్రిప్రతిమానసత్కవులలో
    నన్యూనశ్రేణితో
రాధామాధవ నామ మందిన జగ
    త్ప్రఖ్యాతచారిత్రుడన్."

అను పద్యమున జెప్పికొనియెను. ఇట్టి విజృంభణములు ప్రోత్సాహములు విజయములు విద్వత్ప్రభువులు దమ యాస్థానములలో నేర్పఱుచుట జూడగా, 'గ్రీసు' లోని 'ఒలంపిక్ గేమ్సు' స్మృతిపథమునకు వచ్చుచుండును. శ్రీకృష్ణదేవరాయ లేర్పఱచిన 'వసంతోత్సవ' మిట్టిద. నందితిమ్మన "పారిజాతాపహరణ" కావ్యమున—

"ప్రతివర్షవసంతోత్సవ
కుతుకాగతసుకవినికరగుంఫితకావ్య
స్తుతిరోమాంచవిశంకిత
చతురాంతఃపురవధూప్రసాదనరసికా!"

అని యుట్టంకించుటనుబట్టి వసంతోత్సవములలో నంతఃకాంతలుసైతము కవితాగోష్ఠుల నాలించి యానందించుచుండిరని తెల్లమయ్యెడిని. ఇందువలన నాకాలమున స్త్రీలలో నందున నంతఃపురాంగనలలో విద్య యెటుల ప్రబలెనో విదితము కాగలదు.

అచ్యుతరాయలనాటను గూడ నిట్టి యుత్సవములే దైవపరముగ జరపబడినట్లు లున్నది. "తారకబ్రహ్మరాజీయము" నందలి "అమ్మహామహీశ్వరు డొక్కనాడు...సుఖగోష్ఠిం బ్రవర్తింపుచు నిజస్వామియగు నచ్యుతదేవరాయలు ప్రతిసంవత్సరంబు శ్రీవేంకటేశ్వరునకు సత్కావ్యప్రబంధపుష్పాంజలి సమర్పించుచు గీర్తిసుకృతంబులు గిర్తించుకొనుచున్నవాడు. తదనుమతంబున నవ్విభునకు నాకు నభ్యుదయపరంపరాభివృద్ధియు, జతుర్విధపురుషార్థసిద్ధియు, గలుగునట్లుగా నా యిష్టదైవంబగు శ్రీరామవిభునకు నంకితంబుగా నొక్క పుణ్యప్రబంధంబు జెప్పింపవలయుననిన"—అనువాక్యము లీ యభిప్రాయమును బలపఱచుచున్నవి. ఇట్టి యుత్సవములలో గృతికన్యల సమర్పించినవారికి భూషణాద్యలంకరణములు, అందలములు, అగ్రహారములు, లోనగు సత్కారంబులే గాక బిరుదములు గూడ నిచ్చి గౌరవించుచుండెడివారు. కవిరాజశేఖరుల కట్టి గౌరవమర్యాదలు జరగుచుండుటచేతనే నానారాజసభాస్థలులయందు దమ ప్రతిభ నలయించి దిక్తటంబుల సాహిత్యరసాస్వాదనాతత్పరతను వికసింపజేసిరి. అందువలననే రాజాస్థానములు విశ్వవిద్యాలయము లైనవి. కాగా, కవులు దిట్టలై నానారాజన్యసభారంగంబుల జట్టులవలె వర్తించుచు నెట్టి యున్నతస్థాయినందుండిరో "చంద్రికాపరిణయము" నందలి—

"పగలు దివ్వెలు నీ పల్లకి యొసంగి
    చ్చిరి గండభేరుండబిరుదు డిచ్చె
నుత్తమాశ్వంబు నీ ముత్తాత గొవ్వ
    రిచ్చిరి జూపల్యధీశు డిచ్చె
గొల్లారుబండి యీ పన్నాయి యొసంగ
    రిచ్చిరి విప్పరలో త్రిసింహు డిచ్చె
నగ్రహారంబు నీ యందలం బెవ్వ
    రిచ్చిరి పదజాన్న మజస్థు డిచ్చె
నని చెలగి మాన్యజనబృంద మరగ దెల్పు
వివిధరాజసభాయాంతకవిశాలి
చే ప్రశస్తమైన ప్రసిద్ధమాన
విస్తుతి ధరిత్రిలో నింగ వేంకటేంద్ర!"

అను పద్యము సూపల్లివారి వంశము నభివర్ణించుచు సూచించినదానింబట్టి తెలియనగుచున్నది. ప్రతిభావిలసనమునకయి కవితాకీర్తుల యందెన్నియేని దుర్గమమార్గముల నన్వేషించి యన్వేషించి కవిశేఖరులు ప్రయత్నించిరని "ప్రకృష్ట బల్లరామచరిత్ర" యందు గల—

"బహుళసందర్భాష్టభాషాపధాన దు
    ష్ప్రాపదుష్కరబంధభావగద్య
పదమైత్రిరసజాతిపద్యశబ్దశ్లేష
    దురవగాహార్థవిస్తరనిగూఢ
ఘటికాప్రబంధహృద్యతసమస్యాగీత
    గాయనావీననాటకవిభేద

(22 పేజీ-చూడుడు)

నేటి ప్రపంచం

(5-వ పేజీ తరువాయి)

బడింది. రష్యను ఈనిర్ణయాల్ని తుచ తప్పకుండా అనుసరించారు.

రష్యాపారిపోయిన లై లైసాన్ రష్యన్ సైన్యాలతో కలిసి మంచూరియా వచ్చాడు. రష్యన్ సైన్యాలు విడిచివెళ్లగానే మంచూరియా లై లైసాన్ హస్తగతమయింది. 1948 లో రెయినాన్ తిరిగి వశమైనది మొదలు చీనా కమ్యూనిస్టుల విజయాలు ప్రారంభమైనాయి. రెండేళ్లలో చీనాదేశం యావత్తూ వారికి లొంగిపోయింది. కొమింటాంగ్ పరాజయంపొంది, చియాంగ్ ఫార్మోజా పారిపోయాడు. మంచూరియా రాజధాని ముక్డెన్ 1948 అక్టోబర్‌లో కమ్యూనిస్టుల వశమయిందిమొదలు చకచకా దేశాన్ని ఆక్రమించడం ఆరంభించారు. 1949 జనవరి 15 వ తేదీని టీంట్సిన్ నగరం, జనవరి 22 వ తేదీని పెకింగ్ నగరం (పూర్వ మంచూ చక్రవర్తుల రాజధాని), ఏప్రిల్ 23 వ తేదీని నాంకింగ్ (చియాంగ్ రాజధాని), మే 16 వ తేదీని హాంకోనగరం మే 26 వ తేదీని షాంఘై, అక్టోబరు 16 వ తేదీని కాంటన్, నవంబరు 30 వ తేదీని చుంకింగ్ కమ్యూనిస్టుల వశమైనాయి. కమ్యూనిస్టులు వెన్నాడి తరుముతుండగా కొమింటాంగ్ ప్రభుత్వం నాంకింగ్‌నుంచి కాంటన్‌కీ, కాంటన్‌నుంచి చుంకింగ్‌కీ, చుంకింగునుంచి చెంగ్టూకీ మారింది. చివరికి కమ్యూనిస్టులు చెంగ్టూనగరాన్ని సమీపిస్తున్నందువల్ల కొమింటాంగ్ ప్రభుత్వం చీనా విడిచిపెట్టి ఫార్మోజాకు పారిపోయింది.

చియాంగ్ ఈ సంవత్సరం పెకింగ్ నగర పతనం అనంతరం చీనాఅధ్యక్షపదవినుంచి తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించాడు. లై చంగ్ జెన్ తాత్కాలికాధ్యక్షుడుగా పనిచేశాడు. రాజధానీనగరం చుంకింగ్ చేరిన తరువాత, కమ్యూనిస్టులు చుంకింగ్ పైకి దాడి వస్తున్నారని తెలిసి లై చంగ్ జెన్ హాంకాంగ్ పారిపోయాడు. చియాంగ్ ఫార్మోజాదీవిలో నివాసంనుంచి చుంకింగ్ వచ్చాడు. లై చంగ్ జెన్ తిరిగి రాలేదు. జాతీయప్రభుత్వానికి సహాయంనిమిత్తమని మిష పెట్టి అమెరికా వెళ్లిపోయాడు. చియాంగ్ చుంకింగ్‌నుంచి చెంగ్టూ వెళ్లగానే డిసెంబరు 5 వ తేదీని తిరిగి జాతీయప్రభుత్వానికి అధ్యక్షుడైనాడు. చెంగ్టూ నగరాన్ని 7 వ తేదీని విడిచిపెట్టి ప్రభుత్వం ఫార్మోజా చేరింది. చెంగ్టూ రేపోమాపో కమ్యూనిస్టుల వశమౌతుంది.

షాంఘై తరవాత ఏ నగరంలోనూ కమ్యూనిస్టుల నెదిరించి జాతీయసైన్యాలు పోరాడలేదు. ఇప్పుడు, యూనాన్ రాష్ట్రం అంతా ఒక్కసారిగా కమ్యూనిస్టుల పక్షానికి తిరిగిపోయింది. ఇంక కమ్యూనిస్టులు ప్రవేశించని రాష్ట్రం సైకాంగ్ ఒక్కటే మిగిలింది.

జాతీయసైన్యాలలో మంచి తరిఫీదుపొందిన దళాల్ని ఇదివరకే (అనగా షాంఘై యుద్ధ సమయంలో) చియాంగ్ ఫార్మోజాదీవికి తరలించాడు. ఇంకా జాతీయప్రభుత్వంపట్ల విధేయత గలిగిన సైన్యాలు సుమారు పదివేల మందిని చియాంగ్ సైకాంగ్ రాష్ట్రాని పంపాడు. అక్కడ వారు గొరిల్లాయుద్ధం సాగించగలరని ప్రకటించాడు. చీనాలో ఇంకా కమ్యూనిస్టులు ఆక్రమించుకోవలసిన ప్రాంతం చాలా ఉన్నప్పటికీ జాతీయవాదుల ప్రతిఘటన నిలిచిపోయింది. ఇంక కమ్యూనిస్టులు దేశం అంతటినీ ఆక్రమించి పరిపాలన సుస్థిరపరుచుకోవడమే తరువాయి.

అనేకమంది అనేక శతాబ్దాలుగా చీనానంతటినీ ఒక కట్టులోకి తెచ్చి సమగ్రంగా పరిపాలించాలని యత్నించి విఫలులైనారు. ఇప్పుడు కమ్యూనిస్టులు దేశాన్నంతటినీ తమ అదుపులో ఉంచుకో గలరో లేరో చూడ్డానికి పాశ్చాత్య ప్రపంచం వేచిఉంది. కమ్యూనిస్టుల పరిపాలన సుస్థిరపరుచుకోకుండా చెయ్యడానికి కొమింటాంగ్ నాయకులు తమ సైనికుల్ని ఆయుధాలిచ్చి దేశంలో విడిచిపెట్టారు. వారింక గొరిల్లాచర్యలు ప్రారంభించవచ్చును; ప్రారంభించలేకపోవచ్చును. కాని గ్రీస్‌లో గొరిల్లాలపైన గొరిల్లా చర్యలు జరిపి విజయంపొందిన ప్రభుత్వకృషి, అమెరికన్ సైనికసహాయం అమెరికాకు ఆశగొలుపుతున్నాయి. అదే విధంగా చీనాలో కమ్యూనిస్టుల పరిపాలనను భగ్నంచెయ్యడానికి అమెరికా సహాయం చేస్తుందని చియాంగ్ ఆశిస్తున్నాడు. ఇటీవల ట్రూమన్ అన్యదేశాలకు సైనికసహాయంనిమిత్తం ధనాన్ని ఏర్పాటు చేసినప్పుడు, చీనాకు కూడా కొంత ధనం ప్రత్యేకించాడు. ఈ ధనాన్ని ఎలా వినియోగించదలిచారో తెలపకుండా అమెరికన్ ప్రభుత్వం అతిరహస్యంగా ఉంచింది. ఈ ధనాన్ని చీనాలో గొరిల్లాలను బలపరచడానికీ ఫార్మోజాద్వీపాన్ని బలపరచడానికీ వినియోగిస్తారని కొన్ని అమెరికన్ పత్రికలు చెపుతున్నాయి.

ఫార్మోజా, టిబెట్ :

ఇంక ఫార్మోజా టిబెట్‌ల భవిష్యత్తును గురించిన ఆలోచన ప్రారంభమయింది. ఫార్మోజాను ద్వితీయప్రపంచ సంగ్రామంఅనంతరం జపాన్‌వారివద్దనుంచి విడిపించి చీనాకు ఇచ్చారు. చీనాప్రభుత్వం ఆ ద్వీపానికి తైవాన్ అని పేరుపెట్టింది. ఇప్పుడు చియాంగ్ తన సైన్యాన్ని దాదాపు లక్షమందిని అక్కడ నిలవరించాడు. ప్రభుత్వ కార్యాలయాన్ని అక్కడికి మార్చాడు. చీనా కమ్యూనిస్టునాయకుడు ఫార్మోజా, టిబెట్‌లు చీనాకు చెందినవేననీ, వానినికూడా కమ్యూనిస్టులు ఆక్రమించగలరనీ ఇదివరలో ప్రకటించాడు.

టిబెట్‌కు సంబంధించినంతవరకూ, అది 1918 లో ఆంగ్లో-చీనీస్ ఒడంబడికప్రకారం చీనాఅధికారానికి లోబడి ఉండాలని నిర్ణయించబడింది. ఆ ఒడంబడికను ఉభయరాజ్యాలూ అంగీకరించినప్పటికీ చీనాప్రభుత్వం అధికారరీత్యా ఆమోదించినట్లు ప్రకటించలేదు. కాని టిబెట్ చీనాలో అంతర్భాగంగానే పరిగణించబడుతూ వచ్చింది. చీనారాజకీయాల కల్లోలంవల్ల ప్రభుత్వం తన అధికారాన్ని టిబెట్‌పైన వాస్తవంగా చలాయించలేకపోయింది. అందువల్ల టిబెట్ పేరుకి చీనాలో అంతర్భాగంగానే ఉన్నప్పటికీ, సర్వస్వతంత్రంగా టిబెట్‌వాసులే పరిపాలన నిర్వహించుకుంటున్నారు. ఇప్పుడు కమ్యూనిస్టులు టిబెట్‌పైన తమ అధికారాన్ని స్థిరపరుచుకోదలిస్తే ఎవరూ ఆక్షేపించడానికి వీల్లేని స్థితి వచ్చింది. భారతదేశం సరిహద్దున ఉన్నందువల్ల టిబెట్‌పరిస్థితిని గురించి భారత ప్రభుత్వం ఏ వైఖరి అవలంబిస్తుందోనని బ్రిటన్ అమెరికాలు కనిపెట్టి చూస్తున్నాయి. టిబెట్‌పై చీనాకు పరిపాలనాధికారం ఉందని అంగీకరిస్తున్నట్లు పండిట్ నెహ్రూ ఇటీవల స్పష్టంగా ప్రకటించారు.

కమ్యూనిస్టులు టిబెట్‌మతపాలకుల్లో ఒకరిని చేరదీసి ప్రస్తుతపాలకుని పదవీచ్యుతిని చెయ్యగలరని ప్రకటించారు. కమ్యూనిస్టులవద్ద ఉన్న పంచన్‌లామా టిబెట్‌పరిపాలనాధికారం తనదేకాని ప్రస్తుతం అధికారంలో ఉన్న దలైలామాదికాదని వాదిస్తున్నాడు.

ప్రపంచానికి ఇంటికప్పు వంటిదని టిబెట్‌కి పేరు. టిబెట్‌కు వెళ్ళాలంటే ఒక్కటేమార్గం ఉంది. అది భారతదేశంలోనుంచే ఉంది. చీనానుంచికూడా టిబెట్ వెళ్లడానికి అదొక్కటే మార్గం. టిబెట్‌కు వేరేమార్గం ఏర్పాటు చేసి రాగలరని కమ్యూనిస్టులంటున్నారు.

ఫార్మోజా ద్వీపానికి సర్వస్వాతంత్ర్యం ఇవ్వాలని కొందరూ, జపాన్ సంరక్షణకి (తద్వారా అమెరికన్ సైన్యాల సంరక్షణకింది కి) తేవాలని కొందరూ సూచిస్తున్నారు. అమెరికన్ సైన్యాలు ఆక్రమించడం అవసరమని మరికొందరంటున్నారు. ఫిలిప్పైన్స్, కొరియాల సహాయంతో ఫార్మోజాను రక్షించడానికి చియాంగ్ ప్రయత్నిస్తున్నాడు. అందువల అమెరికన్ సైనిక ఆక్రమణ ఇప్పుడవసరం ఉండకపోవచ్చును. కాని ఫార్మోజా రాజకీయ స్థితిలో వెంటనే మార్పు తీసుకురావాలని అమెరికా ప్రయత్నిస్తోంది.

ఐక్యరాజ్యసమితి చర్చ :

1945 లో చీనాతో చేసుకున్న ఒడంబడికను రష్యా అతిక్రమించి చీనా కమ్యూనిస్టులకు స్వయంగా సహాయంచేసిందనీ, మంచూరియాలో కొమింటాంగ్ ప్రభుత్వస్థాపనకు అవకాశం లేకుండాచేసిందనీ, చీనా విషయంలో రష్యా ప్రవర్తన ఐక్యరాజ్యసమితిసిద్ధాంతాలకి విరుద్ధంగా ఉందనీ ఐక్యరాజ్యసమితిలో చీనా ప్రతినిధి రష్యాపై ఫిర్యాదు తెచ్చాడు: ఫిర్యాదును చర్చించినప్పుడు రష్యన్ ప్రతినిధి వైషిన్స్కీ, తూర్పు యూరప్ ప్రతినిధులు సమితినుంచి లేచిపోయారు.

కమ్యూనిస్టు చీనా ప్రభుత్వాన్ని గుర్తించవద్దనీ, వారికి ఆర్థికంగాగాని ఇతరత్రాగాని ఏ దేశమూ సహాయం చెయ్యరాదనీ అన్ని దేశాలకూ ఐక్యరాజ్యసమితి ఆదేశించాలని చీనా తన తీర్మానంలో ప్రతిపాదించింది. ఈ తీర్మానానికి ఆంగ్లో-అమెరికన్ దేశాలు అంగీకరించలేదు.

కాని అమెరికన్ బ్రిటిష్ ప్రతినిధులు చర్చ సందర్భంలో రష్యాను తీవ్రంగా విమర్శించారు. చీనాలో వ్యవహారాలలో ఏ దేశమూ జోక్యం చేసుకోకూడదనీ చీనా దేశాన్ని విభజించడానికి ఎవరూ ప్రయత్నించకూడదనీ, చీనాలో ఏ కొన్ని ప్రాంతాలలోనూ పరపతి ఆర్జించుకోడానికి ఎవరూ ప్రయత్నించకూడదనీ అన్ని దేశాలకూ సూచిస్తూ ఒక తీర్మానం ఆమోదించబడింది. చీనా ప్రతినిధి ఫిర్యాదులో ఎంతవరకూ సత్యమున్నదో (అనగా రష్యాజోక్యం ఎంతవరకూ ఉన్నదో) పరిశీలించవలసిందని సర్వసభ్యసమావేశపు ఉపసంఘానికి సమితి ఒప్పగించింది.

కాని సమితిలో చీనా ప్రతినిధిఫిర్యాదుపై చర్చ జరుగుతుండగా జాతీయప్రభుత్వం చీనా దేశాన్ని విడిచి పారిపోయింది. ఇప్పుడు చీనా ప్రతినిధి ఇంకా సమితిలో సభ్యత్వానికి అర్హుడౌనో కాదో ఆ సమస్య తేలవలసిఉంటుంది. అప్పుడే చీనా కమ్యూనిస్టుప్రధాని చౌ ఎన్ లై తన ప్రభుత్వాన్ని గుర్తించి తన ప్రభుత్వానికి సమితిలో సభ్యత్వం ఇప్పించాలనీ, జాతీయ ప్రభుత్వ ప్రతినిధికి సమితిసభ్యత్వం రద్దుపరచాలనీ కోరుతూ ఐక్యరాజ్యసమితి కార్యాలయానికి ఒక లేఖ పంపాడు. బహుశా ఈ లేఖ భద్రతామండలిలో చర్చకు రావచ్చును. అలా చర్చకు వచ్చేలోగా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గుర్తించాలని భారతప్రభుత్వం, ప్రయత్నిస్తోంది. జాతీయప్రభుత్వానికి చీనాభూభాగంలో స్థానభ్రష్టత ప్రాప్తించినపక్షంలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అమెరికా గుర్తించగలదని అమెరికన్ విదేశాంగ కార్యదర్శి డీన్ ఆచిసన్ ఇటీవల అన్నాడు. అప్పుడే అమెరికాకు గుర్తించడం ఇష్టంలేదు. కాని ఎప్పటికైనా గుర్తించక తప్పదని అందరికీ తెలిసినదే. బ్రిటన్ గుర్తించడానికి త్వరపడుతోంది. బ్రిటన్‌కి చీనాలో బిలియాన్ డాలర్ల ఆస్తి ఉంది. అందువల్ల బ్రిటన్ ఆట్టే ఆలస్యం చెయ్యదని తెలుస్తోంది. బ్రిటన్ గుర్తించడంతో ఇంక అమెరికా ఆలస్యం చెయ్యడం అసాధ్యం.

[సూర్యనారాయణ]

విజ్ఞాన విశేషాలు

(17 వ-పేజీ తరువాయి)

సుండా నరాలు, వాయునాళాలు అల్లుకుని ఉంటాయి. కాంతి మెరిసినప్పుడు బహుశా వాయునాళాలు ఉబుకుతాయి కాబోలు. పూసలమీదనుంచి ఆమ్లజని (ఆక్సిజన్) విసురుతుంది. దానితో పూసలు వెలుగుతాయి—కట్టెపైన ఊదినప్పుడు మంట వచ్చినట్లు.

పురుగుపొట్టనుంచి ఆ పూసల్ని కోసి స్వచ్ఛమైన ఆమ్లజనిలో వేస్తే కొంతసేపటివరకూ వెలిగి ఆరిపోతాయి. ఆరిపోయినప్పుడు ఆ పూసల్లోని ఏదో పదార్థం అయిపోయిందన్నమాట. ఆ తెలియని పదార్థంలో వెలుగుకి రహస్యమేదో ఇమిడిఉందన్నమాట. జీవశాస్త్రజ్ఞులు ఈ పురుగుల్లో ఏదో మండే పదార్థం ఆమ్లజనితో కలవగలిగే పదార్థం "లూసిఫెరన్" ఉందని చెప్తారు. అయితే అదికూడా పూసల్లో ఉండే "లూసిఫెరేజ్" అనే పదార్థంతో ఆమ్లజని కలిసినప్పుడే వెలుగు వస్తుంది. ఈ రెండోపదార్థం మొదటిదాన్ని శుభ్రపరుస్తుంది కూడా. మొదటి రకంపదార్థం అనగా లూసిఫెరన్ ఆమ్లజనితో కలిసి పూసలపైన వాని మిశ్రమపదార్థం పేరుకున్నప్పుడు ఈవిధంగా శుభ్రపరచడం అవసరమవుతుంది.

అయితే ఈ వెలుగెందుకు? ఈవెలుగువల్ల మిణుగురుపురుగుకి ఏమి ప్రయోజనం అని పరిశీలిస్తే సమాధానం తెలియదు. ఉత్తరమెరికాలో పరిశోధకులు పరిశోధన చేశారు. మగపురుగు ఆడపురుగు సంజ్ఞలుచేసుకోడానికిది తప్పకుండా ఉపయోగపడుతుందని తేల్చారు. కానిఇక్కడా ఒక చిక్కుంది. కొన్నిరకాల మిణుగురుపురుగులు పెద్దవైనతరవాత వానికి వెలుగుండదు. పసిపురుగులకే ఉంటుంది. అందువల్ల ఈరకం పురుగులికి వెలుగు పైరీతిగా ఉపయోగపడదని తెలుస్తుంది. మరికొన్నిరకాల పురుగులు పెట్టే గుడ్లు మెరుస్తూ ఉండడం చూస్తే పరిశోధనంతా అయోమయంలో పడిపోతుంది. కొన్ని పురుగులు శత్రువుల్ని భయపెట్టి తరిమివెయ్యడానికి వెలుగునుపయోగిస్తాయి. మిణుగురుపురుగుల్ని కప్పలు అధికంగా తింటాయి. కప్పలకి మిణుగురుపురుగుల వెలుగంటే భయంలేదు. కొన్ని కప్పలు గబగబా మిణుగురు పురుగుల్ని మింగడంవల్ల పొట్టలో వాని వెలుతురు అప్పుడప్పుడూ పైకి కనిపిస్తుంది.

మిణుగురుపురుగుల్లో అనేక రకాలున్నాయి. కొన్నిటికి కాంతి అధికంగా ఉంటుంది. కొన్నిటికి తక్కువగా ఉంటుంది. కొన్ని మెల్లిమెల్లిగా మెరుపులు విసుర్తాయి. కొన్ని గబగబా విసుర్తాయి. వెస్టు ఇండీస్‌లో పురుగులు పెద్దవి. మన కళ్లకు పెద్దనక్షత్రాలతో వాని వెలుగు పోటీ చెయ్యగలరు. 1898 లో క్యూబాలో యుద్ధం జరిగినప్పుడు గాయపడిన ఒక అమెరికన్ సిపాయికి డా॥ విలియంగార్గస్ ఆపరేషన్ చెయ్యవలసివచ్చింది. ఆపరేషన్ జరుగుతున్న మధ్యలోగదిలో దీపం ఆరిపోయింది. ఒక సీసా నిండా పెద్ద మిణుగురుల్ని పట్టి తీసుకొచ్చారు. వేరే దీపం అక్కర్లేకుండా అప్పుడు ఆపరేషన్ జరిగిపోయింది.

జెమైకాలో మిణుగుర్లు మరీ పెద్దవి. తాటిచెట్లలో అవి చేరినప్పుడు తాటికాయలు మండుతున్నట్లు కనిపిస్తాయట. వాని వెలుగు అరమైలు దూరానికి కూడా స్పష్టంగా కనిపిస్తుందట.

మిణుగురుపురుగుల అందం చూడాలంటే సయాంలో చూడాలి. అక్కడ నదిపొడుగునా ఉన్న చెట్లపైన పురుగులన్నీ చేరతాయి. గతి తప్పకుండా అన్నీ ఒకేసారి మెరుస్తాయి. అన్నీ ఒకేసారి ఆరిపోతాయి. అంటే నదిపొడుగునా చెట్లలో చెట్ల గుబుర్లన్నీ కొంతసేపు వెలిగి మళ్ళీ చీకట్లో మూసుకుపోతాయి. మళ్లీ మెరుస్తాయి. ఈరీతిగా రాత్రి 8 గంటలనుంచి తెల్లవారుజాము 3 గంటలవరకూ జూలైనుంచి సెప్టెంబరువరకూ సయాంలో నదీతీరాలు కన్నులపండువుగా ఉంటాయి.

అమెరికాలో మిణుగుర్ల ఋతువు జూన్‌నుంచి ప్రారంభమై ఆగస్టునెలమధ్యలో ముగుస్తుంది. అయితే, ఆగస్టు తరవాత అవేమౌతాయి? ఎవరూ కనిపెట్టినట్లు కనిపించదు. ఋతువుఆఖరున కలపపైనా చెట్లపైనా గుడ్లుపెట్టి మాయమౌతాయి. తిరిగి వచ్చేవేసవికోసం ఈవింతతారల్ని చూడ్డానికి నిరీక్షించాలి.

(డి. సి. పెటీ.)

కులాసాకబుర్లు :

ఆంధ్రుల అజ్ఞాతవాసం

[శ్రీ జి. యస్. సూరి]

ఆంధ్రరాష్ట్రంకోసం ఆర్భాటపడుతున్న ప్పటి ఉత్సాహం మలుపుదాకా వచ్చిన దశేసరికి మందగించింది. ఇన్నేళ్లుగా ఒంటి కాలిమీద చేసిన తపస్సు నెలాఖరులోగా ఫలించబోతున్నందుకు ప్రతి తెలుగువాడూ ఛంగణాలుతీయవలసిన పరిస్థితి ఇది ఓపిక ఉంటే తెందవాలు ఆడవలసిన కాలం. ఒళ్లు పెరిగి వీరంగం వేయవలసిన సమయం. అటేమీ గ్రహాచారమోగాని దివిటీతో వెతికినా సంబరం ఎక్కడా కనబడదు. 'రేడియో' తో ఆలకించినా జయధ్వానాలు ఎక్కడా వినబడవు.

చిరునవ్వులతో చిందులు తొక్కవలసిన నాయకులు చిరుబుస్సులతో చీకాకుపడు తున్నారు. గొంతు చలుగురా చేదాకా కోలాహలం చెయ్యవలసిన పౌరులు మూగనోము పట్టి ముడుచుకు కూర్చున్నారు. పారవశ్యంతో పట్లుకొట్టవలసిన కుర్రకారు పాలుమాలి పరాకుచి తగిస్తున్నారు.

ఈ నిరుత్సాహానికి కారణాలు లేకపోలేదు. ఎక్కడో మలయా దేశందగ్గర బయలుదేరిన తుఫాను అటుతిరిగీ ఇటుతిరిగీ రాబోయే రాష్ట్రం ఎట్లా ఉన్నదో చూచిపోదా మన్నట్లు మన జిల్లాలమీదికి దూకింది. ఊరూరూ, పల్లెపల్లే పర్యటనంచేసింది. పూరిపాకలు మొదలు మూడు అంతస్తుల మేడలవరకు సందర్శించింది. తోట్టిలో పాపాయిమొదలు గాటిదగ్గర దూడబుజ్జాయి వరకూ పరామర్శించింది. పైరులు, తోటలు ఏవిధంగా ఉంటాయో అని తనిఖీ చేసింది. ఈ దిగ్విజయయాత్రలో చూసినవాటినన్నిటినీ ధృతరాష్ట్రుడు భీముడి ఉక్కు ప్రతిమను చూర్ణం చేసినట్లు హూనాహూనం చేసి వెళ్లిపోయింది. ఆ తుఫానుదెబ్బకు ఉడ్డుకుచుకున్న జనాభా ఇంతవరకూ తెప్పరిల్లుకోలేదు.

ఇక మరోకకారణం మద్రాసు. న్యాయ ప్రకారం ఆంధ్రరాజులదగ్గరనుంచి మనకు సంక్రమించవలసిన చన్నపట్నం నిష్కారణంగా మనకు గాకుండాపోయింది. ఒక చిన్న బెస్త ఊరిని ఇంగ్లీషువారి మద్దతుతో తెలుగువారి కష్టంతో బ్రహ్మాండమైన పట్నంగా పెంచి పెద్దచేశాం, అరబ్బీవాడి డేరాలో జొరబడిన ఒంటెమాదిరి బ్రతుకు తెరువులకోసం ప్రవేశించిన సాంబారు దేశస్థులకు యావత్తూ ఒప్పగించాం. తట్టాబుట్టా సర్దుకుని కట్టుకుని ఏ పూరిలో దస్త్రం పెట్టి వ్యవహారం జరుపుకుందామని వెతుకుతుంటూ బయలుదేరాం.

ఇక మూడవకారణం మన నాయకుల తొత్తరం. రాజాజీగారి ఖుద్దున వ్రాసిన త్రిమూర్తిపథకంమీద సంకోచం లేకుండా సమ్మతితో సంతకం చేశారు రాష్ట్రపతి పట్టాభిగారు. చన్నపట్నం విషయంలో ఈ పథకం మనకు చేసిన అన్యాయానికి మన రాష్ట్రం యావత్తూ కుమిలిపోతుంటే మాట్లాడకుండా ఊరుకున్నారు. గట్టిగా ఎవరైనా ఆందోళన చేస్తే మందలించారు. చివరకు ఒక నిర్ణయానికి రాబోతున్న సమయంలో చన్న పట్నంమీద మనల్ని హక్కులు వదులుకో మన్నారుగాని తమిళులకు ఇచ్చివేస్తున్నామని ఎక్కడ చెప్పలేదని గీతకు భాష్యం చెప్పారు. వీరు ఇచ్చిన హామీవల్లనైతేనేమి, కాంగ్రెసు హైకమాండువారి బెదిరింపులవల్లనైతేనేమి, మన రాష్ట్రనాయకుల మధ్య కలతలవల్లనైతేనేమి ఆ చాణక్యపథకానికి సరేనని ఒప్పుకున్నాము. తలకాయ లేని కళేబరాన్ని స్వీకరించటానికి సిద్ధంఅయినాము. ఇక పట్టాభిగారు అన్న మాట ఎట్లా నెగ్గించుకుంటారో చూడాలి.

ఇక పంపిణీల వ్యవహారం మొదలుపెట్టారు. తెలుగువాళ్ల తరఫున ఒక చతుష్టయాన్ని నియమించారు. వీరిలో ఇద్దరు మంత్రులు, ఒకరు మాజీ ప్రధాని, ఒకరు కాంగ్రెసు కార్యదర్శి. ప్రకాశంపంతులుగారినహా మిగతావారు, అందులో ముఖ్యంగా మాజీ రివెన్యూమంత్రీ ప్రస్తుత ఖజానామంత్రీ మనం మద్రాసును వదులుకునేందుకు హుషారుచేసినవాళ్లే. తమిళ సోదరుల మన్ననలకు పాత్రులైనవాళ్లే ఈ సంఘంలో కామరాజనాడారు లేదుగాబట్టి ఆచార్య రంగా ఉండనక్కరలేదని ఎవరైనా అనవచ్చు. పోనీలే అని ఒప్పుకుందాం. టి. టి. కృష్ణమాచారిగారికి స్థానం ఇచ్చినప్పుడు అనంతశయనంగారికి ఎందుకు ఇవ్వకూడదు? మద్రాసురాష్ట్రానికి ప్రధానకార్యదర్శిగా పనిచేసి సర్వం ఎరిగినవాడుగదా కొంత రామమూర్తిగారికి ఆఖరుకు ఉపసంఘాలలోనైనా స్థానం ఎందుకు ఇవ్వకూడదు? వీరికి చోటు చూపించవలసినదని హెచ్చరించటంలో ఇప్పుడు ఉన్నవారు అసమర్థులనీ మనకు అన్యాయం చేస్తారనీ చెప్పటంకాదు. వీళ్లుకూడా ఉంటే బోల్తాకొట్టి జాం దనపడం లే అని మరంత ధైర్యంగా ఉండేవాళ్లం.

తీరా పంచుకోటానికి వచ్చేసరికి లెక్కలు చూస్తే తమాయించవలసివస్తుంది రాష్ట్రానికి నిలవ 45 కోట్ల రూపాయలుట. దీనిలో మనకు నూటికి 38 వంతులు ఇస్తారు. రాష్ట్రానికి అప్పు 31 కోట్లుట. దీనిలో మనవంతు బహుశా సగం వేస్తారేమో! చన్నపట్నంలోని మిగులు ఆదాయంలో మనకు భాగం లేదుట. ఇక సిబ్బంది విషయం చిత్తగించండి. ఇప్పటి సెక్రెటేరియట్‌లో దాదాపు వెయ్యిమంది ఉద్యోగస్థులు ఉన్నారు. వీరిలో తెలుగువాళ్లు 244 మంది మాత్రమే. దామాషాప్రకారం ఉండవలసిన తెలుగు ఉద్యోగుల లెక్క గట్టి మనకు ముదరా వచ్చేట్లు మన ప్రతినిధులు పట్టుబట్టాలి. ఇక హైకోర్టు వ్యవహారం చూడండి హైకోర్టులో ఉండే కేసులు సగానికి పైగా తెలుగుదేశంనుంచి వచ్చినవే. అయినప్పటికీ అక్కడ పనిచేసే అయిదు వందలమందిలోనూ యాభైమందిమాత్రమే తెలుగువాళ్లు. వీరివిషయంలోగూడ ముదరా అడగాలి. లేకపోతే ఇన్నాళ్లూ మనకు జరిగిన అన్యాయం తొలిగిపోదు. మొత్తంమీద ఉద్యోగుల కొరత మనం త్వరలో పూర్తిచేయవలసి ఉంటుంది. అయితే ఉద్యోగాలను ఇవ్వటంలో ఆంధ్రరాష్ట్రం కమ్యూనల్ ప్రణాళికను అనులు పరుస్తుందా శక్తిసామర్థ్యాలనే పరిగణిస్తుందో చూడదగిన విషయం.

ప్రస్తుతపరిస్థితులలో మనకు రాజధానినగరం పెద్దసమస్య అయింది. క్రొత్తనగరం నిర్మించటానికి తాఖత్ లేదు. సికిందరాబాదు ఇప్పట్లో మనకు వచ్చే అవకాశం కనబడదు. విజయవాడ లాంటి నగరానికి పోదామా అంటే అక్కడ ఉన్న జనానికే ఇళ్లు చాలక యమయాతన అనుభవిస్తున్నారు. అటువంటప్పుడు ఊరిమీద ఊరు వచ్చిపడితే ఎట్లా ఉంటుందో ఊహించవలసినదే. ఆవడి మిలిటరీక్యాంపుకు తరలిపోదామా అంటే అటు కేంద్రప్రభుత్వంవారు, ఇటు తమిళప్రభుత్వంవారు ఒప్పుకోవాలి. ఈలోపుగా డేరాలను తయారుచేసుకుంటే మంచిది. లేదా ఊరికొక ఆఫీసును రవాణాచేయాలి.

ఇవన్నీ ఇంత గొడవగా ఉన్న సందర్భంలో ప్రతిగ్రామంవారూ రాజధానిని మావూళ్లో వుంచమని తీర్మానాలను ప్యాసుచేసి పత్రికలలో ప్రకటిస్తున్నారు, వెనుకా ముందూ చూడకుండా ఆహ్వానాలను అందచేస్తున్నారు. ఇది ఇట్లా ఉండగా రాయలసీమవారికి ఏమి కావాలో ఇంతవరకూ తేల్చి చెప్పలేదు. శ్రీబాగ్ ఒడంబడికప్రకారం రాజధానిలో హైకోర్టో అక్కడికి మంజూరుచేయాలి. ఏమి కావాలో కోరుకోమన్నప్పుడు దావాలకార్యాలయం మాకు అక్కరలేదు పరిపాలనాకార్యాలయం ఇవ్వమని బుద్ధిమంతులైనవాళ్లు అడిగి తీరుతారు. అప్పుడు సర్కారువాళ్లు ఏమంటారో చూచితీరాలి. వసతి దొరికేదాకా మనల్ని మద్రాసులో మాత్రం మనతమిళసోదరులు ఉండనివ్వరు.

ఈలాంటి పరిస్థితులలో రాష్ట్రం వస్తున్నదని గంతులు వేయమంటే ఎవరికి ఉత్సాహం ఉంటుంది? చిందులుతొక్కటానికి ఎవరికి సరదా కలుగుతుంది? జై జై అనటానికి ఎవరికి పికపలుకుతుంది? వీరంగం వేయటానికి ఎవరికి ఆవేశం వస్తుంది? ఆంధ్రులకు ఇప్పటికి అరణ్యవాసం పూర్తిఅయింది. ఇంకాకొంతకాలం అజ్ఞాతవాసంచేయవలసిఉన్నది. చివరకు యుద్ధం లేకుండా పోతే కృతార్థులమే

చంద్రగ్రహణం

(18 వ-పేజీ తరువాయి)

"అది నాయిష్టం!"అని గర్వంగా అంది ఇల.

అంటుండగానే దూరంనుంచి శంఖారావాలు వినిపించినయ్. ఆశ్చర్యంతో సేనాని కిటికీలోంచి చూశాడు. చెట్ల గుబుర్లచాటునుంచి ఇంటికి మరలివస్తున్న ఆగ్నేయుల జెండాలు గాలిలో ఎగురుతూ కనిపించినయ్. ప్రద్యుమ్న సేనాని రెండుచేతులతోనూ తల నొక్కుకుంటూ గట్టిగా నిట్టూర్చి "మఘవమహారాజు తిరిగి వస్తున్నాడు. ఇక నా బాధ తీరింది" అన్నాడు. గబగబా వెళ్లిపోబోయాడు. వెనకనించి సౌమ్యకంఠస్వరంతో "అయితే నా బాధా తీరిందన్న మాటే! నా విముక్తికను చూపు మేరలోకి వచ్చింది" అని ఇల అనటం వినిపించి వెనక్కి తిరిగాడు. ఇందాకటిలాగే జడ సవరించుకుంటోంది. పెదిమలమీదమాత్రం బాధతో నిండిన చిరునవ్వు కనిపిస్తోంది. దగ్గరికి వెళ్లి "ఇలా! నామాట విను. అనవసరంగా సాహసం చెయ్యబోకు. మఘవుడుమంచివాడు. పెళ్లిచేసుకున్నాక ఆసంగతి నీకే తెలుస్తుంది తొందరపడి సాహసించవద్దని బతిమాలుకుంటున్నాను" అన్నాడు సేనాని

'నేను తొందరపడి ఏపనీ చెయ్యను. నేను అనాగరికురాలిని కాను. కోదండరాజుకూతుర్ని. బలాత్కరించి మఘవుడు పెళ్లిచేసుకోదలిస్తే మటుకు నా ప్రాణం వుండగా ఒప్పుకోను. నా శవాన్ని పెళ్లాడవలసిందే" అంది.

ఇంతలో మఘవుడు వచ్చి "నేను వాళ్ళ పొగరు సాంతం అణచలేకపోయాను. పౌరుషం వస్తే ప్రచండంగా పోట్లాడుతారు. చివరికి వాళ్లతో సంధి చేసుకుని వచ్చాను" అన్నాడు.

"సంధిషరతు లేమిటి రాజా?" అని ప్రద్యుమ్న డిగాడు మఘవుడు పగలబడి నవ్వాడు "భలే షరతులే. ఈ కోదండులు వింత మనుషులు. వాళ్లజాతిలో తండ్రిఆస్తి కూతురికే చెందుతుందిట. ఈ వింత ఎప్పుడైనా విన్నావా?"

"వినలేదు కాని సంధిషరతు లేమిటీ?"

"ఏముందీ? ఒక్కటే షరతు. వాళ్ల రాజకుమారిని ఎత్తుకునిరావటంవల్ల వాళ్ల ప్రతిష్ఠకి భంగం కలిగిందిట. ఆ ప్రతిష్ఠని నిలబెట్టాలంటే ఒకటే దారి వుంది. నే నామెని పెళ్లాడి తీరాలిట! కోదండరాజురాజ్యంకూడా నాకే వస్తుంది భలే షరతుకాదూ?" అని మఘవుడు పకపకా నవ్వాడు.

ఇది విని సేనాని తల వంచుకుని ఆలోచనలో మునిగి "అవును! చాలా మంచి షరతు" అన్నాడు.

"కనక ఆలస్యం పనికిరాదు. పెళ్లి వెంటనే జరిగిపోవాలి. ఆ పిల్ల కులాసాగా వుందా?"

"ఆహా"

"మన భాష నేర్చుకుందా?"

"పూర్తిగా"

"అయితే ముహూర్తం రేపే"

కొంచెంసేపు మౌనంగా వుండి "ఆ అమ్మాయికి ఇష్టమో కాదో కనుక్కో వద్దూ?" అన్నాడు ప్రద్యుమ్న సేనాని.

"అదేమీ అవసరం లేదు. ఇది రాజకీయ విషయం అంగుళంకూడా జెసకటానికి వీల్లేదు. సంధిషరతులు తూచా తప్పకుండా నెరవేర్చాలిసిందే!" అన్నాడు మఘవుడు.

ఆరాత్రి ప్రద్యుమ్న సేనాని ఇలగదిలోకి పిల్లిలాగా వెళ్లాడు.

కిటికీలోంచి వెన్నెల గదినిండా పడుతోంది. ఆ వెన్నెట్లో నేలమీద ఇల గాఢనిద్రపోతున్నది. గదిలో దీపం లేదు. మెల్లిగా దగ్గరకి వెళ్లాడు. పక్కనే కూచున్నాడు. ఊపిరి బిగబట్టుకుని ముఖంలోకి ముఖం పెట్టి చూశాడు. ఇల నిద్రపోతున్నా నయనాంచలాలలో బాష్పబిందువులు సంచలిస్తున్నయ్. కంపిస్తున్న కంఠంతో ఇల ప్రద్యుమ్నా! ప్రద్యుమ్నా! నేను చనిపోవలుచుకోలేదు నీకు అర్థంకావటంలేదా? ఏం మనిషివి నువ్వు? మూగుడివి?" అంటూ నిద్రలో కలవరిస్తోంది. "నన్ను రక్షించు, నన్ను రక్షించు" అని పలవరిస్తోంది.

ఇలమెళ్లో విషపుపూసలదండ నల్లగా మెరుస్తోంది అది తెంపివేద్దామని వచ్చిన ప్రద్యుమ్న సేనాని చప్పుడు చెయ్యకుండా దొంగలాగా తిరిగి వెళ్ళిపోయాడు.

మర్నాడు సూర్యాస్తమయం అయింది. తూర్పున పూర్ణిమనాటి నిండుబింబం ఉదయించింది. ఎప్పుడు రాత్రి వస్తుందా అని తహతహలాడుతున్న మఘవుడు "ప్రద్యుమ్నా ఏర్పాట్లన్నీ జరిగినయ్యా?" అని అడిగాడు, అన్ని సన్నాహాలూ సిద్ధమైనయ్. హోమంకూడా వెలుగుతోంది వధూవరుల ఆసనాలుకూడాఅమర్చారు. ప్రద్యుమ్నుడు చేతులు కట్టుకుని హోమగుండం కేసి చూస్తూ నిలబడ్డాడు. తెలియకుండానే లోపల్నుంచి దీర్ఘనిశ్వాసం వెలువడింది. మఘవుడు వచ్చి ప్రద్యుమ్నుడి భుజంమీద చెయ్యి వేసి తట్టేసరికి సేనాని ఉలిక్కిపడి చూపు అప్పుమీదినుంచి మరలించి తల పైకెత్తాడు. ఎదురుగా చెట్లగుబురుల చీకట్లని చీల్చుకుంటూ అపూర్వశోభతో చంద్రుడు పైకి వస్తున్నాడు. సేనాని చంద్రుడికేసి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు "సేనానీ! ఆలస్యం అవుతున్నది. ముహూర్తం దగ్గరికి వచ్చింది. వెళ్లి పెళ్ళికూతురుని తీసుకురా" అని మఘవుడు ఆజ్ఞాపించాడు.

ప్రద్యుమ్నుడు మెల్లిగా మఘవుడివైపుకితిరిగి గంభీరస్వరంతో "మఘవసేనానీ!"అనిపిలిచాడు.

విని మఘవుడు బిత్తరపోయాడు. రాజా అనిపిలిపించుకోటం అలవాటైపోవటంవల్ల అర్థంకాలేదు. కాని ప్రద్యుమ్నుడు చూస్తున్న వైపుకే తన చూపు సారించాడు. ఆకాశం నిర్మలంగా వుంది. ఏదో నల్లటి నీడ చంద్రబింబాన్ని క్షణక్షణమూ కబళించివేస్తోంది.

ప్రద్యుమ్నుడు "మఘవసేనానీ! నేను వెళ్ళి పెళ్ళికూతురుని తీసుకొస్తాను. సంధిషరతు నేను నెరవేరుస్తాను. ఇంతలో మన ఒప్పందంసంగతి ప్రజలకి విశదంగా చెప్పు" అని వెళ్ళిపోయాడు.

కొంచెంసేపు మఘవుడు రాతిబొమ్మలాగా నిలబడిపోయాడు. తరవాత దిక్కులు దద్దరిల్లేట్లు నవ్వాడు. చివరికి తనని తాను సంబాళించుకొని "ప్రద్యుమ్న మహారాజా! తమచిత్తం ప్రకారమే కానివ్వండి" అన్నాడు.

ఇల కిటికీదగ్గర కూచునివుంది. ప్రద్యుమ్నుడు రాగానే చివాలున లేచి నిలబడి "నన్ను తీసుకు పోవటానికి వచ్చావా?" అని అడిగింది.

"అవును రాణీ! మేం సంధి చేసుకున్న ప్రకారం ఆర్యరాజు నిన్ను పెళ్లాడితీరాల్సిందే తప్పదు మరి"

"ఇంతేనా? ఇంకేమైనా చెప్పేది వుందా?"

"ఇంకేముంది? పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఇప్పుడు నేను ఆర్యరాజుని, మఘవుడు నా సేనాని. అంతే!"

ఇల విస్మయంతో శిలలాగా మారిపోయింది. కొంతసేపటికి తెప్పరిల్లుకొని "నిజంగానా? నీ మాట నిజమేనా?" అని విస్తుపోతూ అడిగింది.

రాజఠీవితో ప్రద్యుమ్నుడు "అవును నిజమే. ఇప్పుడు నన్నే నువ్వు పెళ్లాడాలి. నా రాణివి అవుతావో, పూస మింగి ప్రాణంతీసుకుంటావో ఇప్పుడు వెంటనే తేల్చుకో" అన్నాడు.

కలవరింతగా వెలువడిన దుఃఖం ఇప్పుడు ఒక్కసారిగా కట్టతెగిన ప్రవాహంలాగా ఇల కాటుకకళ్లవెంట పొంగి వస్తోంది. కిటికీదగ్గర నిలబడి ప్రద్యుమ్నుడు "గ్రహణం పట్టు విడిచేదాకా నీకు వ్యవధి ఇస్తున్నాను. ఆలోచించుకో ఏదో ఒకటి త్వరగా నిశ్చయించుకో" అని గంభీరంగా అన్నాడు.

జడివానలో మెరుపు తళుక్కుమన్నట్లుగా ఇల ఒక్క నవ్వు నవ్వి "ఛో, మూర్ఖుడా!" అని మౌనంగా నిలబడింది. ఈ మౌనం అర్ధాంగీకారం అని ఎవరంటారు? ఇది సంపూర్ణాంగీకారం కాదని ఎవరనగలరు?

రుద్రమదేవి

(6-వ పేజీ తరువాయి)

స్వల్పకార్యములును నిర్వహించు కరణ మొక్కడే. అతడును ఈనాడు రాకుండుట జాయపనాయకునకు మనస్సునకు విరామ మిచ్చెను. అందుచే తాను రచించిన 'నృత్తరత్నావళి' భాగములు మరల చదువుకొని ఆలోచించుకొనుటకు తీరిక చిక్కెనని సంతోషించుచు నా పనిలో మునిగియుండెను.

• • అంతలో, బద్దెన యాతనికడకు వచ్చెను. అతనికి పల్నాటిలో పది గ్రామములు కలవు. ఆ చిన్న సంస్థానమునకు పని తక్కువ. ఆతనికిని తన ముగ్గురు కరణము లానాడు రాకుండుట విద్యార్థులకు తుపానుగాలిచే లభించిన ఆటవిడుపువలెనే భాసించెను. వెంటనే యాతడప్పుడు రచించుచున్న సుమతీశతకములోనికి పద్యములాలోచింపసాగెను. అట్లాలోచించుచునే యాతడు జాయపనాయకునియొద్దకు బోయెను.

జాయపనాయకునకు బద్దెనయందు వాత్సల్యము గలదు. ఆ చిన్నవాని వినయవిధేయతలు జాయపనాయకున కెంతయేని నచ్చెను. మరియు నాతని వయస్సువలననేమి, స్వభావమువల్ల నేమి, బిడియపడు స్వభావము కలవాడు. అతడు నలువురున్నచో మాట్లాడుటకు జంకును. కాని ఆప్తులని తెలిసినవారియొద్ద మనస్సు విప్పి మాట్లాడును. అట్టి యేకాంతగోష్ఠిలో నొక్కొక్కతరి నతడు వదరుబోతా యేమి యనునట్లుకూడ మాటాడును. జాయపనాయకునియొద్ద నాత డట్లు మనసు విప్పి మాటాడును. తనయొద్ద నట్లు నిర్భయముగా—కొంత అతిగా—మాట్లాడుటయు నలువురలో నున్నప్పుడు మౌనముద్ర వహించుటయు నతనికి బద్దెనపై ప్రీతి నతిశయింప జేసెను. వృద్ధుడును రాజబంధువును మహాపదవి వదలినవాడును విద్వాంసుడును సరసుడును ప్రేమాస్పదుడును నగు జాయపనాయకునందు బద్దెనకు మిక్కిలి గౌరవము కలదు. అందుచే తన మనస్సు విప్పి మాటాడుట కాతడు తరుచుగా జాయపను దర్శించును.

వీరిద్దరివలె ఆనాడు కరణములు రానందుకు బరువు తీరినట్లు భావించినవారు మిక్కిలి కొలదిమందియే. పలువురు దానికై యాతన యనుభవించినవారే. ముందు వారు ఎవరికివారు తమ కరణములుమాత్రమే రాలే దని తలంచి దానికి కారణములును ప్రతిక్రియలును నూహించుచుండిరి. కాని రాజధానీనగరమం దంతటను వ్యవహారశాలలకు ఆనాడు కరణములు రాలే దను వార్త నెమ్మదిగా మధ్యాహ్నము కాకముందే ప్రాకిపోయెను. ఆ వార్త యందరికి విభ్రాంతి కలిగించెను.

వారు పూర్వము కులసమ్మె లెరుగుదురు. వానికి రావలసిన కట్టడిలో లోపము జరిగినచో ఆ ఇంటికి ఆ పనివాడు పోడు. ఆ పని చేయు నా కులమువారే పోరు. గ్రామస్థు లందరు నా విషయమున వారికి విరుద్ధముగా వర్తించినచో గ్రామ మంతటను వారా సమ్మె చేయుదురు. చాకలి, మంగలి, కుమ్మరి,—ముఖ్యముగా ఈ కులముల సమ్మె లెరుగుదురు. సంఘములో వారికున్న హీనస్థితిచేత ఏ పెద్దపైననైనగాని పెద్దలపైన గాని వారికి తీవ్రముగా ఆగ్రహము కలిగినచో నది చూపుటకు ముందు వెనుకలు దూరము ఆలోచించి సమ్మె సాగించువారు. సమ్మెవరకు వచ్చినతర్వాత ఆ గృహయజమాని గాని ఆ గ్రామస్థులు గాని వెంటనే వారి కష్టము విచారించి న్యాయముగా నలుగురు పెద్దలు చెప్పినట్లు సరిచేసికొనెడివారు.

కాని ఈ సమ్మెయో ? అపూర్వము ! ఇట్టి దెన్నడు నెవ్వరు నెక్కడ నెరుగనిది ! ఇది నిష్కారణమైన సమ్మె. అదియు ఉద్యోగులది ! ఈ సమ్మె చేసినవారిలో వ్యవహారజ్ఞానము లేనివారు లేరు. అందులో చిన్నవ్రాయసగాండ్రనుండి సామంతమండలేశ్వరపదవుల నధిష్ఠింపదగినవారివరకు గలరు. ఏదో అల్పులు విధిలేక చేయు సమ్మె వీరు చేయు టేమిటి ? ఎందుకు చేసినట్లు ? ముందు వీరికీ యాలోచన ఎట్లు తట్టినది ? ఎవరు చెప్పిరి ?

ఎవ్వరికిని ఏమియు తోచలేదు. అందరును దీనినిగురించి పరిపరివిధములుగా ప్రశ్నించువారే ! ఉత్తర మిచ్చువా రొక్కరును లేరు. చిత్రముగా ఈ కరణములు ఎక్కడను కనపడనేలేదు. ఏ మైరి ? ఒకవిధమైన అవ్యక్త మగు భయము ఏకశిలానగర ప్రజలకే ఆవహించినది.

అంతలో మరి యొక వార్త ఏకశిలానగర మంతట ప్రాకిపోయెను. పైవార్తయంత చిత్రముగనే ఈ వార్తగూడ ప్రతివారును చెప్పుకొనసాగిరి. అన్ని యెడలను సమ్మె యున్నది. కాని ఇందులూరి అన్నయమంత్రిదివాణమునమాత్రము ఏమియు అలజడి లేదు. అక్కడ పని చురుకుగా యథాప్రకారము సాగిపోవుచున్నది.

మరి ఎట్లు ? ఈ వార్త నమ్మలేక జనములు వచ్చి కొంచెము దూరమున గల రాజమార్గమునకు వచ్చి అన్నయమంత్రివ్యవహారశాలవంక ఒకరి కొకరు చూపుకొనుచు అచ్చటి పని జరుగుచుండుట చూచి యాశ్చర్యపడసాగిరి.

"ఈ అన్నమంత్రి నిన్ననే రాజధానికి వచ్చినాడే ! అప్పుడే అతని కరణములను ఏవిధముగా పనిలోనికి రప్పించుకున్నాడు ? ఇతడు మహామేధావి !"

"మరి కొలనిరుద్రదేవుని దివాణముననో ? అతని దివాణములో కరణములు పని చేయుటలేదు. అత డింకను రాజధానికే రాలేదు !"

ప్రాచీనకవిశేఖరులకదనరంగములే రాజాస్థానములు:

(19-వ పేజీ తరువాయి)

భరతకళాశాస్త్రపాదార్థగుప్తను
లోమవిలోమాచలోష్ఠజిహ్వా
సదుపమాలంకృతికవిత్వసాంఖ్యయోగ
మంత్రపత్తంత్రయంత్రపార
గంతృవిజ్ఞాననిధి విజ్ఞగమున గవులు
నీప రెవ్వారు వేంకటదాససుకృతి."

అను పద్యము దెలుపుచున్నది.

ప్రభుత్వముసేయువానికి శత్రువిదళనమే మొతుము. శత్రువు లేనివాడును, శత్రువునకు భయంపడనివాడును, స్వతంత్రుడే యగును. పరరాజదుర్నిరీక్ష్యముగు రాజ్యమునకే గదా ముప్పు వాటిల్లుట. అటులనె మన వాఙ్మయమునకు నని నన్నియభట్టారక మహోపాధ్యాయుడు తన భారతమున—

"మదము కామంబు క్రోధంబు మత్సరంబు
లోభమును మోహమును నను లోని సహజ
వైరివర్గంబు నోడించినవాడ నోడుచు
నశ్రమంబున వెలుపలి యహితతతుల."

అని యయాతిచక్రవర్తి తన కుమారుడగు పూరునకు రాజ్యాభిషేకముసేయుచు జెప్పిన రాజనీతివలన దెలిపినాడు. ఈ రాజనీతి రాజమహేంద్రవరమున రాజ్యముసేయుచు దాయాదులతో దటస్థించిన యుద్ధముల గెలిచిన రాజరాజనరేంద్రు, నాస్థానమున బండితసభలో వెల్లడించినది. దీనింబట్టి యాంధ్రుల సాహిత్యగ్రంథము లరిషడ్వర్గము లనబడువాని నగ్గడించి, పరమార్థచింత దృఢపఱచి, సత్కార్యోన్ముఖు మొనర్చి, యింద్రియలోలత్వమును సమాదరణీయముగా వర్ణించిననాటి మనవారి జీవితము లెట్లుండునో యూహింప ననువగుచున్నది.

కావ్యరసాస్వాదనమును నన్నియభట్టారకాదులు "నృపవిద్య"గా బరిగణించి రని—

"శ్రీవనితావల్లభ వే
గీవిషయాధీశ కావ్యగీతప్రియ.
—భారతము, ఆ ౭,౧.

"శ్రీలలనాస్తఘనటితవి
శాలోరస్థలవివేకచతురానన వా
ణీలీలాస్పద........"
—భారతము, ఆ ౪-౧.

"విద్యావిలాసపార్థివ
విద్యాధరనిఖిలరాజవిద్యానిధి...
—భారతము, ఆ ౭,౨౯౯.

"రాజభూషణ నిత్యసత్యసరస్వతీ
విలసన్ముఖాంభోజ......"
—భారతము, ఆ ౮, 3౨౪.

అను నంకితాంకపద్యము లవగతమొనర్చుచున్నవి. ఈరీతిగ గావ్యవిద్యను నృపవిద్యావిశేషముగా నెంచుట జాళుక్యవంశవిశేషమే గాక వీరికి బూర్వులగు చోళగాంగ-కదంబ రాష్ట్రకూటాదిదాక్షిణాత్యరాజవంశములకు కూడ స్వభావమై యున్నది.

కర్ణాటకసాహిత్యమున మనలోవలె గవిత్రయ సంప్రదాయ మున్నను, మనలో నన్నియవలె బంపకవి తత్సాహిత్యమున నాదికవి యను జనశ్రుతి యున్నను, ఇప్పటికి ఆ వాఙ్మయమున నగపడునది "నృపతుంగని" కవిరాజమార్గమొక్కటియె.

ఇట్టి నృపవిద్యాగౌరవ మాంధ్రకవితకెంత ప్రాచీనమో పరికించెదము. ఒరయూరుపురాధిపులగు నన్నిచోడుడు "కుమారసంభవ" కావ్యము విరచించెనుగదా ! స్థానికచరిత్రలలో నొకదానియందు ఒరయూరిలో రాజ్యముసేసిన చోళరాజన్యుల వంశమునను ఆంధ్రకవిత్వము నృపకుమారులకు నృపవిద్యలలో నొకటియై యుండినట్లు లుట్టంకింపబడియున్నది. "చంద్రికాపరిణయము" నకు గృతిపతియగు జూపల్లి వేంకటాద్రివంశవృత్తాంతము గలదు. అందు జూపల్లివారి పూర్వులు "ఒరయూరి" లో జోళరాజుల సామంతులయి యుండినట్లును, జోళరాజులచే జూపల్లివారు గౌరవసత్కారముల నందినట్లును,—గలదు. చూడుడు.

"ఏలిక కరికాల చోళునిచే...
జాతపవారణం బందికొనుట
నాత్మ నైచక మన్నెహంవీరరాజహం
వీరులు సూడుగావింప గెరలి
యా రిపుల వధించి వారల రుధిరార్ద్ర
చర్మాళిబరిగల........
వర్ణవిలాసభా...తియు మూర్ధరుం
డములపై గుబ్బలు నమర గూర్చి
యట్టి గొడుగులు...గల్ల విదిత
ముగ బ్రతిష్ఠించికొన్న యద్భుతచరిత్ర
దీప్తులొరయూరి త్రికూటేశదేవపాద
పద్మభజనైకమతులు జూపల్లివారు"

"కవలా శంకరభైరవుల్ మునుపు వే
డ్క జ్జోళభూమి న్మహా
త్సవదంబా నొరయూరి చోళమహిభృ
త్సామంతులై కాలభై
రవదత్తోగ్రకృపాణులై బిరుదముల్
ప్రాపించి నిర్ధూతశా
త్రవులై మించిరి కంచిశాసనము లే
తత్సాక్షి యై వర్ధిలన్."

ఇంతియ కాక జూపల్యన్వయులలో బరాక్రమధారేయులే గాక సంగీతసాహిత్యరహస్యతజ్ఞులును గల రని—

"పరమేశ్వరి యగు భారతి
కరుణ వడసి వివిధశాస్త్రకవితాసంగీ
తరహస్యతజ్ఞులై పర
గిరి కీర్తుల మత్కులమున గీర్తితులెల్లన్."

అను గృతిపతివాక్యముంబట్టి విదితమగుచున్నది. ఇవ్విషయ మింకను బూనికతో శోధించినయెడల నాంధ్రకవిత్వచరిత్రను గరికాల చోళుని వెనుక కాలమునకు గొనిపోవచ్చు నని తోచెడిని.

పదియవశతాబ్దిని వేంగీమండలముననే తొల్దొల్త జలుక్యాన్వయు లీ యాంధ్రకవిత్వచరిత్రను బ్రారంభించినదిమాత్రమే కాదని నిర్ధరింపవచ్చును.

కృతిసమర్పణము సప్తసంతానములలో ముఖ్యమైనది. కావుననే కావ్యరచన పాండిత్యము యొక్క పరిపక్వఫలమని మన పూర్వులు తలచిరి. "అనిరుద్ధచరిత్ర" మందలి—

"శ్రీమంగళాద్రిలక్ష్మీనృసింహుల కటా
క్షాంచలామృతవృష్టి నంకురించి
సంగీతసాహిత్యసరససౌష్ఠవయుక్తి
శాఖోపశాఖల జాల బ్రబలి
రసికరాజన్యముఖ్యసమాజబహుమాన
సతతవసంతాభిరతి జిగిర్చి
దైవనామాంకితస్తవమనోహరభావ
పదవాక్యసుమముల బరిమళించి
యభినవస్థితి బెంపొందు నస్మదీయ
భాగధేయసారస్వతపారిజాత
తరువునకు దగు సత్ఫలోదయము గాగ
సముచితంబగు నొక ప్రబంధము రచింతు."

అను పద్యముంబట్టి ప్రబంధరచనమువలని యుపయోగము దెలియందగును.


తొలుత గీర్వాణభాషలోని వివిధశాస్త్రవిజ్ఞానమును దెలుగునందు జూపెట్టుకు జేసిన ప్రయత్నమును, అవల శృంగారరసప్రధానంబగు వివిధరససంభరితంబులగు వినూత్నకావ్యముల గీర్వాణసాహిత్యసంబంధగాథల విస్తృత మొనర్ప యత్నించుటను బిదప గదనరంగంబుల బ్రత్యహము రక్తప్రవాహమును గన్నుల గఱవు దీఱ జూచుచు బరస్పరవినాశమును లీలగా దగిలి యాత్మవినాశంబును లెక్కసేయక మత్సరగ్రస్తులై విరోధమును సాధించికొనుటయె పరమార్థ మనకొనుచు గ్రోధఘూర్ణితమానసములతో విలసిల్లు రాజన్యులకు లలితపదబంధురంబును మనోజ్ఞమును నగు ప్రేమ నుద్దీపించుటకయి వారి మనస్తత్వముల నూతగా గొని సమయాసమయముల గుఱుతెఱింగిన విద్వత్కవు లీ ప్రబంధరచనమునకు దొరకొనిరి.

కాలచక్రపరిభ్రమణమున ప్రభుత్వములు తత్స్వాతంత్ర్యములు గోల్పోయినను బూర్వపు మర్యాదలు సంప్రదాయములు నిలుపుచు వచ్చిన రాజాస్థానములలో మరల ప్రబంధరచనము, తత్ప్రవణము, పాండిత్యప్రకర్షకు నాధారములైనవి. ప్రభువుల చిత్తవృత్తుల ననుసరించి వారు కృతినందిన గ్రంథములును దేజరిల్లినవి. అవి యెల్ల నుత్సాహజనకము లయినవే !

ఇప్పరామర్శమువలన మన కవిశేఖరులు దమ పాండిత్యమును శౌర్యధైర్యగాంభీర్యసాహసౌదార్యముల, విజయోత్సాహముల, నెట్లు లోకమునకు వెల్లడించి మనకు మహోపకారం బొనర్చిరో తెలిసికొనవచ్చును.



ఉసాయీలు, డప్లాలు, నాగజాతులమధ్య రాజాజీ-గవర్నర్ జనరలు అస్సాం పోయినపుడు కొండజాతులవారినిచూచిరి




రాజ్యాంగపరిషత్తు ఆమోదించిన నవభారత రాజ్యాంగముపై అధ్యక్షుడు డా॥ రాజేంద్రప్రసాద్ సంతకముచేసిన సందర్భంలో, బొంబాయి ప్రధాని బి. జి. ఖేర్. వారిని అభినందిస్తున్నారు.




ఇరాన్ పాలకుడు మహమ్మద్ రిజాషా పహ్లవి షహీంషాగారికి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ స్వాగతమొసంగి వెంటగొనిపోవుట.


ఐక్యరాజ్యసమితి శాశ్వతకార్యాలయాల నిర్మాణం



న్యూయార్కు నగరంలోని మన్‌హట్టన్ ప్రాంతంలో ఐక్యరాజ్యసమితి శాశ్వత కార్యాలయాలు నిర్మిస్తున్నారు. పై చిత్రం, వీటిని తయారుచేయటానికిగాను ఇంజనీర్లు ముందుగా తయారుచేసుకున్న నమూనా. కుడిచేతి ప్రక్కను ఎత్తుగా, సన్నటి చీలికగా వున్న నిర్మాణం సభాభవనం. ఎడమచేతి వైపున వున్న 30 అంతస్థుల, పెద్ద ఎత్తయిన నిర్మాణం, ప్రతినిధివర్గాల బసలు.



ఐక్యరాజ్యసమితి ఉద్యోగుల కార్యాలయం-ఉక్కు చట్రాన్ని ముందు నిర్మిస్తున్నా



ఐక్యరాజ్యసమితి ఉద్యోగుల కార్యాలయానికి అల్యూమినం చట్రాలలో ఇ
ర్చిన అద్దాలకిటికీలు 5000 వుంటవి. మొత్తం 6యెకరాల విస్తీర్ణంగల అద్దాలను ఈ
నానికి వినియోగించుతున్నారు. ఉక్కుచట్రంపైన, అంతస్తుపై అంతస్తు నిర్మా
జరిగిపోతుంటే, కిందినుంచి కిటికీలు దర్వాజాలు అమర్చి వేస్తున్నారు. ఈ నిర్మా
1951 జనవరి మొదటి తేదీకి తయారైపోవాలి.

Red. No. M. 4479

శ్రీమద్భగవద్గీత



సంస్కృత మూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు.


వెల. రు 4-0-0 లు.

తపాలా ఖర్చు అ. 0-9-0.

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212 మదరాసు 1.

కళాప్రపూర్ణ కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావుగారి ఉత్కృష్టరచన



ఆంధ్రవాఙ్మయ చరిత్ర

సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయచరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రలనన్నిటిని అవలోడన చేసి, సమన్వయించి క్రోడీకరించిన సినలయినచరిత్ర. శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైలుపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు 0-7-0 ఆంధ్రగ్రంథమాల, పో. బా. 212, మద్రాసు.

గాంధీ మహాత్ముని

ఆత్మకథ

రెండు సంపుటములు

[చతుర్థ ముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా వెల రూ. 5-9-0

ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో ,, 10-12-0

ఆంధ్ర గ్రంథమాల, పోస్టుబాక్సు నెం. 212, మదరాసు 1.

తెలుగుమెఱుగులు

గ్రంథకర్త: వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

తెలుగుదనము, తెలుగుసంప్రదాయాలు, తెలుగుభాష అవతరించిన విధము, తెలుగు తేటదనము, తెలుగు కవితా పారమ్యము, ప్రాచీన గ్రంథాల పలుకుబడికి మనపై చెల్లుబడి, కృతజ్ఞమైన మన అరసున్న చరిత్ర, వింత వింత నిఘంటువులు, మన గ్రంథాలలో గ్రంథులు, అవీ ఇవీ, ఇంకా తెలుగులో ఉన్న ఎన్నో మెఱుగులను చూపెట్టుచున్న వ్యాసముల సంపుటి. శాస్త్రిగారి పాతిక ముప్ఫయి సంవత్సరాల సాహిత్య కృషి ఇందులో మూర్తీభవించియున్నది. ఆంధ్రాభిమానముగల వారందరు అవశ్యము చదువవలసిన గ్రంథము. ప్రతులకు త్వరపడవలెను.

వెల ౨ రూ. తపాలాఖర్చులు ౭ అణాలు.

ఆంధ్రగ్రంథమాల

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras.